తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
శనివారం 01.03.2025 | సంపుటి : 11 సంచిక : 229 | పేజీలు : 12 వెల: రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370

ప్రకటనల కోసం సంప్రదించండి 9848328698

సామాన్యుని స్వరం
జనంసాక్షి tv
JANAMSAKSHI TV

తెలంగాణ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

## మామునూరు కల.. నెరవేరిన వేళ

**విమానాశ్రయ విస్తరణకు కేంద్రం ఆమోదం**

**ఉత్తర్వులు జారీ చేసిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**వరంగల్ నగర ప్రజలకు కేంద్రం శుభవార్త అందించింది. ఎన్నో ఏళ్లుగా ఎదురుచూస్తున్న ఎయిర్‌పోర్ట్ కలనినెరవేర్చింది. వరంగల్ జిల్లాలోని మామూనూర్‌లో విమానాశ్రయ అభివృద్ధికి కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ మేరకు కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు ఉత్తర్వులు జారీ చేశారు. మాముసూరు ఎయిర్‌పోర్టుకు కేంద్రం అనుమతి ఇవ్వడంపై సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి కొండ సురేఖ, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. శంషాబాద్ నుంచి 150 కిలోమీటర్ల దూరంలో మరో ఎయిర్‌పోర్టు ఉండరాదని జిఎంఆర్ సంస్థ గతంలో ఒప్పందం చేసుకుంది. అయితే రాష్ట్ర ప్రభుత్వం, రామ్మోహన నాయుడు జరిగిన చర్చల తర్వాత జిఎంఆర్ సంస్థ కూడా ఎలాంటి అభ్యంతరం లేదని తెలపింది. దీంతో విమానాశ్రయ పనులు చేపట్టేందుకు పౌరవిమానయాన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటికే ఎయిర్‌పోర్ట్ పరిధిలో 696 ఎకరాల స్థలం

మిగతా 2లో..





# డిలిమిటేషన్ పేరుతో దక్షిణాదిలో సీట్లు తగ్గించే కుట్ర

## తెలంగాణకు సైంధవుడిలా మారిన కిషన్‌రెడ్డి : సీఎం రేవంత్

- ఆయన వల్లే రాష్ట్రానికి మెట్రో ప్రాజెక్టు అనుమతి లభించడంలేదు
- గుజరాత్‌లో సబర్మతి సుందరీకరణను ప్రశంసించి తెలంగాణలో మూసీ ప్రక్షాళన ప్రాజెక్టును మాత్రం వ్యతిరేకిస్తున్నారు
- రాష్ట్రానికి ప్రత్యేకంగా మీరు తీసుకొచ్చిందేమిటో చెప్పాలి
- తెలంగాణ చెల్లించిన పన్నుల్లో పావలా కూడా రాష్ట్రానికి రావట్లేదు
- కేంద్ర ప్రభుత్వం నిధులన్నీ యూపీ, బిహార్‌లకే ఇస్తోంది
- గాంధీభవన్‌లో మీడియా సమావేశంలో ముఖ్యమంత్రి ధ్వజం

**హైదరాబాద్(జనంసాక్షి):** డీలిమిటేషన్ పేరిట దక్షిణాదికి అన్యాయం చేసేందుకు భాజపా కుట్ర చేస్తోంది. ఉత్తరాదిలో సీట్లు పెంచుకొని ఆ రాష్ట్రాల సీట్లతోనే అధికారంలోకి రావాలని భాజపా చూస్తోంది. ఇప్పటికే నిధులన్నీ ఉత్తరాది రాష్ట్రాలకు ఇస్తూ.. దక్షిణాదికి అన్యాయం చేస్తున్నారు. సీట్లు రాని దక్షిణాది రాష్ట్రాలను మాత్రం నిర్వీర్యం చేయాలని ప్రయత్నిస్తున్నారు" అని విరుచుకుపడ్డారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి వల్లే రాష్ట్రానికి ప్రాజెక్టులు రావడంలేదని.. తెలంగాణ పాలిట ఆయన సైంధవుడిలా మారారని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించారు. శుక్రవారం గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్ రెడ్డి, కేంద్ర ప్రభుత్వం తీరుపైనా తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. కిషన్ రెడ్డి వల్లే రాష్ట్రానికి మెట్రో ప్రాజెక్టు అనుమతి లభించడంలేదన్నారు. "మీరు ప్రత్యేకంగా తెలంగాణకు తీసుకొచ్చిన ప్రాజెక్టు ఏంటో చెప్పండి కిషన్ రెడ్డి గారూ.. నోరు వేసుకొని బెదిరిస్తే భయపడేవారు ఇక్కడెవరూ లేరు. మెట్రో, ఆర్ఆర్ఆర్ ప్రాజెక్టులను కిషన్ రెడ్డి అడ్డుకొంటున్నారు. సబర్మతి సుందరీకరణను ప్రశంసించిన కిషన్ రెడ్డి మూసీ ప్రక్షాళన ప్రాజెక్టును మాత్రం వ్యతిరేకిస్తున్నారు. మేం ప్రధాని మోదీ వ్యక్తిగత ఆస్తుల్ని అడగడంలేదు.

మిగతా 2లో..

### రాష్ట్రానికి నిధులు మంజూరు చేయించే బాధ్యత మీదే..

**కేంద్రమంత్రి కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్ 9 పేజీల సుదీర్ఘ లేఖ**

మెట్రో విస్తరణకు ఐదు కారిడార్ల ప్రతిపాదలు చేశామని వివరణ

తెలంగాణకు ఏం చేశారో చెప్పాలని లేఖలో పేర్కొన్న ముఖ్యమంత్రి

వార్త 2లో



## పేదల కోసం పనిచేయాలి

**వారి ముఖాల్లో నవ్వులు చూసినప్పుడే మనం సఫలమైనట్లు**

**కాంగ్రెస్‌లోనే అంతర్గత ప్రజాస్వామ్యం ఎక్కువ .. విభేదాలు అన్నవి ఉత్తిమాటలే**

**పీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో తెలంగాణ ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్**

- పదవులు రాలేదని ఎవరూ నిరుత్సాహపడొద్దు
- ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి
- రాహుల్ ప్రధాని అయితేనే దేశానికి రక్ష: : సీఎం రేవంత్
- భాజాపా పాలనలో అణచివేత విధానాలు : ఉత్తమ్

**హైదరాబాద్(జనంసాక్షి):** ప్రస్తుతం మన ప్రభుత్వంలో ఉన్నామని, పేదవాడి కోసం పని చేయాలన్నారు తెలంగాణ రాష్ట్ర ఏఐసీసీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్., ఈరోజు హైదరాబాద్ లో జరిగిన టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో ఆమె మాట్లాడారు.'ఇప్పుడు మనం ప్రభుత్వం లో ఉన్నాం.. పేద వాడి కోసం పని చేయాలి. పేదల మొఖంలో నవ్వులు చూడాలి.. అప్పుడే మనం పని చేసినట్టు. కాంగ్రెస్ కార్యకర్తలకు ఎంతో పోరాట శక్తి ఉంది.. అనేక రకాలుగా

మిగతా 2లో..



## శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలి

- యువతకు సూచించిన కేంద్రమంత్రి రాజ్‌నాథ్‌సింగ్
- యువతపైనే దేశ రక్షణ బాధ్యత: సీఎం రేవంత్‌రెడ్డి
- నేషనల్‌సైన్స్‌డే సందర్భంగా విజ్ఞాన్ వైభవ్ ప్రారంభం

**హైదరాబాద్(జనంసాక్షి):** శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలని యువతకు కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ పిలుపునిచ్చారు. గ్లోబల్ లీడర్ షిప్‌లో యువతదే కీలక పాత్ర అని ఆయన స్పష్టం చేశారు. నేషనల్ సైన్స్ డే సందర్భంగా హైదరాబాద్‌లోని విజ్ఞాన్ వైభవ్-2025ను సీఎం రేవంత్ రెడ్డితో కలిసి కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ ప్రారంభించారు. అనంతరం కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడుతూ.. సైన్స్ అండ్ టెక్నాలజీలో వచ్చే

మిగతా 2లో..

**మహిళల కోసం ప్రతి నియోజకవర్గానికో**

## మినీ ఇండస్ట్రియల్ పార్క్

**ఇందులో దళిత పారిశ్రామికవేత్తలకు 10 శాతం ప్రత్యేక రాయితీ**

**వారికి మరింత ప్రయోజనం కలిగేలా చర్యలు: మంత్రి శ్రీధర్ బాబు**



**హైదరాబాద్(జనంసాక్షి) :** లక్డీకాపూల్ రెడ్ హిల్స్‌లోని ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ(ఎఫ్ టీసీసీఐ) భవన్ లో శుక్రవారం ఎస్సీ, ఎస్టీ శాసనసభ్యులు, తెలంగాణ అసోసియేషన్ ఆఫ్ ఎస్సీ, ఎస్టీ ఎంటర్ ప్రైజెస్ సంయుక్తాధ్వర్యంలో నిర్వహించిన "రౌండ్ టేబుల్ కాన్ఫరెన్స్ ఆన్ ఎంఎస్ఎంఈ (ఎంఎస్ఎంఈ) 2024 ఎ టోకెన్ ఆఫ్ గ్రాటిట్యూడ్ టూ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ" కు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్ బాబు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గంలో 'మినీ ఇండస్ట్రియల్ పార్క్'ను మహిళల కోసం అభివృద్ధి చేస్తామని, ఈ పార్కుల్లో ఎస్సీ, ఎస్టీ మహిళా పారిశ్రామికవేత్తలకు 10 శాతం ప్రత్యేకంగా కేటాయిస్తామన్నారు. ఎస్సీ, ఎస్టీలు ఎదిగితేనే ఈ సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. చేవెళ్ల డిక్లరేషన్ లో దళితులకిచ్చిన ప్రతి హామీని సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రజా ప్రభుత్వం కచ్చితంగా నెరవేరుస్తుంది. కాంగ్రెస్ అంటేనే దళితులు.. దళితులు అంటేనే కాంగ్రెస్. దళితుల అభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేసే పార్టీ కాంగ్రెస్ పార్టీ మాత్రమే.. అని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఓ వైపు రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గాడిలో పెడుతూనే.. మరోవైపు సంక్షేమం, అభివృద్ధిపై దృష్టి సారించాం. 2017 నుంచి సబ్సిడీల కింద పారిశ్రామికవేత్తలకు అందాల్సిన బకాయిలు రూ. 4500 కోట్లకు పైగా ఉన్నాయి. వీటిలో రూ.2200 కోట్లు ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకే రావాలి. మేం అధికారంలోకి రాగానే ఈ బకాయిల చెల్లింపుపై దృష్టి సారించాం. వచ్చే నెల(మార్చి) చివరి నాటికి రూ.300 కోట్లు చెల్లిస్తాం.దేశంలో ఎక్కువ మంది కార్మికులు ఎంఎస్ఎంఈ రంగంలోనే ఉపాధి పొందుతున్నారు. కానీ.. దురదృష్టవశాత్తు ఇప్పటీ వరకూ ఎంఎస్ఎంఈలకు ప్రత్యేకంగా పాలసీ అంటూ ఏదీ లేదు. రాహుల్ గాంధీ సూచనల మేరకు మేం ప్రత్యేకంగా పాలసీని తీసుకొచ్చాం.

మిగతా 2లో..



**టీబీఎం ముందుభాగంలో**

## మెత్తని భాగాల గుర్తింపు

**ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌లో సహాయక చర్యల్లో కీలక పురోగతి!**

**గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ టెక్నాలజీ ద్వారా సొరంగం స్కానింగ్**

**నాగర్‌కర్నూల్(జనంసాక్షి):**శ్రీశైలం ఎడమ గట్టు కాలువ సొరంగం (ఎస్ఎల్‌బీసీ)లో చిక్కుకున్న వారి కోసం ముమ్మరంగా చేపట్టిన సహాయక చర్యల్లో కీలక పురోగతి కనిపించింది.టన్నెల్‌లో చిక్కుకున్న వారి ఆచూకీని గుర్తించేందుకు పలువిధాలా గాలింపు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా గ్రౌండ్ పెనిట్రేటింగ్ రాడార్ టెక్నాలజీ ద్వారా సొరంగం స్కానింగ్ చేస్తుండగా.. ఐదు

మిగతా 2లో..

## ఎల్ఎల్‌బీసీని ఎందుకు పట్టించుకోలేదు?

**పదేళ్లు పాలించిన వారు ప్రాజెక్టును ఎందుకు పక్కనపెట్టారు?**

**ఘటనపై హరీశ్ కావాలనే రాజకీయాలు చేస్తున్నారు**

**మంత్రి జూపల్లి ఆగ్రహం**

**హైదరాబాద్(జనంసాక్షి):** ఎస్ఎల్‌బీసీ వద్ద ప్రమాదం వ్యవహారంలో రాజకీయ దురుద్దేశంతోనే మాజీ మంత్రి హరీశ్ రావు విమర్శలు చేస్తున్నారని మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. పదేళ్లు రాష్ట్రాన్ని పాలించిన భారాస.. ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టును ఎందుకని పెండింగ్ పెట్టిందని ప్రశ్నించారు. ఈ మేరకు గాంధీ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మంత్రి మాట్లాడారు." హరీశ్‌రావును నేను సూటిగా ప్రశ్నిస్తున్నా. ఎస్ఎల్‌బీసీ టన్నెల్‌ను 200 మీటర్లు తవ్వి మిగతాది ఎందుకు వదిలేశారు? తక్కువ లాభం వస్తుందనా? టన్నెల్

మిగతా 2లో..

**తెలంగాణ పెట్టుబడులకు**

## స్వర్గధామం

**దావోస్‌లో రికార్డు స్థాయిలో పెట్టుబడులు ఆకర్షించాం**

**యూరోపియన్ యూనియన్ దేశాలు భారత్ రాష్ట్రాలతో నేరుగా పనిచేయవచ్చు .. సీఐఐ సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పెట్టుబడులకు యువ రాష్ట్రమైన తెలంగాణ స్వర్గధామం లాంటిదని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు అన్నారు.యూరోపియన్ యూనియన్ అధ్యక్షుడు ఉర్సుల ఓన్ ఢిల్లీ పర్యటన నేపథ్యంలో శుక్రవారం సాయంత్రం ఢిల్లీలో కాన్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ (సీఐఐ) ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన విందు సమావేశంలో తెలంగాణ రాష్ట్ర ప్రతినిధిగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మల్లు హాజరై భారతదేశ వాణిజ్య అభివృద్ధిలో తెలంగాణ పాత్రను, రాష్ట్రంలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను అతిథులకు వివరించారు. సమావేశములో యూరోపియన్ యూనియన్ కమిషన్ సభ్యులు, యూరప్ దేశాల రాయబారులు, కేంద్ర ప్రభుత్వ ఉన్నతాధికారులు పాల్గొన్నా రు. భారత దేశంలోని 28 రాష్ట్రాల్లో వ్యాపార అనుకూల విధానాలు రూపొందించడం, క్షేత్రస్థాయిలో అమలు చేయడంలో విశేష ప్రతిభ కనబరుస్తూ అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో తెలంగాణ ముందంజలో ఉందని

మిగతా 2లో..



## హరీశ్‌రావుపై మరో కేసు

**నమోదు చేసిన బాచుపల్లి పోలీసులు**

**హైదరాబాద్(జనంసాక్షి):**బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి హరీష్ రావుపై మరో కేసు నమోదు అయింది. బాచుపల్లి పోలీసులు ఆయనపై కేసు నమోదు చేశారు. హరీష్‌రావు, ఆయన అనుచరులు బెదిరిస్తున్నారని కాంగ్రెస్ నేత చక్రధర్ గౌడ్ బాచుపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఏ -1 గా వంశీ కృష్ణ, ఏ -2 గా హరీష్ రావు, ఏ-3 సంతోష్‌కుమార్, ఏ-4గా పరుశురాములు పేర్లు చేర్చారు. బీఎస్ఎన్ యాక్ట్ పకారం కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

**ఉత్తరాఖండ్‌లో**

## పెను ప్రమాదం

**బద్రీనాథ్‌లో విరిగిపడిన మంచుచరియలు**

**చిక్కుకున్న 41 మంది కార్మికులు**



**బద్రీనాథ్(జనంసాక్షి):**ఉత్తరాఖండ్‌లో పెను ప్రమాదం చోటుచేసుకుంది. గత కొన్ని రోజులుగా ఇక్కడ భారీగా మంచు కురుస్తుండటంతో శుక్రవారం ఉదయం మంచు చరియలు విరిగిపడ్డాయి.వాటికింద పదుల సంఖ్యలో కార్మికులు చిక్కుకుపోయారు. బద్రీనాథ్ ధామ్‌లోని జాతీయహైవేపై ఈ ఘటన చోటుచేసుకుంది. సమాచారమందుకున్న పోలీసులు, బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్ (బీఆర్ఓ) సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకొని సహాయక చర్యలు చేపట్టారు. కార్మికులు అక్కడ రోడ్డు నిర్మాణ పనులు చేస్తుండగా ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది.బద్రీనాథ్‌కు సమీపంలో ఉన్న మనా గ్రామంలోని బీఆర్ఓ క్యాంప్‌కు సమీపంలోనే ఈ ఘటన చోటుచేసుకుంది. మొత్తం 57 మంది కార్మికులు మంచు చరియల కింద చిక్కుకుపోయినట్లు బీఆర్ఓ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీఆర్ మీనా వెల్లడించారు. ఇందులో 16 మందిని రక్షించి క్యాంప్‌కు తరలించారు. వీరిలో నలుగురి పరిస్థితి విషమంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. మిగతా 41 మంది కోసం గాలింపు

మిగతా 2లో..

## సుంకాల పేరుతో బెదిరింపులు సరికాదు

**అమెరికా బ్లాక్‌మెయిల్‌కు పాల్పడుతోంది : చైనా**

**బీజింగ్(జనంసాక్షి):**అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సుంకాలు పెంచుతూ తీసుకున్న నిర్ణయంపై పలు దేశాల నుంచి తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ వ్యవ హారంపై తాజాగా చైనా కూడా కీలక వ్యాఖ్యలు చేసింది. ఫెంటనిల్ అంశాన్ని వాడుకుంటూ సుంకాల పేరుతో ఒత్తిడి చేయ డంతోపాటు బ్లాక్‌మెయిల్‌కు పాల్పడు తోందని ఆరోపించింది. చైనా దిగుమ తులపై 10శాతం అదనపు సుంకాలు విధిస్తామని ట్రంప్ హెచ్చరికల నేపథ్యంలో డ్రాగన్ ఈ విధంగా స్పందించింది."టారిఫ్ ఒత్తిడిలు, బ్లాక్‌మెయిల్ కోసం ఫెంటనిల్ అంశాన్ని అమెరికా వాడుకుంటోంది. ఈ పరిణామాలు తీవ్ర ప్రభావం చూపడమే కాకుండా,



ఒత్తిడి, నిర్బంధం, మాదకద్ర వ్యాల నియంత్రణలో ఇరుదేశాల మధ్య చర్చలు, సంప్రదింపులకు ముప్పుగా మారుతుంది" అని చైనా విదేశాంగశాఖ అధికార ప్రతినిధి లిన్ జియాంగ్ పేర్కొన్నారు. అ యితే, పరిస్థితులు మారకుంటే ఈ చర్యలకు ఎదురు దెబ్బ తప్పదని హెచ్చరించారు.

మిగతా 2లో..

## భూ, కార్మిక రంగంలో సంస్కరణలు అవసరం

**భారత్ అధిక ఆదాయ దేశంగా మారాలంటే ఇవి తప్పనిసరి : ప్రపంచ బ్యాంకు**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**స్వాతంత్ర్యం సిద్ధించి 100 సంవత్సరాలు (2047) అయ్యే సమయానికి అభివృద్ధి చెందిన (వికసిత్ భారత్) దేశంగా అవతరించాలన్న లక్ష్యంతో భారత ప్రభుత్వం ముందుకు సాగుతోంది. దీని కోసం అనేక కార్యక్రమాలు చేపడుతోంది. అయితే భారత్ అధిక ఆదాయ దేశంగా మారాలంటే 7.8 శాతం వృద్ధి రేటును సాధించాలని ప్రపంచ బ్యాంకు తాజాగా విడుదల చేసిన తన ఇండియా కంట్రీ మెమోరాండమ్‌లో వెల్లడించింది. ఈ లక్ష్యాన్ని చేరుకోవాలంటే దేశ స్థూల జాతీయ ఆదాయం ప్రస్తుత స్థాయి కంటే దాదాపు 8 రెట్లు పెరగాలని తెలిపింది.

మిగతా 2లో..




**కమలనాథుడి ఎంపికకు**

## ముమ్మర కసరత్తు

**బిజెపి జాతీయ అధ్యక్షుడి రేసులో ముందున్న శివరాజ్ సింగ్ చౌహాన్**

**న్యూఢిల్లీ,ఫిబ్రవరి28(జనంసాక్షి)** భారతీయ జనతా పార్టీకి త్వరలో కొత్త అధ్యక్షుడు రాబోతున్నాడన్న వార్తల నేపథ్యంలో.. అధ్యక్షపీఠం ఎవరిని వరిస్తుందో అన్న చర్చ సాగు తోంది. పార్టీకి

మిగతా 2లో..

## బాబూ రాజేంద్రప్రసాద్‌కు సిఎం నివాళి

**హైదరాబాద్(జనంసాక్షి):**ప్రముఖ స్వాతంత్య్ర సమరయోధుడు, భారత దేశ తొలి రాష్ట్రపతి డాక్టర్ బాబు రాజేంద్ర ప్రసాద్ వర్ధంతి సందర్భంగా జాతి ఆయనకు నివాళి అర్పించింది. రాజ్యాంగపరిషత్ ఛైర్మన్‌గా, స్వతంత్ర భారత తొలి రాష్ట్రపతిగా ఆయన జాతికి సేవ చేశారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ నివాసంలో ఆ మహనీయుడి చిత్రపటానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పుష్పాంజలి ఘటించారు. ఆబూ సేవలను స్మరించుకున్నారు.

## సుంకాల పేరుతో బెదిరింపులు సరికాదు

అమెరికా విదేశాంగశాఖ కార్యదర్శి మార్కో రుబియో కూడా ఇదే అంశంపై మాట్లాడుతూ.. చైనాపై తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఫెంటనిల్‌పై చైనా రివర్స్ యుద్ధం చేస్తోందని ఆరోపించారు. ఉద్దేశపూర్వకంగానే అమెరికాలోకి దానిని పెద్దఎత్తున పంపిణీ చేస్తుండవచ్చనే అనుమానం వ్యక్తం చేశారు. చైనా కామర్స్ మినిస్ట్రీ స్పందిస్తూ.. అత్యంత కఠినమైన మాదక ద్రవ్యాల నిరోధక విధానాలు అమలు చేస్తున్నామని పేర్కొంది. వీలైనంత త్వరగా అమెరికా చర్చలు జరపాలని చూస్తున్నామని, లేదంటే ప్రతీకారం తప్పదని హెచ్చరించింది.మెక్సికో, కెనడాల దిగుమతులపై ప్రతిపాదించిన 25శాతం సుంకాలు మార్చి 4వ తేదీ నుంచి అమల్లోకి రానున్నట్లు డొనాల్డ్ ట్రంప్ పేర్కొన్న విషయం తెలిసిందే. అటు మిత్ర దేశాలపైనా త్వరలోనే 25శాతం సుంకాలను విధిస్తానని స్పష్టం చేశారు. ఇక చైనా ఉత్పత్తులపై ఇప్పటికే 10శాతం సుంకాలు విధించిన ట్రంప్.. అదనంగా మరో పది శాతం విధిస్తున్నట్లు ప్రకటించారు. వీటిపై ఇప్పటికే తీవ్ర వ్యతిరేకత వ్యక్తమవుతుండగా.. రెండో విడత ప్రతీకార సుంకాలను ఏప్రిల్‌లో ప్రారంభించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయని ట్రంప్ చెప్పడం గమనార్హం.

## భూ, కార్మిక రంగంలో సంస్కరణలు అవసరం

ఆర్థికరంగంతో పాటు భూ, కార్మిక రంగంలో సంస్కరణలు అవసరమని పేర్కొంది. ఇందుకోసం ప్రస్తుతం ఉన్న కార్యక్రమాలను కొనసాగించడమే కాకుండా.. నూతన సంస్కరణలను విస్తరించడం ముఖ్యమని సూచించింది. 2047 నాటికి భారత్ అధిక ఆదాయ దేశంగా మారాలంటే రాబోయే దశాబ్దాల్లో భారతదేశ వృద్ధి రేటు సగటున 7.8 శాతంగా ఉండాలని.. కేవలం వేగవంతమైన సంస్కరణల ద్వారానే ఇది సాధ్యమవుతుందని నివేదిక తెలిపింది. 2000–2024 మధ్య భారత్ వృద్ధి రేటు సగటున 6.3 శాతంగా ఉందని వెల్లడించింది. గ్లోబల్ మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా మారడానికి ఇటీవలి కాలంలో భారత్ అనేక నిర్మాణాత్మక సంస్కరణలను ప్రవేశపెట్టిందని.. వీటిలో భాగంగా మౌలిక సదుపాయాల కల్పన, మానవ మూలధనాన్ని మెరుగుపరచడం, స్థూల ఆర్థిక స్థిరత్వాన్ని పెంపొందించడం వంటి సంస్కరణలు చేపట్టిందని తెలిపింది. చిలీ, కొరియా, పోలండ్ వంటి దేశాలు ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో ఏ విధంగా భాగమై మధ్య స్థాయి నుంచి అధిక ఆదాయ దేశాలుగా మారాయనే విషయాన్ని భారత్ అధ్యయనం చేయాలని ప్రపంచ బ్యాంక్ ఇండియా కంట్రీ డైరెక్టర్ అగస్టే టానో కౌమే సూచించారు. భారత్ తన లక్ష్యాన్ని చేరుకోవడం కోసం మరిన్ని ఉద్యోగాల కల్పన, పెట్టుబడుల్లో మెరుగుదల, మహిళా శ్రామిక శక్తి భాగస్వామ్య రేట్లను 35.6 శాతం నుంచి 50 శాతానికి పెంచడం వంటి చర్యలు తీసుకోవాలని అన్నారు. 2000 నుంచి ఇప్పటి వరకు దేశ ఆర్థిక వ్యవస్థ దాదాపు నాలుగు రెట్లు.. తలసరి ఆదాయం మూడు రెట్లు పెరిగిందని నివేదికలు పేర్కొంటున్నాయి. 2000లో ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో 1.6 శాతంగా ఉన్న భారత్ వాటా 2023 నాటికి 3.4 శాతానికి రెట్టింపు అయింది. ప్రస్తుతం భారత్ ఐదో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించినట్లు నివేదికలు చెబుతున్నాయి. పేదరికంలో తగ్గుదల, మౌలిక సదుపాయాల విస్తరణ, సేవ, డెలివరీ రంగాలలో వృద్ధి దీనికి కారణమయ్యాయి.

## కమలనాధుడి ఎంపికకు ముమ్మర కసరత్తు

విధేయకంగా ఉండడంతో పాటు సంఘ్, పరిషత్ అనుభవం ఉంటే అదనపు ఆకర్షణ కాగలదు. మరోవైపు పార్టీని నడిపించే సత్తా కూడా ముఖ్యం. వివిధ రాష్ట్రాలతో పరిచయం, అందరినీ కలుపుకుపోవడం వంటివికూడా మరీ ముఖ్యం. దీనికితోడు ఛరిష్మా కూడా అసవరం ఉంటుంది. ప్రస్తుతం పార్టీలో సంస్థాగత ఎన్నికలు జరుగుతుండగా త్వరలోనే జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే పక్రియ చేపట్టనున్నట్లు తెలుస్తోంది. మార్చి 15లోగా దీనిపై పార్టీ నూతన అధినేత పేరును ప్రకటించే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈమేరకు విశ్వసనీయ వర్గాలను ఉటంకిస్తూ పలు ఆంగ్ల మీడియా కథనాలు వెల్లడించాయి. దీంతో నడ్డా వారసుడెవరు అనేది ఆసక్తికరంగా మారింది. భాజపా రాజ్యాంగం ప్రకారం.. జాతీయ అధ్యక్షుడిని ఎన్నుకునే పక్రియను ప్రారంభించే ముందు కనీసం సగం రాష్ట్ర యూనిట్లలో సంస్థాగత ఎన్నికలు పూర్తి చేయాలి. ఇప్పటివరకు 12 రాష్ట్రాల్లో ఆ పక్రియ పూర్తయ్యింది. జాతీయ అధ్యక్షుడి ఎన్నిక కోసం కనీసం మరో ఆరు రాష్ట్రాల్లో యూనిట్ చీఫ్‌లను ఎన్నుకోవాల్సి ఉంటుంది. దీంతో భాజపా తమ కార్యాచరణను ముమ్మరం చేసింది. వచ్చే ఏడాది అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న తమిళనాడు, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, అస్సాం, గుజరాత్ రాష్ట్రాల్లో పార్టీ సంస్థాగత ఎన్నికల ప్రణాళికలు చేపట్టింది. మరోవైపు.. జాతీయఅధ్యక్షుడి పదవికి ప్రతిపాదిత పేర్లను సూచించాలని రాష్ట్ర ఇన్‌ఛార్జ్‌లను అధిష్ఠానం కోరింది. 2019లో భాజపా అధికారంలోకి వచ్చిన తర్వాత 2020లో జేపీ నడ్డా జాతీయ అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గతేడాది లోక్‌సభ ఎన్నికల దృష్ట్యా ఆయన పదవీకాలాన్ని పొడిగించారు. నడ్డా నాయకత్వంలో వివిధ రాష్ట్రాలకు జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లోనూ భాజపా సత్తా చాటింది. దీంతో మూడోసారి అధికారంలోకి వచ్చిన కాషాయ పార్టీ.. నడ్డాను కేంద్ర మంత్రివర్గంలోకి తీసుకొని ఆరోగ్యశాఖ బాధ్యతలు అప్పగించింది. ఈక్రమంలోనే పార్టీ అధ్యక్ష బాధ్యతలను మరో నాయకుడికి అప్పగించేందుకు సిద్ధమైంది. అయితే, ఈ పదవికి ఎవరిని తీసుకోనున్నారనేది ఇప్పుడు ఉత్కంఠగా మారింది. రేసులో పలువురి పేర్లు తెర పైకి వస్తున్నాయి. మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్, రాజస్థాన్ మాజీ సీఎం వసుంధర రాజే, పార్టీ జనరల్ సెక్రటరీ సునీల్ బన్సల్, మహారాష్ట్ర భాజపా అగ్రనేత వినోద్ తావడే పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. అయితే బిజెపిలో పేర్లు ప్రచారంలో ఉన్నా...అప్పటికప్పుడు మళ్లీ కొత్త పేర్లు వస్తుంటాయి. అయితే శివరాజ్ సింగ్ చౌహాన్ పేరు ప్రముఖంగా వినపడుతోంది.

## టీబీఎం ముందుభాగంలో మెత్తని భాగాల గుర్తింపు

చోట్ల మెత్తని భాగాలు ఉన్నట్లు స్కానింగ్‌లో గుర్తించారు. టీబీఎం ముందు భాగం, దెబ్బతిన్నభాగంలో ఐదు మెత్తని భాగాలను గుర్తించారు. దీంతో చిక్కుకుపోయిన వారు అక్కడే ఉన్నట్లుగా సహాయక సిబ్బంది భావిస్తున్నారు.మరోవైపు, ఆ మెత్తని భాగాలు మానవ దేహాలు కావచ్చు.. కాకపోవచ్చు అని అధికారులు పేర్కొంటున్నారు. మెత్తని భాగాలు ఉన్నచోట తవ్వకాలు జరపనున్నారు. తవ్విన తర్వాత మానవ దేహాలా కాదా అనేది స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అలాగే, ఈ ఘటనలో గల్లంతైనవారి పరిస్థితిపై కాసేపట్లో అధికారిక సమాచారం వచ్చే అవకాశం ఉంది.

తప్పుడు వార్తల్ని నమ్మొద్దు: కలెక్టర్

టన్నెల్‌లో మృతదేహాలు లభించాయనేది అవాస్తవమని నాగర్‌కర్నూలు కలెక్టర్ సంతోష్ స్పష్టంచేశారు. తప్పుడు వార్తలను ఎవరూ నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని చెప్పారు. ఏదైనా సమాచారం ఉంటే.. తామే వెల్లడిస్తామన్నారు.

## ఎల్‌ఎల్‌బీసీని ఎందుకు పట్టించుకోలేదు

నిర్మాణం పూర్తి అయితే కాంగ్రెస్‌కు పేరు వస్తుందనా? నా మూడు ప్రశ్నలకు ఆయన సమాధానం చెప్పాలి. ప్రకృతి విపత్తులనూ భారాస నేతలు రాజకీయంగా వాడుకుంటున్నారు. అతి తక్కువ ఖర్చుతో పూర్తయ్యే ఎస్‌ఎల్‌బీసీని ఎందుకు పెండింగ్‌లో పెట్టారు? ఈ ప్రాజెక్టు గురించి మాట్లాడే హక్కు భారాసకు లేదు. అద్భుతం జరిగితే తప్ప టన్నెల్‌లో చిక్కుకున్న 8 మంది బతికే అవకాశం లేదు. సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ప్రమాదం జరిగినప్పుడు పనులు చేపట్టిన సంస్థ ప్రతినిధులు అప్రమత్తం చేసి ఉండకపోతే 40 మంది వరకు కార్మికులు చనిపోయేవారు" అని మంత్రి పేర్కొన్నారు.

## డిలిమిటేషన్‌లో దక్షిణాదిలో
# సీట్లు తగ్గించే కుట్ర

రాష్ట్రం నుంచి కేంద్రానికి భారీగా పన్నులు వెళు న్నాయి. తెలంగాణ చెల్లిం చిన పన్నుల్లో పావలా కూడా రాష్ట్రానికి రావట్లేదు. కేంద్ర ప్రభుత్వం నిధులన్నీ యూపీ, బిహార్‌లకే ఇస్తోంది" అని విమర్శిం చారు."తెలంగాణలో ప్రాజెక్టుల గురించి కేంద్ర మంత్రి వర్గంలో ఎప్పుడైనా ప్రస్తావిం చారా?ఇప్పటివరకు ఎన్ని ప్రాజెక్టులను మీరు రాష్ట్రానికి సాధించారు. తెలంగాణ కోసం కేంద్రాన్ని ఏం అడిగారో చెప్పండి. మీరు ప్రస్తావించినవేంటో చెప్పండి. మీకు చిత్తశుద్ధి లేదు. సైంధవ పాత్ర పోషిస్తున్నారు. మీ చిత్తశుద్ధిని నిరూపించుకోవాలంటే ఈ ప్రాజెక్టులన్నింటికీ అనుమతులు తీసుకొని హైదరాబాద్‌కు రావాలి. గతంలో ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. ఎన్ని కోట్ల మందికి ఇచ్చారో చెప్పండి. తెలంగాణలో కేంద్రం ఎన్ని ఇళ్లు ఇచ్చిందో చెప్పండి. రైతులకు నల్ల చట్టాలు తీసుకొచ్చి కేంద్రం వందల మందిని బలితీసుకుంది. మెట్రో నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం వద్ద నిధులు ఉన్నాయా అని కిషన్ రెడ్డి అవహేళన చేస్తున్నారు. మేం దిల్లీకి వెళ్లి లిక్కర్ దందాలు చేయడంలేదు. రాష్ట్రానికి రావాల్సిన నిధుల కోసం వెళ్తున్నాం" అన్నారు.ఏ రాష్ట్రంపైనా ఒక భాషను బలవంతంగా రుద్దొద్దు. మన మాతృభాష తెలుగు పరిరక్షణకు మేం కట్టుబడి ఉన్నాం. ప్రభుత్వం అన్ని జీవోలను తెలుగులో కూడా ఇస్తోంది. డీలిమిటేషన్ వల్ల దక్షిణాదిలో ఎంపీ సీట్లు తగ్గవని కేంద్ర హోంమంత్రి అమిత్ షా చెబుతున్నారు. సీట్లు తగ్గవు అంటున్నారు.. కానీ పెరుగుతాయని మాత్రం ఎక్కడా చెప్పట్లేదు.

## యువత శాస్త్రవేత్తలను ఆదర్శంగా తీసుకోవాలి

మార్పుల పట్ల విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలన్నారు. రక్షణ శాఖ చారిత్రాత్మక విజయాల్లో కేంద్రం విశేష పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అయితే గత కొద్ది సంవత్స రాలుగా ఈ శాఖకు తాను మంత్రిగా ఉండడం తన అదృష్టంగా భావిస్తున్నాన్నారు. మానవుని మేధ సంపత్తు చాలా గొప్పదని చెప్పారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రక్షణ శాఖలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో దేశం కొత్త ఒరవడిని సృష్టిస్తోందని పేర్కొన్నారు. దేశంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థ బలోపే తమవుతోందన్నారు. అన్ని రంగాల్లో భారత్ అగ్రగా మిగా మారుతోందని చెప్పారు. రక్షణ శాఖ చారిత్రా త్మక విజయాల్లో కేంద్రం విశేష పాత్ర పోషిస్తుందని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. అయితే గత కొద్ది సంవత్సరాలుగా ఈ శాఖకు తాను మంత్రిగా ఉండడం తన అదృష్టంగా భావిస్తున్నా న్నారు. మానవుని మేధ సంపత్తు చాలా గొప్పదని చెప్పారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో వస్తున్న మార్పులకు అనుగుణంగా రక్షణ శాఖలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని కేంద్ర మంత్రి రాజ్‌నాథ్ సింగ్ తెలిపారు. సైన్స్ అండ్ టెక్నాలజీలో దేశం కొత్త ఒరవడిని సృష్టిస్తోందని పేర్కొన్నారు. దేశంలో పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా ఆర్థిక వ్యవస్థ బలోపేతమవుతోందన్నారు. అన్ని రంగాల్లో భారత్ అగ్రగామిగా మారుతోందని చెప్పారు.

కొన్నాళ్లపాటు తాను సైన్స్ అధ్యాపకుడిగా పని చేశానని కేంద్రమంత్రి రాజ్‌నాథ్ సింగ్ వెల్లడించారు. జాతీయ సైన్స్ దినోత్సవం సందర్భంగా డీఆర్‌డీవో విజ్ఞాన్ భవన్‌లో నిర్వహించిన ప్రదర్శనకు కేంద్ర రక్షణమంత్రి హాజరై ప్రసంగించారు.నోబెల్ గ్రహీత సర్ సీవీ రామన్ ఫిబ్రవరి 28న రామన్ ఎఫెక్ట్‌ను కనుగొన్నారని.. ఆయన గౌరవార్థం ఏటా ఈరోజును జాతీయ సైన్స్ దినోత్సవంగా నిర్వహించుకుం టున్నామని గుర్తు చేశారు. ప్రస్తుతం వ్యవసాయంతో పాటు అన్ని రంగాల్లో సైన్స్ ముఖ్యపాత్ర పోషిస్తోందని పేర్కొన్నారు. తాను కూడా సైన్స్ విద్యార్థినేనని.. కొన్నాళ్లు సైన్స్ అధ్యాపకుడిగా కూడా పనిచేసినట్లు పునరుద్ఘాటించారు. సైన్స్ వల్ల కలిగే ప్రయోజనాలను విద్యార్థులు గమనించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో పాల్గొన్న విద్యార్థులనుద్దేశించి ప్రసంగించడం ఎంతో సంతోషంగా ఉందని అన్నారు. మానవ పరిణామ క్రమాన్ని, సైన్స్ అభివృద్ధిని విద్యార్థులు అధ్యయనం చేయాలని సూచించారు. ఇన్నోవేషన్, దేశ ప్రగతిలో విద్యార్థులదే కీలకపాత్రన్న ఆయన.. అందుక నుగుణంగా కొత్త ఆవిష్కరణలకు అలవాటుపడాలని పిలుపునిచ్చారు. ప్రపంచవ్యాప్తంగా వస్తున్న మార్పులకనుగుణంగా ఉండాలన్నారు. నూతన ఆవిష్కరణలకు భారత్ హబ్‌గా రూపొందుతోందని పేర్కొన్నారు. దేశంలో సాంకేతికత వేగంగా అభివృద్ధి చెందుతోందని, రక్షణ రంగంలోనూ అనేక మార్పులు తీసుకొస్తోందని తెలిపారు.

**యువతపైనే దేశ రక్షణ బాధ్యత: సీఎం రేవంత్‌రెడ్డి**

దేశ రక్షణ బాధ్యత యువతపైనే ఉందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. దేశ రక్షణలో హైదరాబాద్ దశాబ్దాలుగా కీలక పాత్ర పోషిస్తోందన్నారు.గచ్చిబౌలి స్టేడియంలో డీఆర్‌డీవో ఆధ్వర్యంలో నిర్వహించిన 'విజ్ఞాన్ వైభవ్' ప్రదర్శనలో కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్‌తో కలిసి రేవంత్ రెడ్డి పాల్గొన్నారు.ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లా డుతూ.. దేశ రక్షణలో తెలంగాణ పాత్ర కీలకంగా ఉందన్నారు. బీడీఎల్, హెచ్‌ఏఎల్, మిధాని వంటి కీలక సంస్థలు హైదరాబాద్ చుట్టుపక్కల ఉన్నాయని పేర్కొన్నారు. ఈ సైన్స్ ప్రదర్శన వల్ల విద్యార్థులు, యువతకు దేశరక్షణ పట్ల అవగాహన కలుగుతుందన్నారు. ప్రస్తుతం యువత ఐటీ ఉద్యోగాలవైపే మొగ్గు చూపుతోందన్నారు

## త్వరలో హెల్త్ టూరిజం పాలసీ

**పద్మవిభూషణ్ అవార్డు గ్రహిత నాగేశ్వర రెడ్డి సన్మాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్(జనంసాక్షి):**

త్వరలో హెల్త్ టూరిజం పాలసీని తీసుకొస్తామని సీఎం రేవంత్ అన్నారు. పద్మవిభూషణ్ అవార్డు గ్రహిత నాగేశ్వర రెడ్డి సన్మాన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాట్లాడుతూ " తెలుగు జాతి నుంచి ఒక డాక్టర్ గా నాగేశ్వర్ రెడ్డి గారికి అరుదైన అవకాశం దక్కింది పద్మశ్రీ, పద్మభూషణ్, పద్మవిభూషణ్ అవార్డులను దక్కించుకున్నారు ఆయన భారతరత్నకు కూడా అర్హుడు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం త్వరలో హెల్త్ టూరిజం పాలసీని తీసుకురాబోతోంది రాష్ట్ర ప్రజలకే కాదు.. ఇతర దేశాలకు తెలంగాణలో సేవలందించేలా రాష్ట్రాన్ని హెల్త్ హబ్ గా మార్చాలన్నదే మా ప్రయత్నం దేశంలో మొట్టమొదటిసారిగా ఆరోగ్యశ్రీద్వారా పేదలకు ఉచితంగా కార్పొరేట్ వైద్యాన్ని అందించేందుకు వైఎస్ శ్రీకారం చుట్టారు మా ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పరిమితిని 10 లక్షలకు పెంచి పేదలకు వైద్యం అందిస్తోంది గతంలో ఫ్యామిలీ డాక్టర్స్ ఉండేవార కానీ ఈ రోజుల్లో ఆ సంబంధాలు కనుమరుగయ్యాయి ఒక కుటుంబ సభ్యుడిలా మనలో ధైర్యాన్ని నింపి చికిత్స అందించే ఫ్యామిలీ డాక్టర్ విధానం మళ్లీ రావాలి రాష్ట్ర ప్రజలకు హెల్త్ ప్రొఫైల్ తో కూడిన కార్డులను అందిచేందుకు చర్యలు తీసుకుంటున్నాం ఆస్తులు ఎస్సెట్ కాదు? రాబోయే రోజుల్లో డేటానే పెద్ద ఎస్సెట్ వెయ్యి ఎకరాల్లో ఎయిర్ పోర్టుకు దగ్గరలో హెల్త్ క్యాంపస్ ను క్రియేట్ చేసే ఆలోచన చేస్తున్నాం రాష్ట్రాన్ని హెల్త్ హబ్ గా మార్చేందుకు నాగేశ్వర్ రెడ్డి లాంటి వారి సహకారం అవసరం ఆయనకు అండగా ఉండేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎప్పుడూ సిద్ధంగా ఉంటుంది" అని అన్నారు

## రాష్ట్రానికి నిధులు మంజూరు చేయించే
# బాధ్యత మీదే..

**కిషన్‌రెడ్డికి సీఎం రేవంత్ 9 పేజీల సుధీర్ఘ లేఖ**

**హైదరాబాద్(జనంసాక్షి):**తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి కిషన్ రెడ్డికి 9 పేజీల లేఖ రాశారు. 'తెలంగాణ రాష్ట్రానికి ప్రాజెక్టుల మంజూరులో కేంద్ర క్యాబినెట్ మంత్రిగా మీ బాధ్యతను గుర్తు చేయడం కోసం లేఖ' అని సీఎం పేర్కొన్నారు. రాష్ట్రాలకు ప్రాజెక్టుల మంజూరులో సీఎం రేవంత్ రెడ్డి అవగాహన రాహిత్యంతో మాట్లాడుతున్నారన్న వ్యాఖ్యలు పూర్తి బాధ్యతారాహిత్యమని, తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. కేంద్ర మంత్రిగా తెలంగాణకు కిషన్ రెడ్డి ఏం చేశారో చెప్పాలన్నారు. తెలంగాణ అభివృద్ధికి హైదరాబాద్ మెట్రో ఫేజ్, ప్రాంతీయ రింగు రోడ్డు (ఆర్ఆర్ఆర్), మూసీ పునరుజ్జీవనం, రీజినల్ రింగ్ రైలు, డ్రైపోర్ట్ ఏపీలోని బందరు సీ పోర్టుకు గ్రీన్ ఫీల్డ్ రహదారి కీలకమని అన్నారు. వాటి నిర్మాణాలకు సంబంధించి అనుమతుల కోసం కేంద్ర ప్రభుత్వ విధివిధానాలను పూర్తిగా పాటిస్తున్నామని తెలిపారు. ఆయా ప్రాజెక్టుల సాధన కోసం ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రులతో పాటు మిమ్మల్ని (కిషన్ రెడ్డి) కలిసిన విషయాన్ని గుర్తు చేస్తున్నానని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. మెట్రో ఫేజ్ – 1 69 కి.మీ. నిర్మాణాన్ని ఉమ్మడి రాష్ట్రంలోనే కాంగ్రెస్ ప్రభుత్వం చేపట్టిందని ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. మెట్రో రాకతో హైదరాబాద్ నగరంలో అభివృద్ధి పరుగులు పెట్టిందని, గత పదేళ్లలో రాష్ట్రంలో అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ప్రభుత్వం హైదరాబాద్ మెట్రో ఫేజ్-1 ప్రాజెక్ట్‌ను పూర్తిగా నిర్లక్ష్యం చేసిందని, సీఎంగా తాను బాధ్యతలు స్వీకరించిన తర్వాత హైదరాబాద్ మెట్రో ఫేజ్-11 ప్రాజెక్టుపై పూర్తి స్థాయిలో దృష్టి సారించామని తెలిపారు. మెట్రో సేవలను విస్తరించడమే లక్ష్యంగా అయిదు కారిడార్లను ప్రతిపాదించామన్నారు. నాగోల్- రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం (36.8 కి.మీ.), రాయదుర్గం–కోకాపేట నియోపొలిస్ (11.6 3.2.), ఎంజీబీఎస్– చాంద్రాయణగుట్ట (7.5 కి.మీ.), మియాపూర్–పటాన్ చెరు (13.4 కి.మీ.), ఎల్బీనగర్- హయత్ నగర్ (7.1 కి.మీ.). ఈ ఐదు కారిడార్ల నిర్మాణానికి రూ. 24,269 కోట్లతో ప్రతిపాదనలు ఆమోదించాలని నాటి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి హర్దీప్ సింగ్ పురీకి (2024, జనవరి 4వ తేదీ) వినతిపత్రం అందజేశామని చెప్పారు. 2024, అక్టోబరు ఏడో తేదీన ప్రస్తుత కేంద్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి మనోహర్‌లాల్ ఖట్టర్కు ప్రతిపాదనలు అందజేశామని తెలిపారు. 2024, నవంబరు నాలుగో తేదీన రాష్ట్ర ప్రభుత్వం నుంచి కేంద్ర పట్టణాభివృద్ధి శాఖకు మెట్రో ఫేజ్- 11 డిటైయిల్డ్ రిపోర్ట్ సమర్పించామని సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యానించారు. 2024, డిసెంబరు 12వ తేదీన ఢిల్లీలో తాను మీతో (కిషన్ రెడ్డి) సమావేశమై హైదరాబాద్ మెట్రో ప్రాజెక్ట్‌కు సంబంధించిన వివరాల లేఖను అందజేశానని సీఎం రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. తాజాగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీని కలిసినప్పుడు 2025, ఫిబ్రవరి 26వ తేదీన ఇదే అంశంపై లేఖ అందజేశానన్నారు. మెట్రో ఫేజ్–కు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా చేపట్టాలని అన్ని లేఖల్లో స్పష్టంగా వివరించినట్లు ఆయన తెలిపారు.

## మామునూరు కల.. నెరవేరిన వేళ

ఉంది. ఆ భూమికి అదనంగా మరో 253 ఎకరాల భూమి కొంత రన్‌వే విస్తరణ, టెర్మినల్ బిల్డింగ్, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్ (ఏటీసీ), నేవిగేషన్ ఇన్‌స్ట్రుమెంట్ ఇన్‌స్టలేషన్ నిర్మాణాలు చేపట్టనున్నారు. ఈ మేరకు భూసేకర జరిపేందుకు రాష్ట్ర ప్రభుత్వం రూ.205 కోట్లను విడుదల చేసింది. రాష్ట్ర ప్రభుత్వం విజ్ఞప్తి మేరకు మామూనూరు ఎయిర్ పోర్ట్ ఆపరేషన్స్‌కి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఉత్తర్వులు ఇచ్చారు. జీఎంఆర్ అంగీకారం తెలపడంతో విమానాశ్రయం పనులు చేపట్టేందుకు పౌరవిమానయాన శాఖ ఉత్తర్వులు జారీ చేసింది. త్వరితగతిన నిర్మాణ పనులు చేపట్టాలని ఎయిర్ పోర్ట్ అథారిటీని రామ్మోహన్ నాయుడు ఆదేశించారు. మామునూరు ఎయిర్‌పోర్టు నిర్మాణానికి అడ్డంకిగా ఉన్న 150 కి.మీ. ఒప్పందాన్ని జీఎంఆర్ సంస్థ విరమించుకుంది. నిజాం కాలంలో మామునూరు నుంచి వాయుదూత్ విమానాలు నడిచేవి. భారత్, చైనా యుద్ధ సమయంలో కీలక సేవలందించాయి. దాదాపు 32 ఏళ్ల కిందట మూతపడిన మామునూరు విమానాశ్రయానికి మళ్లీ 'రెక్కలు' రానున్నాయి. అప్పుడప్పుడు శిక్షణ ఎయిర్‌క్రాఫ్ట్‌లు నడుస్తున్న ఈ విమానాశ్రయం నుంచి మళ్లీ విమానం ఎగరనుంది. రాష్ట్ర ప్రభుత్వం చొరవతో మామునూరు ఎయిర్‌పోర్టు కల సాకారమైందని మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి అన్నారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనుమతి రావడంతో ఎయిర్‌పోర్టు పనులు వేగవంతం అవుతాయన్నారు. మామునూరు ఎయిర్‌పోర్టుకు కేంద్రం అనుమతి తెలపడం పట్ల మంత్రి కొండా సురేఖ హర్షం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్‌రెడ్డితో పాటు కేంద్ర పెద్దలకు ధన్యవాదాలు తెలిపారు.

## ఉత్తరాఖండ్‌లో పెను ప్రమాదం

చర్యలు కొనసాగుతున్నాయి. ఘటనాస్థలంలో అంబులెన్స్‌లను సిద్ధంగా ఉంచారు. అయితే, మంచు దట్టంగా కురుస్తుండటంతో సహాయక చర్యలకు తీవ్ర ఆటంకం కలుగుతోందని బీఆర్‌ఓ అధికారులు వెల్లడించారు.ఘటనపై రాష్ట్ర ముఖ్యమంత్రి పుష్కర్ సింగ్ ధామి స్పందించారు. సహాయక చర్యలు వేగంగా జరుగుతున్నాయని, త్వరలోనే కార్మికులందరినీ కాపాడుతామని తెలిపారు. ఎన్డీఆర్‌ఎఫ్, ఎస్డీఆర్‌ఎఫ్‌తో పాటు ఆర్మీ కూడా రంగంలోకి దిగి సహాయక చర్యలు చేపట్టింది. ఘటన జరిగిన మన గ్రామం.. బద్రీనాథ్‌కు కేవలం మూడు కిలోమీటర్ల దూరంలోనే ఉంటుంది. భారత్–టిబెట్ సరిహద్దును ఆనుకుని సముద్ర మట్టానికి 3,200 మీటర్ల ఎత్తులో ఉంది.

**మూడు రాష్ట్రాల్లో మంచుతో కప్పుకుపోయిన రోడ్లు**

దేశంలోని మూడు రాష్ట్రాల్లో భారీగా మంచు కురుస్తోంది. జమ్ముకశ్మీర్ , హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్ లలో మంచు తీవ్రంగా ఉన్నది. ఉష్ణోగ్రతలు కనిష్ఠ స్థాయికి పడిపోయాయి. ఎక్కడ చూసినా మంచు దిబ్బలే దర్శనమిస్తున్నాయి. కనుచూపుమేర శ్వేత వర్ణం అలుముకుంది. అక్కడ రోడ్లన్నీ శ్వేతవర్ణాన్ని తలపిస్తున్నాయి. రోడ్లపై భారీగా హిమపాతం పేరుకు పోవడంతో అధికారులు పలు రహదారుల్ని మూసి వేశారు. జమ్ముకశ్మీర్‌లో ఎడతెరిపిలేకుండా మంచు కురుస్తోంది. దీంతో చాలా ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడుతున్నాయి. అప్రమత్తమైన అధికారులు జమ్ము–శ్రీనగర్ జాతీయ రహదారిని మూసివేశారు.

# పేదల కోసం పనిచేయాలి

పోరాటాలు చేసాము.. అందుకే తెలంగాణ లో అధికారంలోకి వచ్చాము.రాహుల్ గాంధీ రాజ్యాంగ రక్షణ కోసం భారత్ జొడో యాత్ర నిర్వహించి ఒక మైదానాన్ని తయారు చేశారు.మనం దాని కోసం పోరాటం చేయాలి. బీజేపీ, బిఆర్ఎస్ పార్టీలతో మనం ఇక్కడ పోరాటం చేయాల్సి ఉంది. కాంగ్రెస్ పార్టీ దేశం కోసం పోరాటం చేసి స్వాతంత్రాన్ని తెచ్చింది... కాంగ్రెస్ ఎలాంటి పోరాటానికి అయిన సిద్ధంగా ఉన్నాం. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అనేక కార్యక్రమాలు చేపట్టింది. ఇవన్నీ ప్రజలకు సక్రమంగా అందాలి పదేళ్లు గా కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు ఎంతో కష్టపడి పని చేసారు. వారికి న్యాయం జరగాలి.. పదవులు పొందిన వారు ప్రజల కోసం పని చేయాలి. మనం చేసిన పనులను ప్రజలకు వివరించాలి. దేశంలో ఎక్కడా లేని విదంగా ఇక్కడ కులఘనన చేపట్టాము.. ఇది చాలా గొప్ప విషయం. ప్రతి గ్రామ గ్రామానికి వెళ్లి జై బాపు, జై భీమ్, జై సంవిధాన్ కార్యక్రమాలను పెద్ద ఎత్తున చేపట్టాలి. గ్రామ గ్రామన పార్టీ కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలి. ఈ విషయంలో పీసీసీ ఒక పకడ్బందీగా కాలెండర్ సిద్ధం చేయాలి' అని మీనాక్షి నటరాజన్ స్పష్టం చేశారు.

**పదవులు రాలేదని ఎవరూ నిరుత్సాహ పడొద్దు : రేవంత్ రెడ్డి**

పదవులు రాలేదని కాంగ్రెస్ నేతలు ఎవరూ నిరుత్సాహ పడాల్సిన అవసరం లేదని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. పార్టీ కోసం కష్టపడి పనిచేసిన వారికి కచ్చితంగా పదవులు వస్తాయన్నారు.గాంధీభవన్‌లో ఏర్పాటు చేసిన పీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో ఆయన మాట్లాడారు. "నాలుగైదేళ్లు జిల్లా అధ్యక్షులుగా పనిచేసిన వారికి నామినేటెడ్ పదవులు ఇచ్చాం. పార్టీలో నమ్మకంగా ఉన్నవారికి ఉన్నత పదవులు ఇచ్చాం. పార్టీ కోసం కష్టపడిన వారికి సముచిత స్థానం కల్పిస్తున్నాం. మండలాలు, అసెంబ్లీ నియోజకవర్గాల వారీగా ఫీడ్‌బ్యాక్ తీసుకొని పదవులు ఇస్తాం. ప్రస్తుతం రెండేళ్ల కాలానికి కార్పొరేషన్ ఛైర్మన్ పదవులు ఇచ్చాం. మార్చి 10 లోపు జిల్లాల వారీగా ఇన్‌ఛార్జి మంత్రులు నామినేటెడ్ పదవులకు సంబంధించిన నివేదికలు ఇవ్వాలి" అని ఆదేశించారు.రాహుల్ గాంధీని ప్రధానమంత్రిని చేసే వరకూ మనం విశ్రమించొద్దు. ప్రతిపక్షాలు చేసే విమర్శలను పట్టించుకోవద్దు. రాహుల్ ప్రధాని అయితే, దేశం అభివృద్ధి అవుతుంది. కాంగ్రెస్‌కు తక్కువ.. ఎక్కువ.. అనే తారతమ్యాల్లేవు. అనుభవజ్ఞులైన ఇద్దరిని ఇప్పటికే రాజ్యసభకు నామినేట్ చేశాం. ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలి. రాష్ట్రంలో కులగణన అనేది అతిపెద్ద కార్యక్రమం. దేశంలోనే అత్యధిక పన్నులు కడుతున్న రాష్ట్రం తెలంగాణ. కష్టపడి పనిచేసే వారికి అవకాశాలు ఇవ్వాల్సిన బాధ్యత పార్టీపైనే ఉంటుంది" అన్నారు.పార్టీ పటిష్టతకు, రాజ్యాంగ పరిరక్షణకు అందరం కలిసి పనిచేస్తామన్నారు. పార్టీ అధిష్టానం ఇచ్చిన బాధ్యతలను నెరవేరుస్తానని చెప్పారు. రాహుల్ గాంధీ ఆలోచనలను ప్రజల్లోకి తీసుకెళ్లడానికి కృషి చేస్తానన్నారు. శుక్రవారం లేక్‌వ్యూలో బసచేసిన ఆమెను సిఎం రేవంత్, మంత్రి పొన్నంలు మర్యాద పూర్వకంగా కలిశారు. పార్టీలో అంతర్గత రాజకీయాలు లేవు..ప్రజాస్వామ్యం కాంగ్రెస్ లో ఎక్కువ..పార్టీలో భిన్నాభిప్రాయాలు ఉంటాయి.. అందరి అభిప్రాయాలకు సముచితస్థానం కల్పిస్తూ ముందుకెళ్తామన్నారు. తెలంగాణను సోనియా గాంధీ ఏ ఉద్దేశ్యంతో ఏర్పాటు చేశారో..ఆ లక్ష్యాన్ని ముందుకు తీసుకెళ్తామన్నారు. ఇక కొత్త ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్ చాలా సాదా సీదా వ్యక్తి. దిల్ కుష్ తో కార్యాలయ బయట కార్యకర్తలను కలిసి విష్ చేశారు. బొకేలు ఇస్తుంటే నిరాకరించారు. కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్ చార్జి మీనాక్షి నటరాజన్ బ్రహ్మచారిణి. చాలా సాదా సీదాగా ఉంటారు.

## పెట్టుబడులకు స్వర్గధామం తెలంగాణ

విందు సమావేశానికి హాజరైన యూరోపియన్ యూనియన్ ప్రతినిధి బృందానికి వివరించారు. పాలకులు మారడం సాధారణం, కానీ కొన్నిసార్లు కేవలం మార్పు కోసమే పాత విధానాలు రద్దు చేస్తారు. అయితే తెలంగాణలో పరిస్థితి ఇందుకు పూర్తిగా భిన్నంగా ఉందని తెలిపారు. గత రెండు, మూడు దశాబ్దాలుగా ఒక ప్రభుత్వం తర్వాత మరో ప్రభుత్వం వచ్చినప్పటికీ రాష్ట్ర అభివృద్ధికి ఉపయోగపడే విధానాలు కొనసాగించబడుతున్నాయి అన్నారు. గత సంవత్సరం క్రితం కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటికీ గత సర్కారు అమలు చేసిన మంచి విధానాలను కొనసాగిస్తున్నామని తెలిపారు. అదేవిధంగా కొన్ని కీలకమైన పాలసీల్లో లోటును గుర్తించి అభివృద్ధికి అనుకూలమైన కొత్త విధానాలను అమలు చేస్తున్నాం అన్నారు.ఇందుకు ఉదాహరణగా చూస్తే.. గ్రీన్ ఎనర్జీ పై ఒక క్లీన్ అండ్ గ్రీన్ పాలసీని ప్రారంభించాము. గత ప్రభుత్వం ఇలాంటి విధానాన్ని రూపొందించలేదు, అయితే ప్రపంచం మొత్తం గ్రీన్ పవర్ వైపు అడుగులు వేస్తూ ఉండడంతో మేము సమగ్ర గ్రీన్ ఎనర్జీ పాలసీని రూపొందించాం. ఈ విధానానికి పరిశ్రమలు, డేటా సెంటర్లు, వినియోగదారుల నుంచి విశేష ప్రశంసలు అందాయి అని వివరించారు. మరో ప్రధాన అంశం ఓఎంఇ (సూక్ష్మ, చిన్న, మధ్యతరః) పై కొత్త పాలసీని రూపొందించాము. గత ప్రభుత్వంలో ఒక సాధారణ పారిశ్రామిక విధానం ఉండేది, అది పెద్ద కంపెనీలకు మేలు చేసే విధంగా ఉండేది. కానీ ఎంఎస్ఎంఈ లు పరిశ్రమల అభివృద్ధికి, పెద్ద సంఖ్యలో ఉపాధికి వెన్నుముక వంటివి అని మేము భావించాం. అందుకే అనేక రకాల ప్రోత్సాహలతో కూడిన కొత్త ఓఎంఇ పాలసీని తీసుకొచ్చినట్టు తెలిపారు. తెలంగాణలో "ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్" అందించడానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉంది. పరిశ్రమలకు అవసరమైన నీరు, విద్యుత్తు, పారిశుద్ధ్య వ్యవస్థ, రవాణా వంటి నాణ్యమైన మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామని తెలిపారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత దావోస్ లోని ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) సమిట్లో పాల్గొనడం ప్రారంభించాం, గత రెండు ఎడిషన్లలో తెలంగాణ రికార్డు స్థాయిలో పెట్టుబడులను ఆకర్షించిందని వివరించారు. తెలంగాణ రాష్ట్రం రూపొందిస్తున్న పాలసీలకు పెట్టుబడిదారుల నుంచి విశేష మద్దతు, విశ్వాసానికి దావత్ లో కుదిరిన వ్యాపార ఒప్పందాలు నిదర్శనం అన్నారు. ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రముఖ కంపెనీలు తెలంగాణలో పెట్టుబడులు పెట్టాలంటే వారికి అంతర్జాతీయ ప్రమాణాల స్థాయిలో ప్రతిభావంతులైన మానవ వనరులు అందుబాటులో ఉండాలి. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతగా తీసుకుందని తెలిపారు. ఈ నేపథ్యంలోనే భారత దేశంలోనే మొదటిసారి యువతకు ప్రత్యేకంగా నైపుణ్య శిక్షణ అందించేందుకు "యంగ్ ఇండియా స్కిల్ యూనివర్సిటీ"ని స్థాపించాం అన్నారు. యూనివర్సిటీలో ప్రతి కోర్సును పరిశ్రమల భాగస్వామ్యంతో రూపొందించాం, వాళ్లే పాఠాలు బోధిస్తారు, ఇది మా స్కిల్ యూనివర్సిటీ ప్రత్యేకత అని తెలిపారు.రాష్ట్రంలోని అన్ని ఐ.టి.ఐ. లను ఆధునికీకరించాం, విద్యార్థులు అత్యాధునిక యంత్రాలతో శిక్షణ పొందేలా కొత్త సిలబస్ అమలు చేస్తున్నట్టు తెలిపారు. ప్రాథమిక విద్యారంగాన్ని కూడా సంస్కరించేందుకు చర్యలు చేపట్టాం అన్నారు. ఈ చర్యల ఫలితంగా పిల్లలు చిన్న వయసులోనే స్కిల్స్ అభివృద్ధి చేసుకొని భవిష్యత్తులో దేశ అభివృద్ధికి తోడ్పడే స్థాయికి ఎదగ గలుగుతారు అని వివరించారు.

## మహిళల కోసం ప్రతి నియోజకవర్గానికో 'మినీ ఇండస్ట్రియల్ పార్క్'

క్షేత్రస్థాయిలో శాస్త్రీయంగా అధ్యయనం చేసి.. నిపుణులను భాగస్వామ్యం చేసి అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ఈ పాలసీని రూపొందించాం. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తల కోరిక మేరకు.. వారికి మరింత ప్రయోజనం చేకూరేలా ఈ పాలసీ ఆపరేషనల్ గైడ్ లైన్స్ ను తయారు చేస్తాం. ప్రొక్యూర్ మెంట్, కాంట్రాక్టుల్లో ఎస్సీ, ఎస్టీలకు ప్రాధాన్యం కల్పించేందుకు కృషి చేస్తాం. శాస్త్రీయంగా అధ్యయనం చేసి ప్రత్యేక పాలసీలను తీసుకొస్తాం. ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వం తరపున అన్ని రకాలుగా అండగా ఉంటాం. పరిశ్రమల స్థాపనలో వారికి ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తాం. స్కిల్ సెంటర్లను ఏర్పాటు చేసి పరిశ్రమలకు అవసరమైన నైపుణ్యమున్న మానవ వనరులను అందిస్తాం. కొత్త ఆలోచనలతో ముందుకొచ్చే వారికి ప్రభుత్వం అండగా ఉంటుంది. బ్యాంక్ ల నుంచి రుణాలు పొందటంలో ఔత్సాహిక ఎస్సీ, ఎస్టీ పారిశ్రామికవేత్తలకు ఎదురవుతున్న ఇబ్బందులను పరిష్కరిస్తాం. కుటీర పరిశ్రమలకు అండగా నిలుస్తాం. వాటిని ప్రోత్సహించేందుకు చర్యలు తీసుకుంటాం. ఈ ఏడాది ఏప్రిల్ మొదటి వారంలో ఎస్సీ, ఎస్టీ ఎమ్మెల్యేలు, పారిశ్రామికవేత్తలు, అధికారులతో కూడిన ప్రత్యేక బృందం తమిళనాడు, కర్ణాటకలో క్షేత్రస్థాయిలో పర్యటిస్తుంది. ఆయా ప్రభుత్వాలు దళిత పారిశ్రామికవేత్తలకు అందిస్తున్న ప్రోత్సాహకాలపై ప్రత్యేకంగా అధ్యయనం చేస్తుంది. ఆ నివేదిక ఆధారంగా రాష్ట్ర ప్రభుత్వం దళిత పారిశ్రామికవేత్తలకు మరింత ప్రయోజనం కలిగేలా చర్యలు తీసుకుంటుంది.. అని మంత్రి శ్రీధర్ బాబు తెలిపారు.

# మావోయిస్టు పార్టీ సభ్యుల లొంగుబాటు

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** కామారెడ్డి జిల్లా ఎస్పీ సింధు శర్మ ఎదుట ఇద్దరు మావోయిస్టు సభ్యులు లొంగిపోయారు. ఈ మేరకు శుక్రవారం తన కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో లొంగిపోయిన మావోయిస్టు సభ్యుల వివరాలను ఆమె వెల్లడించారు. పోరు వద్దు...ఊరు ముద్దు, ఆయుధాలను, అజ్ఞాతాన్ని వీడండి, జనజీవన స్రవంతిలో కలవండి, లొంగిపోతే పునరావాసం కల్పిస్తామని ఆమె అజ్ఞాతంలో ఉన్న వారికి హామీ ఇచ్చారు. పోలీస్ శాఖ ప్రజలకు చేస్తున్న వివిధ రకాల సహాయ సహకారాలు, లొంగిపోయిన మావోయిస్టుల పట్ల చూపిస్తున్న ఆదరణను తెలుసుకుని ఇకపై తాము కూడా కుటుంబ సభ్యులతో కలిసి ప్రశాంత జీవితం గడపాలని నిర్ణయించుకొని భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చెర్ల గ్రామానికి చెందిన గుర్రాల విజయ్ కుమార్ అలియాస్ ఆకాష్, ఛత్తీస్ ఘడ్ రాష్ట్రం బీజాపూర్ జిల్లా ఉసూర్ పోలీసు స్టేషన్ పరిధిలోని ఉట్లపల్లి గ్రామానికి చెందిన సారీ బాలకృష్ణలు లొంగిపోయినట్లు తెలిపారు. గుర్రాల విజయ్ కుమార్ అలియాస్ ఆకాష్ 2022 సంవత్సరంలో హెడ్మా నాయకత్వంలో సీపీఐ మావోయిస్టు పీఎల్జీ ఏ ఫస్ట్ బెటాలియన్ లో పార్టీ మెంబర్ గా చేరినట్లు తెలిపారు.




ఈ సందర్భంగా పార్టీకి కావలసిన వస్తువులను సరఫరా చేసేవాడని ఇలా రెండు సంవత్సరాలు సీపీఐ మావోయిస్టు పార్టీలో సప్లై టీ మెంబర్ గా పని చేశాడని 2024లో అతన్ని టెక్నికల్ టీం మెంబర్ గా తీసుకున్నట్లు తెలిపారు. ఆ తర్వాత నుండి అతను అజ్ఞాతంలోకి వెళ్లి బెటాలియన్లు టెక్నికల్ టీం మెంబర్ గా కొనసాగినట్లు పేర్కొన్నారు. ఇతను 2024 జూన్ లో పుసుగుప్ప సీఆర్పీఎఫ్ క్యాంపు పై దాడి చేసి ఆయుధాలు ఎత్తుకెళ్లాలని ఎత్తించినట్లు తెలిపారు. 2024 జూలై లో జమ్మి గూడా లో పోలీసులకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు చనిపోయినట్లు తెలిపారు. సెప్టెంబర్ 2024 లో గుండ్రాజు గూడెం లో పోలీసులకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో అందరూ తప్పించుకున్నారన్నారు. 2024 డిసెంబర్ లో పాలగూడ లో పోలీసులకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు చనిపోయినట్లు తెలిపారు.

2025 జనవరిలో తమ్మెల్ బట్టి లో పోలీసులకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఎన్ని మంది మావోయిస్టులు చనిపోయినట్లు తెలిపారు. జనవరి 2025 తుమారెల్ లో మావోయిస్టులకు పోలీసులకు మధ్య జరిగిన ఎదురుకాల్పుల్లో ఒక మావోయిస్టు చనిపోయినట్లు చెప్పారు. 2025 జనవరిలో మల్లంపేట లో పోలీసులకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో అందరూ తప్పించుకున్నారన్నారు. 2025 ఫిబ్రవరిలో పెద్ద ఉట్లపల్లి లో పోలీసులకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదుర్కొన్న అందరు తప్పించుకున్నారన్నారు. వీటన్నింటిలో కూడా విజయ్ కుమార్ అలియాస్ ఆకాష్ పాల్గొన్నట్లు తెలిపారు. మరో మావోయిస్టు అయినా సోడి బాలకృష్ణ 2018లో చర్ల ఏరియా కమిటీ మలేషియా మెంబర్ గా అరుణ్ డీవీసీ ఆధ్వర్యంలో చేరినట్లు తెలిపారు. 2019లో చర్ల ఏరియా కమిటీ పార్టీ మెంబర్గా శారద ఏసీఎస్ ఆధ్వర్యంలో పని చేసినట్లు తెలిపారు. 2022- 23లో మనుగు ఏరియా కమిటీ ఏసీఎస్ మంగుతు గార్డుగా పని చేసినట్లు చెప్పారు. ఇప్పటివరకు కూడా చర్ల కమిటీ ఏసి మెంబర్ గా పని చేస్తున్నట్లు తెలిపారు.

2019 ఫిబ్రవరిలో కొండపల్లి లో పోలీసులకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో అందరూ తప్పించుకున్నారన్నారు. 2020 లో రెంగావ్ లో పోలీసులకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో 9 మంది మావోయిస్టులు చనిపోయినట్లు తెలిపారు. 2021 లో కర్రి గుట్ట లో పోలీసులకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో పది మంది మావోయిస్టులు చనిపోయినట్లు తెలిపారు. 2022 కొండపల్లి పోలీసులకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో అందరూ తప్పించుకున్నట్లు తెలిపారు. 2022లో పుంజారి కాంకెలో పోలీసులకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు చనిపోయినట్లు తెలిపారు. 2023లో పాలగూడ లో పోలీసులకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఇద్దరు మావోయిస్టులు చనిపోయినట్లు తెలిపారు. 2023లో కర్రి గుట్ట లో పోలీసులకు మావోయిస్టులకు మధ్య జరిగిన ఎదురు కాల్పుల్లో ఒక మావోయిస్టు చనిపోయినట్లు పేర్కొన్నారు. 2024లో ధర్మారం సిఆర్పిఎఫ్ క్యాప్‌పై దాడి చేసి ఆయుధాలు ఎత్తుకెళ్లాలని ప్రయత్నించగా ఇందులో ముగ్గురు మావోయిస్టులు చనిపోయినట్లు తెలిపారు. ఈ కేసుల్లో సోడి బాలకృష్ణ ప్రత్యక్షంగా పాల్గొన్నట్లు వివరించారు.

నిషేధిత సీపీఐ మావోయిస్టు పార్టీ సిద్ధాంతాల పట్ల ఆకర్షితులై పార్టీలో చేరిన ఈ ఇద్దరు ఆ పార్టీలో జరుగుతున్న అర్థం లేని హింస, సిద్ధాంత లేమీ తదితర సంఘటనలు చూసి పార్టీపై ఉన్న భ్రమలు తొలగిపోయి వాస్తవాన్ని గ్రహించారన్నారు. సిపిఐ మావోయిస్టు పార్టీ ప్రజలకు దూరమై పతనం అంచున ఉన్నదన్నారు. ఛత్తీస్ గఢ్ లో జరుగుతున్న సంఘటనలను బట్టి అర్థం చేసుకోవచ్చన్నారు. చాలామంది మావోయిస్టులు, మిలీషియా సభ్యులు, సానుభూతిపరులు పార్టీని వదిలేసి వేరే ప్రాంతానికి వెళ్ళిపోతున్నారన్నారు.

**అజ్ఞాతంలో ఐదుగురు మావోయిస్టులు...**

కామారెడ్డి జిల్లా నుంచి ఐదుగురు మావోయిస్టులు అజ్ఞాతంలో ఉన్నట్లు జిల్లా ఎస్పీ సింధు శర్మ తెలిపారు. ఇస్రోజివాడి గ్రామానికి చెందిన లోకేటి చంద్రరావు అలియాస్ పడకాల స్వామి అలియాస్ ప్రభాకర్, మాచారెడ్డి మండలం ఆరేపల్లి గ్రామానికి చెందిన ఎర్ర గొల్ల రవి అలియాస్ దినేష్, ఇస్రోజివాడి గ్రామానికి చెందిన లోకేటి రమేష్, లోకేటి లావణ్య అలియాస్ శాంతి, అడ్లూరు ఎల్లారెడ్డి కి చెందిన లింగయ్య గారి వెంకట్ రెడ్డి లు అజ్ఞాతంలో ఉన్నట్లు తెలిపారు. వీరు కూడా జనజీవ స్రవంతి లోకి రావాలని ఆమె కోరారు. వీరు జనజీవన స్రవంతి లోకి వస్తే ప్రభుత్వ ప్రతిఫలాలు, పునరావాసం, జీవనోపాధి కల్పిస్తామని హామీ ఇచ్చారు. మీడియా సమావేశంలో అడిషనల్ ఎస్పీ నర్సింహారెడ్డి కూడా పాల్గొన్నారు.

# మహా శివరాత్రి ఆదాయం రూ.కోటీ 31 లక్షలు

- ఆదాయంలో ప్రసాదం విక్రయాలు,కోడె మొక్కుల చెల్లింపులలో సింహభాగం
- గత ఏడాది కంటే అధికంగా రూ 10.90 లక్షలు పెరిగిన వేములవాడ రాజన్న ఆదాయం

**మూడేళ్లలో సమకూరిన ఆదాయం వివరాలు...**

| సంవత్సరం | ఆదాయం (రూ. కోట్లలో) |
| --- | --- |
| 2023 | 1,21,99,005 |
| 2024 | 1,29,98,704 |
| 2025 | 1,31,89,177 |

**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో మూడు రోజుల పాటు నిర్వహించిన మహా శివరాత్రి జాతర మహోత్సవాల సందర్భంగా ఆలయానికి రూ 1,31,89,177 ఆదాయం సమకూరింది.గత ఏడాదితో పోల్చుకుంటే రూ 10,90,473 ఆదాయం అధికంగా సమకూరింది. ఆదాయములో సింహభాగం ప్రసాదాల విక్రయాలు కోడె మొక్కులు ద్వారా వచ్చింది.వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో ఫిబ్రవరి 25,26,27 తేదీల్లో మూడు రోజుల పాటు మహాశివరాత్రి జాతర ఉత్సవాలను అత్యంత వైభవంగా నిర్వహించారు. జాతర ఉత్సవాలకు సుమారు నాలుగు లక్షల మంది భక్తులు వస్తారన్న అంచనా మేరకు ఆలయ అధికారులు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు ఘనంగా నిర్వహించారు. ఇందుకోసం రూ 1.75 కోట్లతో అధికారులు ఏర్పాట్లను చేశారు.కాగా మూడు రోజుల జాతర ఉత్సవాలకు తెలంగాణ రాష్ట్రంతో పాటు ఆంధ్రప్రదేశ్, చత్తీస్గఢ్, మహారాష్ట్ర తదితర ప్రాంతాల నుంచి భక్తులు స్వామివారి దర్శించుకోవడానికి తరలివచ్చారు.సుమారు రెండు లక్షల 50 వేల మంది భక్తులు దర్శించుకున్నారని అధికారులు వెల్లడించారు. అధికారులు అంచనా వేసిన దానికంటే భక్తులు తక్కువగా వచ్చారు.



**రెండేళ్ల కంటే పెరిగిన ఆదాయం..**

మహాశివరాత్రి జాతర ఉత్సవాల సందర్భంగా ఆలయానికి వివిధ రూపాల్లో ఆదాయం సమకూరింది. ప్రసాదాల విక్రయాల ద్వారా రూ 57,12,660 కోడె మొక్కుల ద్వారా రూ 45,83,500 ఆర్జిత సేవల ద్వారా రూ 55706 కేశఖండన ద్వారా రూ 3,89,400 శీఘ్రదర్శనం ( రూ 100) రూ. 6,97,700 అతి శీఘ్ర దర్శనం ( రూ 300) ద్వారా రూ 13,04,100 ఆదాయం సమకూరింది.అనుబంధ దేవాలయాలైన బద్ది పోచమ్మ ఆలయంలో 1,91,390 భీమేశ్వరాలయంలో రూ 78,705 నగరేశ్వర ఆలయంలో రూ.7830 వసతి గదుల ద్వారా రూ 1,05,280 ఇతర మార్గాల ద్వారా రూ 62,906 ఆదాయం సమకూరింది.మొత్తంగా రూ 1,31,89,177 ఆదాయం వచ్చింది..

# ఓపెన్ స్పేస్ చార్జీలను లేఅవుట్ ఓనర్ల నుండే వసూలు చేయాలి

- ప్లాటు కొనుగోలుదారులపై భారం వేయొద్దు
- రాష్ట్ర ప్రభుత్వానికి సిపిఎం విజ్ఞప్తి



**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** ఓపెన్ స్పేస్ చార్జీలను లేఅవుట్ ఓనర్ల నుండే వసూలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. లేఅవుట్ క్రమబద్ధీకరణ కోసం రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన మార్గదర్శకాల ప్రకారం 14% ఓపెన్ స్పేస్ చార్జీల భారం సామాన్య ప్లాట్ కొనుగోలుదారులపై పడుతున్నదని, ఓపెన్ స్పేస్ లను వదలకుండా లే అవుట్ వేసిన రియాల్టర్లు బాధ్యత వహించాలి తప్ప ప్లాటు కొనుగోలుదారులపై భారం వేయడం సమంజసం కాదని హైదరాబాద్‌లో శుక్రవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.10 శాతం ప్లాట్లు అమ్మినటువంటి లేఔట్లలో మిగతా 90 శాతం ప్లాట్లను లేఔట్ ఓనర్లు క్రమబద్ధీకరించుకునే అవకాశం ప్రభుత్వం కల్పించింది, కొత్తగా దరఖాస్తు పెట్టుకునే అవకాశం కూడా కల్పించిందని, 90 శాతం ఖాళీగా ఉన్న లేఔట్లలో ఓపెన్ స్పేస్ లకు అవసరమైన స్థలాన్ని స్థానిక సంస్థలు స్వాధీనం చేసుకుని మిగతా ప్లాట్లను మాత్రమే క్రమబద్ధీకరించే విధంగా ప్రభుత్వం తక్షణమే మార్గదర్శకాలను సవరించాలని డిమాండ్ చేశారు. ఓపెన్ స్పేస్ తీసుకోలేని పక్షంలో ఓపెన్ స్పేస్ చార్జీలను లేఔట్ ఓనర్ల నుండే వసూలు చేసే చర్యలు చేపట్టాలని, ఓపెన్ స్పేస్ చార్జీలు చెల్లించకుండా లేఅవుట్ల ఓనర్లకు క్రమబద్ధీ కరణ చేయొద్దని, భవిష్యత్తులో ప్లాట్ గ్ కొనుగోలు దారులపై ఓపెన్ స్పేస్ చార్జీల భారం లేకుండా చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

# మహిళలను శక్తివంతం చేయాలి

- గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ
- ఉమెన్ ఇంటర్నేషనల్ సమిట్ ఆన్ ఎంట్రప్రెన్యూర్షిప్, బీ2బీ ఎక్స్‌పో 2025 ప్రారంభం



**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** మహిళలను విద్య, వాణిజ్యం, పారిశ్రామిక రంగాల ద్వారా శక్తివంతం చేయాల్సిన అవసరం ఉందని గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ అన్నారు. మహిళా వ్యాపారులకు కొత్త అవకాశాలు అందించడమే లక్ష్యంగా కాన్ఫెడరేషన్ ఆఫ్ ఉమెన్ ఎంటర్‌ప్రెన్యూర్స్ (సీఓడబ్ల్యుఈ) ఆధ్వర్యంలో ప్రతిష్ఠాత్మక ఉమెన్ ఇంటర్నేషనల్ సమిట్ ఆన్ ఎంట్రప్రెన్యూర్షిప్ (డబ్ల్యుఐఎస్ఈ), బీ2బీ ఎక్స్‌పో 2025ను గచ్చిబౌలిలోని ఇంజినీరింగ్ స్టాఫ్ కాలేజ్‌లో ముఖ్య అతిథి గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ఈవెంట్ ఇన్నోవేషన్, సస్టైనబిలిటీ, అంతర్జాతీయ సహకార భావనను ప్రతిబింబిస్తుందన్నారు. మహిళా వ్యాపారవేత్తలను టెక్నాలజీ ద్వారా సాధికారత కల్పించేందుకు చర్చిస్తున్న ఈ సందర్భంలో వ్యాపార భవిష్యత్తు డిజిటల్తో ప్రపంచవ్యాప్తంగా అనుసంధానం అయ్యిందన్నారు. టెక్నాలజీ ద్వారా లింగ అసమానతలను తగ్గించుకోవాలన్నారు. కొత్త మార్కెట్లు తెరవాలన్నారు. వ్యాపారాలు విస్తృత పరచుకోవాలన్నారు. గ్రామీణ మహిళలు ఇప్పుడు జాగృతమయ్యారన్నారు. కుటుంబ నిర్మాణ కర్తలు, సమాజాన్ని తీర్చిదిద్దేవారన్నారు. మహిళలు జనాభాలో సగం ఉన్నారని, వికసిత మహిళలు లేకుండా వికసిత్ భారత్ ఊహించలేమన్నారు. ఈ సందర్భంగా పర్యావరణ, అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ మహిళా ఔత్సాహిక వ్యాపారవేత్తలు అభివృద్ధి చెంది, రాష్ట్ర ఆర్థిక పురోగతిని నడిపించే సమగ్ర, సాధికారత కలిగిన వాతావరణాన్ని సృష్టించడానికి మా ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. మహిళా సాధికారత ఇప్పుడు కేవలం సామాజిక న్యాయ విషయమే కాకుండా, ఆర్థిక అభివృద్ధికి ప్రేరక శక్తిగా మారిందన్నారు. మహిళలను సంపద సృష్టికర్తలుగా తీర్చిదిద్దేందుకు మా ప్రభుత్వం 'ఇందిరా మహిళా శక్తి' కార్యక్రమాన్ని ప్రవేశపెట్టిందన్నారు. ఈ పథకం ద్వారా ఐదు సంవత్సరాలలో లక్ష కోట్లు బ్యాంక్ లింకేజీలకు అనుమతించబడతాయని చెప్పారు. లక్ష మంది మహిళా కోటీశ్వరులను సృష్టించడమే లక్ష్యమన్నారు. స్వయం సహాయ సంఘాలకు వడ్డీ రహిత రుణాలు అందించడంతో పాటు, ఇందిరా మహిళా శక్తి బజార్ల స్థాపన, ఎస్హెచ్జీ ఉత్పత్తులను ఈ-కామర్స్‌కు అనుసంధానం చేయడం జరుగుతుందన్నారు. మహిళా వ్యాపార వేత్తల అభివృద్ధిలో సీఓడబ్ల్యుఈ రెండున్నర దశాబ్దాలుగా చేస్తున్న సేవలు ప్రశంసనీయం అన్నారు. ఈ సంస్థ శిక్షణ, మార్గదర్శకత్వం, మహిళల కోసం ప్రత్యేక పారిశ్రామిక రంగాల అభివృద్ధి ద్వారా విప్లవాత్మక అవకాశాలను సృష్టించిందన్నారు. మహిళా ఔత్సాహికుల సాధికారత కోసం కృషి చేస్తూ మహిళా పారిశ్రామికవేత్తల అభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తుందని కొనియాడారు.



# 'రైతు భరోసా' నిధులు విడుదల చేయండి

- బ్యాంక్ అధికారులకు డిప్యూటీ సీఎం భట్టి ఆదేశం

**హైదరాబాద్ (జనంసాక్షి) :** రాష్ట్రంలో మూడు ఎకరాల వరకు రైతులకు 'రైతు భరోసా' నిధులు వెంటనే విడుదల చేయాలని ఆర్థిక, వ్యవసాయ శాఖ అధికారులకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆదేశించారు. లబ్ధిదారుల వివరాలు గ్రామాల్లో ప్రదర్శించాలని సూచించారు. ప్రజాభవన్‌లో శుక్రవారం స్పెషల్ చీఫ్ సెక్రటరీ రామ కృష్ణారావు, వ్యవసాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ రఘునందన్ రావు, డైరెక్టర్ గోపీలతో డిప్యూటీ సీఎం రైతు భరోసాపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇప్పటి వరకు రెండెకరాల రైతులకు అందిన రైతు భరోసా నిధుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు.. అలాగే రైతు భరోసా పథకంలో భాగంగా మూడు ఎకరాల వరకు లబ్ధిదారులకు వెంటనే నిధులు మంజూరు చేయాలని అధికారులను ఆదేశించారు. రైతు భరోసా పథకం కింద లబ్ధి పొందిన రైతుల వివరాలను గ్రామాల్లో ఫ్లెక్సీల ద్వారా ప్రచారం చేయాలని సూచించారు. లబ్ధిదారుల పేర్లు అందరికీ కనిపించేలా గ్రామాల ప్రధాన కూడళ్లలో వీటిని ఏర్పాటు చేయాలని పేర్కొన్నారు. ప్రజాభవన్‌లో సమావేశం అనంతరం బ్యాంకర్ల సమావేశంకి హాజరైన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర రావు హాజరయ్యారు. బ్యాంకర్ల సమావేశంలో డిప్యూటీ సీఎం మాట్లాడుతూ.. 'తెలంగాణ అభివృద్ధి చెందుతున్న రాష్ట్రం. దీంట్లో బ్యాంకర్ల పాత్ర కూడా కీలకం. బ్యాంకులకు ఒకేసారి రుణమాఫీ పేరుతో 22 వేల కోట్లు వేసిన చరిత్ర తెలంగాణ ప్రభుత్వంది. మరే రాష్ట్రంలో ఇది జరగలేదు' అని అన్నారు. వ్యవసాయం, బలహీన వర్గాలు, స్వయం సహాయక సంఘాలకు రుణ వితరణపై మరింత దృష్టి సారించాలని బ్యాంకులను కోరారు. ఇంకా, అతను మరింత మైక్రో అని తెలియజేశాడు. ఎంటర్‌ప్రైజెస్ క్రెడిట్ లింక్ చేయబడాలి, ఇది దృష్టాంతంలో గణనీయమైన మార్పును తెస్తుంది. ప్రాధాన్యతా రంగ రుణాల దృక్కోణంలో, బలహీన వర్గాలను, ముఖ్యంగా గ్రామీణ నిరుద్యోగ యువతను ఉద్ధరించడానికి సాంఘిక సంక్షేమ శాఖలు రూపొందించే వివిధ పథకాలకు అన్ని మద్దతుపై ప్రత్యేక దృష్టి సారించి, ప్రాధాన్యతా రంగ రుణాలపై బ్యాంకులు మరింత బహిర్గతం చేయాలని ఆయన సూచించారు. తను రాష్ట్ర సామాజిక అభివృద్ధిలో భాగస్వామ్యంలో రాష్ట్ర ప్రభుత్వం నుండి అవసరమైన అన్ని సహాయ సహకారాలను బ్యాంకులకు మరింతగా హామీ ఇచ్చారు. మరో ఫ్లాగ్‌షిప్‌లో చురుకుగా పాల్గొనాలని అన్ని బ్యాంకులకు ఆయన విజ్ఞప్తి చేశారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ కార్యకలాపాల కింద వార్షిక లక్ష్యాలను సాధించడంపై బ్యాంకులు మరింత దృష్టి సారించాలని ఉద్ఘాటించారు. రాష్ట్రంలో అందుబాటులో ఉన్న సమృద్ధిగా ఉన్న అవకాశాలను అన్వేషించడం ద్వారా పీఎంఎఫ్ఎంఈ పథకం, వేర్‌హౌస్ రసీదులపై రుణాలు, రైతు ఉత్పత్తిదారుల సంస్థలు, ఆయిల్ పామ్ సాగుపై మరింత దృష్టి సారించడంలో బ్యాంకుల మద్దతును ఆయన కోరారు.









# జనరల్ మజ్దూర్ కాదు.. జనరల్ అసిస్టెంట్

(ప్రత్యేక ప్రతినిధి/జనంసాక్షి)

కోల్ ఇండియా లిమిటెడ్ యాజమాన్యం జనరల్ లేబర్ హోదాను మార్చింది. "జనరల్ మజ్దూర్" ఇప్పుడు "జనరల్ అసిస్టెంట్" గా పిలువబడుతుంది.జెబిసిసి-11 వ స్టాండర్డ్ జేషన్ కమిటీ యొక్క 4వ సమావేశంలో, "జనరల్ మజ్దూర్" యొక్క కొత్త నామకరణంపై చర్చ జరిగి ఏకాభిప్రాయం కుదిరిందనేది ఇక్కడ ప్రస్తావించదగిన విషయం. దీని ప్రకారం, కోల్ ఇండియా యాజమాన్యం కేటగిరీ-1లోని నాన్-ఎగ్జిక్యూటివ్ కేడర్ ఉద్యోగుల పేరును "జనరల్ మజ్దూర్" కు బదులుగా "జనరల్ అసిస్టెంట్" గా మార్చింది. ఫిబ్రవరి 28న, కంపెనీ జనరల్ మేనేజర్ (లేబర్ ఫోర్స్, ఇండస్ట్రియల్ రిలేషన్స్) గౌతమ్ బెనర్జీ ఈ మేరకు ఒక ఆఫీస్ మెమోరాండం జారీ చేశారు.

# 2న నగరంలో ఉపరాష్ట్రపతి పర్యటన

- భద్రతా ఏర్పాట్లపై అధికారులతో సిఎస్ సమీక్ష

**హైదరాబాద్, ఫిబ్రవరి28 (జనంసాక్షి) :** మార్చి 2వ తేదీన రాష్ట్రంలో ఉపరాష్ట్రపతి జగ్‌దీప్ ధన్‌కడ్ పర్యటిచనున్నారు. ఈ సందర్భంగా తగిన ఏర్పాట్లపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి ఉన్నతాధికారులతో శుక్రవారం సచివాలయంలో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తూ తగిన ఏర్పాట్లు చేయాలని అధికారులకు ఆమె సూచించారు. కాగా ఉపరాష్ట్రపతి హైదరాబాద్ లోని ఐఐటిని సందర్శించి అక్కడి అధ్యాపకులు, సిబ్బంది, విద్యార్థులతో ముచ్చటిస్తారని సిఎస్ తెలియజేశారు. అనంతరం నగరంలోని ఓ ప్రైవేట్ కార్యక్రమంలో కూడా పాల్గొని అదే రోజు తిరిగి న్యూఢిల్లీకి బయలుదేరి వెళ్లనున్నారు.ఉపరాష్ట్రపతి పర్యటన సందర్భంగా భద్రతా ఏర్పాట్లు చేయాలని పోలీసు శాఖకు సి.ఎస్ సూచించారు. ఆర్ అండ్ బి శాఖ, పోలీసు శాఖతో సమన్వయం చేసుకుని అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు. వైద్యారోగ్య శాఖకు అర్హులైన వైద్యులు, ఇతర సామాగ్రి అందుబాటులో ఉంచాలని సూచించారు. అదేవిధంగా, నిరంతరాయంగా విద్యుత్ సరఫరా చేయాలని ఇంధన శాఖకు చెప్పారు. ఈ సమావేశంలో హోం స్పెషల్ చీఫ్ సెక్రటరీ రవిగుప్తా, ఆర్ అండ్ బి స్పెషల్ చీఫ్ సెక్రటరీ వికాస్ రాజ్, పొలిటికల్ సెక్రటరీ రఘునందన్ రావు, సమాచార శాఖ స్పెషల్ కమిషనర్ డాక్టర్ ఎస్ హరీష్, హైదరాబాద్, సంగారెడ్డి కలెక్టర్లు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

# కృషి, పట్టుదల, శ్రమ ఉంటే ఏదైనా సాధించొచ్చు : బ్రహ్మానందం

**హనుమకొండ, ఫిబ్రవరి28 (జనంసాక్షి) :** కృషి, పట్టుదల, శ్రమ ఉంటే ఏదైనా సాధించొచ్చని సినీనటుడు డాక్టర్ కె.బ్రహ్మానందం అన్నారు. వరంగల్ నిట్లో స్ప్రింగ్ స్ప్రి 2025 ప్రారంభించి మాట్లాడారు. చాలా పేదరికం నుంచి ఎన్నో అడ్డంకులు, అవహేళనలు ఎదుర్కొని ఈ స్థాయికి వచ్చానన్నారు. లాల్ బహుదూర్ శాస్త్రి, డా. బీఆర్ అంబేద్కర్, అబ్దుల్ కలాం ఎంతో కష్టపడి చదివారని, వారిని స్ఫూర్తిగా తీసుకోవాలని సూచించారు. లెక్చరర్ గా చేసినప్పటికీ నాకంటూ గుర్తింపు తెచ్చుకోవాలని ఆలోచించగా సినిమాల్లో నటించే అవకాశం రాగా ఒక్కో అడుగు వేస్తూ ఒడిసి పట్టుకున్నానని తెలిపారు. నీ దగ్గర డబ్బు ఉంటేనే నీకు గౌరవం ఇస్తారు. కృషి, పట్టుదల సాధించాలనే తపన ఉంటే ఏదైనా సాధించవచ్చని చెప్పారు. వచ్చిన ప్రతి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. లైఫ్ ఈజ్ ఏ గేమ్.. వి షుడ్ హావ్ టు ప్లే అంటూ విద్యార్థులను ఉత్సాహపరిచారు. 40 ఏళ్ల సినీ పరిశ్రమలో 1200 పైగా చిత్రాల్లో నటించాను. ప్రపంచంలోనే అత్యధికంగా సినిమాలు తీసిన వ్యక్తి గా నిలిచిపోయానని పేర్కొన్నారు. పద్మశ్రీ అవార్డు, డాక్టరేట్, గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించుకున్నాను. అందరూ బ్రహ్మ 'ఆనందంగా'ఉండాలి, మంచి ఆరోగ్యంతో మంచి ఆలోచనలు వస్తాయని విద్యార్థులలో ఉత్సాహాన్ని నింపారు.



## చేనేతలకు చేయూతనిద్దాం

వారి భవితకు చేదోడు వాదోడుగా
మునుముందుకు నడిపిద్దాం
అగ్గిపెట్టెలో చీరను
మడతపెట్టి చూపే
వారి నైపుణ్యానికి విలువనిద్దాం
ప్రఖ్యాతకు మారుపేరుగా
ప్రపంచ పటంలో నిలుపుదాం

మీ చేతుల అల్లికలో మెళకువలకు
పట్టాభిషేకం చేసేద్దాం
చీర అంచుల్లో విధవిధాల సొబగులకు
ఒక గుర్తింపుని కలిగిద్దాం
విరబూసిన పూల మాలల్లా
కలబోసిన నేత అల్లికల్లో
వినూత్నతకు గులాములైపోదాం
చిత్ర వర్ణాల శోభితమైన
వస్త్రాలలో వన్నెతకు
శిరసావహిస్తూ ఆదరించుదాం

నాటి విలువలు నేటి స్థితిలో
కనుమరుగవుతున్న తరుణాన
మనసు వ్యాకులతకు దర్పణమైంది
నేటి హంగుల పొంగులతో
షాపింగ్ మాల్స్ ల రంగులతో
నేత బతుకు నీరుగారుతుంటే
మనసు కన్నీరొలికింది
స్వదేశీ సాంప్రదాయపు వస్త్రాలు
విదేశీల నవ్యతలో నలిగిపోతుంటే
అటకెక్కిన చేనేతను చూసి
హృదయం ద్రవించింది

మర మగ్గాల రాకతో
చేనేతల చేతి బిగువు సన్నబడింది
నేతన్నల బతుకు బరువైపోయింది
ఒకే వృత్తి అలవాటుగా చేసుకున్నాక
నూతనత్వపు ఉరవడిలో
చేనేతల చేతి మగ్గం చితికిలపడింది
నేడు అప్పుల ఊబిలో కూరుకుపోతూ
కన్నీటి పర్యంతమైపోయింది
ఆత్మహత్యలే చివరి పేజీగా
ఎటూ కదలక ఆగిపోయింది

- కోనేటి నరేష్,
శ్రీ సత్యసాయి జిల్లా, 8499847863

# అమ్మకానికి "అమెరికన్ పౌరసత్వం"

నూతన అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ అమెరికా ప్రజలను, ప్రపంచాన్ని ఆశ్చర్యంలో ముంచెత్తే ఒక వ్యాపార ప్రకటన విడుదల చేశారు. ధనవంతు లైన విదేశీయులకు 5 మిలియన్ డాలర్లకు "అమెరికన్ పౌరసత్వం" అమ్మేందుకు" ఒక కొత్త పథకాన్ని ప్రకటించారు. ఈ "గోల్డ్ కార్డ్ ఆఫర్" అనే పథకం, గ్రీన్ కార్డ్ నివాస స్థితి, అమెరికన్ పౌరసత్వానికి ఏకంగా కొనుగోలు చేసే మార్గాన్ని అందిస్తుందని అందులో ప్రకటించారు. ట్రంప్ ఈ ప్రణాళిక ద్వారా 'జాతీయ రుణాన్ని' త్వరగా తీర్చడంలో సహాయపడుతుందని వాదిస్తున్నప్పటికీ, విమర్శకులు దీనిని అమెరికన్ పౌరసత్వాన్ని 'వాణిజ్య సరుకుగా' మార్చటాన్ని, అమెరికా దేశం పరువును ,విలువలను అంతర్జాతీయ అంగట్లో దెబ్బతీసే ప్రమాదకరమైన నిర్ణయంగా విమర్శలు చేస్తున్నారు. అమెరికన్ మీడియా ఈ ప్రకటనపై తీవ్ర విమర్శలకు దిగింది. అమెరికెన్ ప్రజలు, మేధావులు ట్రంప్ చర్యలను ఆక్షేపిస్తున్నారు. ట్రంప్ యొక్క మనస్త త్వం, ప్రవర్తనను గురించిన సందేహాలు, ప్రశ్నలను లేవనెత్తుతున్నాయి.

అమెరికన్ పౌరసత్వం అమ్మకం అనే ప్రకటన అవమానకరం: ఈ 'కొత్త అవమానం' పౌరసత్వాన్ని అమ్మడం అనే ఆలోచన పూర్తిగా కొత్తది కాదని ట్రంప్ సమర్థకులు వాదన. ఎందుకంటే మాల్టా, సెయింట్ కిట్స్, నెవిస్ వంటి దేశాలు ఇటువంటి పథకాలను ఇప్పటికే కలిగి ఉన్నాయి. అయితే, అమెరికా ఎల్లప్పుడూ కష్టపడి పనిచేసే వలసదారుల దేశంగా తనకు తాను గర్వపడుతుంది. ఇక్కడ పౌరసత్వం చట్టబద్ధమైన ప్రక్రియల ద్వారా సాధించబడుతుంది. అంతే కానీ అమ్ముడు పోయే లగ్జరీ వస్తువులా కొనుగోలు చేయబడదు. ట్రంప్ యొక్క "గోల్డ్ కార్డ్" పథకం, ఇప్పటికే ఉన్న ఈబీ-5 ఇమ్మిగ్రెంట్ ఇన్వెస్టర్ ప్రోగ్రామ్‌ను భర్తీ చేయడానికి ప్రతిపాదించబడింది, దీనిని విమర్శకులు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఈ పథకం అమెరికన్ పౌరసత్వాన్ని ఒక వాణిజ్య వస్తువుగా తగ్గించిందని మరియు సమాజానికి ఆర్థికంగా కాకుండా ఇతర మార్గాల్లో కృషి చేసే వలసదారులను బహిష్కరిస్తుందని వారు అభిప్రాయపడుతున్నారు.

ఈబీ-5 ప్రోగ్రామ్, దాని స్వంత వివాదాలతో సహా, కనీసం ఉద్యోగాలు సృష్టించడం, అమెరికా ఆర్థిక వ్యవస్థకు దోహదం చేయడం అనే షరతును కలిగి ఉంది. కానీ ట్రంప్ యొక్క గోల్డ్ కార్డ్ పథకం డబ్బుకు మాత్రమే ప్రాధాన్యతనిస్తుంది, దేశానికి ఏదైనా వాస్తవిక దోహదం చేయడం కంటే ధనవంతుల ప్రయోజనాల ముందు దాసోహం కావటం ఏంట ని ప్రశ్నిస్తున్నారు. ట్రంప్ సామాజిక న్యాయ సూత్రాల కంటే మానవ సమానత్వ విలువల కంటే డబ్బున్న వాళ్ళకే ప్రాధాన్యతనిస్తున్నాడనే ఆరోపణలకు దారితీసింది.




**అమెరికా మీడియా విమర్శ:**
ట్రంప్ ప్రకటన అమెరికన్ విలువలకు ద్రోహం అంది.

ఈ ప్రకటనను అమెరికన్ మీడియా తీవ్రంగా ఖండించింది. ది న్యూయార్క్ టైమ్స్, ది వాషింగ్టన్ పోస్ట్, అలాగే సీఎన్ఎన్ వంటి ప్రముఖ మీడియా సంస్థలు ఈ పథకాన్ని "అమెరికన్ విలువలకు విరుద్ధం" "దేశం యొక్క స్థాపన సూత్రాలకు ద్రోహం" అని పేర్కొన్నాయి. పౌరసత్వం అనేది అమ్మడానికి ఉన్న ఉత్పత్తి సరుకు కాదు. అమెరికా చట్టాన్ని పాటించడం, అమెరికన్ సమాజంలో కలిసిపోవడం ద్వారా సాధించే ఒక ప్రత్యేక 'హక్కు', ఒక 'విలువ' అని తమ ఎడిటోరియల్ బోర్డులు స్పష్టం చేశాయి. లాస్ ఏంజెల్స్ టైమ్స్ ఈ ప్రణాళికను "అమెరికన్ అనే పదం యొక్క అర్థాన్ని డబ్బుకు అమ్మేందుకు ఒక నిరాశ, దురాశతో కూడిన ప్రయత్నం" అని వర్ణించింది. సోషల్ మీడియాలో కూడా ఈ ప్రకటనపై తీవ్ర విమర్శలు చెలరేగుతున్నాయి. హ్యాష్‌ట్యాగ్‌లు #సిటిజన్ షిప్ ఫర్ సేల్#, #సిటిజన్ షిప్ నాట్ నాట్ ఫర్ సేల్# అంటూ ట్విట్టర్‌లో ట్రెండ్ అయ్యాయి. అనేకమంది వినియోగదారులు, ధనవంతు లు దేశంలోకి ప్రవేశించడానికి డబ్బు చెల్లించగలరనే ఆలోచనపై ఆగ్రహం వ్యక్తం చేశారు. అయితే శరణార్థులు, ఆశ్రయ అభ్యర్థులు మరియు తక్కువ ఆదాయం ఉన్న వలసదారులు సంక్లిష్టమైన, కఠినమైన ఇమిగ్రేషన్ వ్యవస్థను ఎదుర్కోవలసి ఉంటుంది.

**ట్రంప్ యొక్క మానసిక స్థితి - ప్రవర్తనపై ప్రశ్నలు, అనుమానాలు:**

ఈ ప్రకటన ట్రంప్ యొక్క మానసిక స్థితిపై, నిర్ణయం తీసుకునే సామర్థ్యంపై చర్చలను మళ్లీ ప్రారంభించింది. ట్రంప్ దేశం యొక్క మంచి కంటే వ్యక్తిగత స్వార్థం, ఆర్థిక లాభాలకు ప్రాధాన్యతనిస్తున్నాడని విమర్శకులు దీర్ఘకాలంగా ఆరోపిస్తున్నారు. ఈ గోల్డ్ కార్డ్ పథకం ఈ ఆరోపణలకు మరింత ఇంధనాన్ని అందించింది. మానసిక వైద్యులు, రాజకీయ విశ్లేషకులు ట్రంప్ యొక్క డబ్బు అధికార వ్యామోహం పట్ల ఉన్న ఆసక్తి అతని నిర్ణయాలను మబ్బుతో కప్పివేసిందేమో అని అభిప్రాయపడ్డారు.

డాక్టర్ బ్యాండీ లీ, "ది డేంజరస్ కేస్ ఆఫ్ డోనాల్డ్ ట్రంప్" పుస్తక రచయిత, ట్రంప్ యొక్క మానసిక స్థితి గురించి ముందే ఆందోళనలు వ్యక్తం చేశారు. గోల్డ్ కార్డ్ పథకం సందర్భంగా, "ఇది స్థిరమైన నాయకుడి ప్రవర్తన కాదు. ఇది లోతైన దురాశ- వ్యక్తిగత లేదా రాజకీయ లాభాల కోసం దేశం యొక్క మూలాధారాలను దోచుకునే సిద్ధాంతాన్ని ప్రతిబింబిస్తుంది" అని ఆమె వ్యాఖ్యానించారు. ఇతరులు ట్రంప్ యొక్క వివాదాస్పద వ్యాపార వ్యవహారాల చరిత్ర "లాభం - నష్టం" దృష్టికోణం నుండి పాలనను చూసే అతని ధోరణిని పబ్లిక్ ఆఫీస్ కోసం తగినది కాదని విమర్శించారు.

ట్రంప్ యొక్క ప్రతిపాదన అమెరికా ఇమిగ్రేషన్ విధానం యొక్క భవిష్యత్తు గురించి తీవ్రమైన ప్రశ్నలను లేవనెత్తింది. పౌరసత్వాన్ని కొనుగోలు చేయగలిగితే, కష్టపడి పనిచేసి మెరుగైన జీవితం కోసం అమెరికాకు వచ్చే మిలియన్ల మంది వలసదారులకు అర్థం ఏమిటి? ఈ పథకం ఇమిగ్రేషన్ వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుందని, ఇప్పటికే విభజించబడిన దేశాన్ని మరింత విభజిస్తుందని విమర్శకులు హెచ్చరిస్తున్నారు.

ఇంకా, ఈ పథకంలో రష్యన్ పెట్టుబడిదారులను చేర్చడం ఆశ్చర్యాన్ని కలిగించింది. ట్రంప్ రష్యాతో అనుకూలమైన వ్యవహారాల చరిత్రను పరిగణనలోకి తీసుకున్నప్పుడు. గోల్డ్ కార్డ్ పథకానికి రష్యన్లు అర్హులేనా అని అడిగినప్పుడు, ట్రంప్ "కొందరు రష్యన్ ధనవంతులు చాలా మంచివారు" అని ప్రతిస్పందించారు. ఈ వ్యాఖ్య ఈ పథకం జాతీయ రుణానికి సంబంధించినది కాకుండా ధనవంతుల మిత్రులకు వారి ప్రయోజనాలకు అనుకూలంగా ఉందనే అనుమానాలను మరింత పెంచింది.

**అమ్మకానికి దేశ పౌరసత్వం**
ట్రంప్ యొక్క గోల్డ్ కార్డ్ పథకం కంటే విలువైనది .డబ్బుకు ప్రాధాన్యతనిచ్చే ట్రంప్ ను ప్రమాదకారి గా గుర్తిస్తుంది. అమెరికన్ పౌరసత్వాన్ని అమ్మడం ద్వారా, అతను దేశం యొక్క ఇమిగ్రేషన్ వ్యవస్థ యొక్క సమగ్రతను దెబ్బతీయటమేకాకుండా, కష్టపడి పనిచేసే మిలియన్ల మంది వలసదారులను కూడా ద్రోహం చేసినట్లే. అమెరికన్ మీడియా, ప్రజలు ఈ ప్రతిపాదనను దురాశతో కూడిన అదృష్టవంతుల ప్రయోజనాల కోసం దేశం యొక్క మూలాధారాలను దోచుకునే ప్రయత్నంగా వారు ఈ ప్రకటనను ఖండించారు.

దీనిపై చర్చ కొనసాగుతున్నప్పటికీ, ఒక విషయం స్పష్టంగా ఉంది: అమెరికన్ పౌరసత్వం అమ్మకానికి లేదు. ఇది కష్టపడి పనిచేయడం, పట్టుదల, దేశాన్ని నిర్మించే విలువలకు, అంకితభావం ద్వారా సాధించే ఒక ప్రత్యేక హక్కు. ట్రంప్ యొక్క గోల్డ్ కార్డ్ పథకం ఆగ్రహాన్ని రేకెత్తించినప్పటికీ, అమెరికా ప్రపంచవ్యాప్తంగా ప్రజలకు ఆశ కాంతినిచ్చే దేశం అనే సూత్రాలను రక్షించుకోవడం యొక్క ప్రాముఖ్యతను మనకు గుర్తుచేసింది.



డాక్టర్ కోలాహలం రామ్ కిశోర్
9849328496.

# రియల్ ఎస్టేట్ వెన్ను విరిచిన హైడ్రా



**రియల్ ఎస్టేట్....... ఇప్పుడిప్పుడే తలుకులీనుతున్న వ్యాపార రంగం. ముప్పయ్యేళ్ళు వెనక్కి పోతే రియల్ ఎస్టేట్ అంటే భూ కబ్జాలు, మోసాలు, దగా, వంచన అనే అప్రతిష్టను మూటగట్టుకున్న వ్యాపారమిది. క్రమేణా కొన్ని నిజాయితీ కంపెనీలు మార్కెట్లోకి వచ్చి ఆ తర్వాత ఆన్ లైన్ రంగంలోనూ అడుగిడి ఆ చెడ్డ పేరును చెరిపేసి రియల్ ఎస్టేట్ వ్యాపారానికి మంచి గుర్తింపు తెచ్చిపెడుతున్నాయి. ఈ రంగంపై ఉన్న భయాలు, అపోహలను తొలగించి కస్టమర్లకు, రియల్ ఎస్టేట్ కంపెనీలకు మధ్య ఉన్న దూరాన్ని తగ్గిస్తున్నాయి. రియల్ ఎస్టేట్ అంటే అప్పుడు బ్రోకర్ దందా. ఇప్పుడు కార్పొరేట్ కల్చర్.పారదర్శకత కూడిన సేవలతో పాటు సెక్యూరిటీ బాధ్యతలను కంపెనీలే స్వీకరించి కస్టమర్లలో నమ్మకాన్ని పెంచాయి. అయినా ఈ తరుణంలో ప్రస్తుతం డెవలపర్లు వ్యతిరేక పవనాలను ఎదుర్కొంటూ ముందుకు సాగక నిస్సహాయ స్థితిలో ఉన్నారు. రియల్ ఎస్టేట్ రంగానికి చేటు చేయాలన్న తలంపు రాష్ట్ర ప్రభుత్వానికి లేకున్నా ఊహించకుండా ఈ రంగాన్ని హైడ్రా దెబ్బ తీసింది.**

తెలంగాణ రాష్ట్రంలో ఏడాదిగా రియల్ ఎస్టేట్ వ్యాపారం జోరు తగ్గింది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి రియల్ వ్యాపారం మందగించింది. ఎవరెన్ని చెప్పినా ఇది నిజం. ఆదాయం సమకూర్చే విషయంలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ప్రభుత్వాలకు పాడి గేదె లాంటిది. నిరంతరం ప్రభుత్వ ఖజానా నింపుతూనే ఉంటుంది. పరిశ్రమ హోదా రాకపోయినా దానికి సరితూగే ఆదాయ వనరు.

**హైదరాబాద్ నెంబర్ వన్**
రియల్ ఎస్టేట్ వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాల్లో హైదరాబాద్ మొదటి స్థానంలో ఉంది. ఐ టి రంగానికి హైదరాబాద్ సెంటర్ పాయింట్ గా ఉంది. ఫార్మా కంపెనీలకు ఇక్కడ ఉన్న అనుకూల వాతావరణం మరెక్కడా లేకపోవడం ప్రధాన కారణం. రోడ్లు, మెట్రోరైలు, ఔటర్ రింగ్ రోడ్డు లాంటి రవాణా సౌకర్యాలు పరిశ్రమల రాకకు తోడ్పడ్డాయి. తెలంగాణ రాష్ట్ర సమితి (టిఆర్ఎస్) పాలనలో నిరంతర విద్యుత్ సరఫరా పారిశ్రామికవేత్తలను ఎంతగానో ఆకర్షించింది. వీటికి తోడు టి ఆర్ ఎస్ ప్రభుత్వం రియల్ ఎస్టేట్ బలోపేతానికి సమగ్ర ప్రణాళికలు రూపొందించింది. టి- ఎస్ ఐ పాస్, టి ఎస్ బి పాస్ రియల్ ఎస్టేట్ వర్గాల ప్రశంసలను అందుకున్నాయి. అప్పటి ఐ టి, మున్సిపల్ శాఖా మంత్రి కె టీ ఆర్ చొరవతో విధి విధానాలను సరళీకృతం చేస్తూ ఏక గవాక్ష విధానాన్ని అమలులోకి తెచ్చారు. ఇలా పరుగులు పెడుతున్న రియల్ రంగం వేగం ప్రస్తుతం తగ్గింది. ఢిల్లీ, ముంబయి, బెంగుళూరుతో పోటీ పడి ముందంజలో ఉన్న హైదరాబాద్ లో పరిస్థితులు కొంత నిరాశాజనకంగా మారాయి. గత దశాబ్ద కాలంగా క్రమేణా గణనీయమైన వృద్ధిని సాధిస్తూ వచ్చిన హైదరాబాద్ లో ఇప్పుడు స్తబ్దత ఏర్పడింది. హైడ్రా విధ్వంసం, మూసీ కూల్చివేతలతో ఒక్కసారిగా పరిస్థితి తలకిందులయింది. గత అక్టోబర్ నుంచి డిసెంబర్ మధ్యలో 47 శాతం అమ్మకాలు పడిపోయాయి. పదేళ్ల నుంచి అప్రతిహతంగా ఎత్తులు ఎదుగుతున్న ఈ రంగం గ్రాఫ్ పడిపోవడం గమనించవచ్చు. భవిష్యత్తులో ప్రపంచంలోనే మేటి నగరంగా హైదరాబాద్ అభివృద్ధి చెందుతోందని ప్రతి ఒక్కరూ విశ్వసించారు. ఇలాంటి ఉత్సాహభరిత వాతావరణం మసకబారడం పొంగు మీద నీళ్ళు చల్లినట్లయింది. రాష్ట్రంలో ఇప్పుడు రోజువారీ రాజకీయ, ఆర్థిక పరిణామాల నేపథ్యంలో రియల్ ఎస్టేట్ భవితవ్యంపై చర్చించుకోవడం చూస్తున్నాం.

ఒంటెత్తు పోకడ హైడ్రా.
హైదరాబాద్ పరిసరాల్లో ఉన్నట్టుండి ఒక్కసారిగా హైడ్రా ఉవ్వెత్తున లేచింది. దీంతో స్థిరాస్తి వ్యాపారానికి గట్టి దెబ్బే తగిలింది. రియల్ వ్యాపారం వెన్ను విరిగినట్లయింది. హైదరాబాద్ నగరానికి వరద ముంపు పొంచి ఉంది. హైడ్రా అమలుతో నగరానికి కలిగే ప్రయోజనం అంతా ఇంతా కాదు. అందుకే అందరూ హైడ్రాను స్వాగతించారు. కాని ప్రభుత్వమే అనాలోచితంగా తప్పులో కాలేసింది. ముందస్తు ప్రణాళిక లేకుండా యంత్రాంగం దూకుడుగా తడాకా చూపించడం వైఫల్యాలకు దారి తీసింది.

హైడ్రా ఆలోచన మంచిదే అయినా అమలు తీరును జనం వ్యతిరేకించారు. బాధితులకు ప్రతిపక్షాలు మద్దతునిచ్చాయి. తుదకు హైకోర్టు కూడా ప్రభుత్వానికి మొట్టికాయలు వేసింది. చెరువులు, కుంటల్లో నిర్మాణం అక్రమం అయినప్పుడు అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యల మాటేమిటన్న ప్రశ్నకు సర్కారు దగ్గర సమాధానం లేదు. అక్రమ బిల్డర్ల నుంచి సొమ్ము పిండి బాధితులకు ఇప్పించాలని కోర్టు తీర్పు చెప్పింది. ఇక్కడ కూడా పాలకుల నుంచి స్పందన లేదు. ఇదంతా గమనిస్తే హైడ్రా ప్రభుత్వ ఒంటెత్తు పోకడగా అర్థమవుతోంది. చెరువుల్లో, బఫర్ జోన్ లో నిర్మాణాలకు అనుమతులు ఇచ్చిన అధికారులను వదిలేశారు. తప్పుడు ధ్రువీకరణ పత్రాలతో మోసగించిన డెవలపర్ల జోలికి వెళ్లడం లేదు. బఫర్ జోన్ లో నిర్మించిన భవనాలకు అధికారులు విద్యుత్, నల్లా కనెక్షన్లు ఇచ్చారు. అదెలా సాధ్యమయిందో ఎవరికీ పట్టదు. రుణాలు మంజూరు చేసిన బ్యాంకుల మాటేమిటి? ఇన్ని లొసుగులను పట్టించుకోని ప్రభుత్వం ఏకపక్షంగా బుల్డోజర్లతో నిర్మాణాలు నేలమట్టం చేయడంపై ప్రజా వ్యతిరేకత పెల్లుబికింది. ఎంకి పెళ్ళి సుబ్బి చావు కొచ్చింది అన్న చందంగా ప్రజల్లో అపోహలు పెరిగి రియల్ ఎస్టేట్ కు సెగ తగిలింది. రాష్ట్రంలో ఈ రంగంపై 30 లక్షల మంది ఆధారపడ్డారు. రియల్ ఎస్టేట్ నేల చూపులతో డెవలపర్లతో పాటు మార్కెటింగ్ సిబ్బందిని హైడ్రా నష్టాల్లోకి నెట్టి వేసింది.

రాష్ట్ర ప్రభుత్వం దిద్దుబాటు చర్యలు చేపట్టి తెలంగాణలో రియల్ ఎస్టేట్ రంగాన్ని రక్షించాల్సిన తరుణమిది.

అప్పుడే క్షేత స్థాయి రియల్ ఎస్టేట్ ఏజెంట్లు, చిన్న, మధ్య తరగతి డెవలపర్లు పైకి లేస్తారు. లేనిపక్షంలో మార్కెట్ మరింత పడిపోతుంది. హైదరాబాద్ మార్కెట్లో రియల్ రంగం అభివృద్ధికి ఉన్న సానుకూలతను కాపాడవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉంది. అనుమతుల జారీలో తాత్సారం చేయకుండా డెవలపర్లకు వెన్నుదన్నుగా నిలవాలి. ఇప్పటికే ఏర్పడిన అనిశ్చితిని తొలగించాలి. రియల్ ఎస్టేట్ సైకిల్ పై డెవలపర్లకు అవగాహన ఉంది. మార్కెట్ హెచ్చు తగ్గులకు సిద్ధపడి ఉన్నారు. వర్తమాన పరిస్థితిని స్వల్పకాలిక సవాలుగానే లెక్క కడుతున్నారు. ఈ తరుణంలో ప్రభుత్వ పెద్దలు పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనం చేసి రియల్ ఎస్టేట్ కు ఆకర్షణీయంగా పూర్వ వైభవం తేగలిగితే మంచి పేరు దక్కించుకుంటారు. లేనిపక్షంలో ప్రభుత్వం పై వ్యతిరేకత అలా అలా అల్లుకుంటుంది. రియల్ ఎస్టేట్ రంగానికి తగిలిన దెబ్బకు పాలకులు మూల్యం చెల్లించక తప్పదు.



గంగాధర్. కే
9291622677

# తేజాకు సుగంధ పరిమళాల మహోత్సవం



ఈశాన్య భారతదేశంలోని అస్సాం రాష్ట్రం ప్రకృతి సౌందర్యంతోపాటు సంపన్నమైన సాంస్కృతిక వారసత్తుకు నిలయం. ఈ రాష్ట్రం తన ప్రత్యేకమైన పండుగలు, నృత్యాలు, సంగీతం ద్వారా ప్రపంచానికి తన సంస్కృతిని ప్రదర్శిస్తుంది. జుమూర్ నృత్యం మరియు అస్సాం సంస్కృతిలో దాని ప్రాధాన్యత రెండు వందల సంవత్సరాల చేయకు సుగంధ పండగ మహోత్సవం అస్సాం రాజధాని గౌహతిలో ప్రధాన మంత్రి ఆధ్వర్యంలో అస్సాం గిరిజన ప్రజల జానపద నృత్యంతో దాదాపు 8500 మంది సాంప్రదాయ నృత్య ప్రదర్శన చేశారు. ప్రపంచవ్యాప్తంగా 68 దేశాల నుంచి ప్రముఖులు వచ్చి ఉత్సవాన్ని తిలకించారు. రాష్ట్రంలో ని బోడో సమాజం యొక్క ప్రధాన మత, సాంస్కృతిక మహోత్సవం. ఈ పండగ బోడో ప్రజల ఐక్యత, ఆచార సంప్రదాయాలు, ప్రకృతి పూజ మరియు వారి ఆరాధ్య దైవమైన "బథౌ బోరై"కు అంకితం చేయబ డింది. జుమూర్ నృత్యంఈ పండగలో ఒక ముఖ్యమైన సాంస్కృతిక అంశం, ఇది బోడో సంస్కృతి మరియు చరిత్రకు మూలాధారంగా పరిగణించబడుతుంది. జుమూర్ నృత్యం బోడో సమాజం యొక్క సాంప్రదాయిక జీవన విధానం, వ్యవసాయ పద్ధతులు మరియు ఆధ్యాత్మిక నమ్మకాలను ప్రతిబింబిస్తుంది. ఈ నృత్యం వారి పూర్వీకుల నుండి తరతరాలుగా సంరక్షించబడినది. క్రియాటి పండగ సమయంలో జుమూర్ నృత్యం ద్వారా సమాజం యొక్క సామూహిక ఆనందం, ఐక్యత మరియు ఆరాధనా భావాలు వ్యక్తమవుతాయి. ఈ నృత్యం దేవతలను ప్రసన్నం చేయడానికి మరియు సమృద్ధిని కోరడానికి ఒక మాధ్యమంగా పనిచేస్తుంది. జుమూర్ నృత్యం బోడో భాష, సంగీతం, వస్త్ర ధారణ మరియు కళాత్మక వ్యక్తీకరణలను సజీవంగా ఉంచుతుంది. ఇది యువతరానికి వారి మూలాలను గుర్తుచేస్తుంది. ఈ నృత్యం సమాజంలోని అన్ని వయస్సు, లింగాల వారినీ ఒకే వేదికపై కలుపుతుంది. నృత్య సమయంలో పాడే పాటలు (జుమూర్ గీతాలు) సామూహిక జీవిత విలువలను బలపరుస్తాయి. అస్సాం సంస్కృతిని ప్రపంచానికి పరిచయం చేయడంలో జుమూర్ నృత్యం ఒక ప్రతీకగా మారింది. ఇటీవలి సంవత్సరాలలో ఈ నృత్యం జాతీయ మరియు అంతర్జాతీయ స్థాయిలలో ప్రదర్శించబడుతుంది. క్రియాటి పండగ యొక్క 200-సంవత్సరాల జూబ్లీ సందర్భంలో జుమూర్ నృత్యం యొక్క ప్రదర్శన, బోడో సమాజం యొక్క స్థితిస్థాపకత మరియు సంస్కృతి యొక్క శాశ్వతత్వాన్ని చాటింది. ఇది అస్సాం యొక్క బహుళసాంస్కృతిక గుర్తింపును బలపరిచే ఒక జీవంత ఉదాహరణ. ఇది అస్సాం తేయాకు తోటల్లోని ట్రైబల్ సముదాయాల నృత్యం. సామూహికంగా చేసే ఈ నృత్యం, జీవన సాఫల్యాన్ని ప్రతిబింబిస్తుంది. అస్సాం ప్రత్యేకమైన సువాసనలకు ప్రసిద్ధి. ఇక్కడి టీ తోటల వాసన, అగరు (ఊద్) కలప, జోహా అనే సువాసన రైస్, మరియు పాన్ (తాంబూలం) సుగంధాలు ప్రత్యేకమైనవి. కాజిరంగా జాతీయ ఉద్యానవనం వంటి ప్రాంతాలు సహజ సుగంధాలను వెదజల్లుతాయి. అస్సాం ప్రాచీన కామరూప సామ్రాజ్యం, ఆహోమ్ రాజవంశం (మధ్యయుగం) చరిత్రను కలిగి ఉంది. బ్రిటిష్ కాలంలో టీ ఉత్పత్తి ప్రాధాన్యత పెరిగింది. స్వాతంత్ర్యం తర్వాత, ఇది ఈశాన్యంలో సాంస్కృతిక కేంద్రంగా అభివృద్ధి చెందింది. స్త్రీలు మేఖేలా చాదర్, పురుషులు ధోతి-గమ్చా ధరిస్తారు. బిహు గీతాలు, జుమూర్ సంగీతం ప్రసిద్ధి. బెల్ మెటల్ క్రాఫ్ట్, ముగా రేష్మే వస్త్రాలు ప్రపంచ ప్రసిద్ధి టీ, వరి, జనపనార ప్రధాన పంటలు. సంస్కృతి, చరిత్ర, ఆర్థిక వైవిధ్యాలతో అస్సాం ఈశాన్య భారతదేశానికి ఒక ముత్యం. ప్రపంచీకరణ యుగంలో కూడా ఇక్కడి సంప్రదాయాలు తమ ప్రత్యేకతను నిలుపుకున్నాయి. సాంస్కృతిక మహోత్సవాలు, సంస్థలు ఈ వారసత్తును భవిష్యత్ తరాలకు అందిస్తున్నాయి.



పూసపాటి వేదాద్రి
కవి సాహితీ విశ్లేషకులు
9912197694

# సొరంగంలోకి సింగరేణి సిఎండి!





గత వారం రోజులుగా ఎస్ ఎల్బిసి సొరంగంలో ఇరుక్కుపోయిన ఎనిమిది మందిని కాపాడడానికి సింగరేణి నుంచి రిస్క్ బృందాలు భారీగా అక్కడికి వెళ్లి ప్రయత్నాలు చేస్తున్నాయి. వారికి మనోధైర్యం కల్పించే విధంగా సింగరేణి సిఎండి ఎన్. బలరాం కూడా గత 24 గంటలుగా బృందాల వెంటే సొరంగంలోకి వెళ్లి వారికి ప్రోత్సాహం అందిస్తున్నారు. మనో ధైర్యం కల్పిస్తున్నారు. నిజంగా ఒక ఐఆర్ఎస్ అధికారి అందులో ఒక సంస్థకు సిఎండిగా ఉన్న బలరాం సిబ్బంది వెంట సొరంగంలోకి లోకో రైల్లో వెళ్లి సహాయక చర్యలు నిమగ్నం కావడం విశేషం!ఋఋ- వందలాది సింగరేణి రెస్క్యూ సిబ్బంది!ఋఇప్పటికే వందమంది పనిచేస్తుండగా మరో 200 మంది సింగరేణి రెస్క్యూ బృందం అక్కడికి చేరుకున్నది. వీరంతా సహాయక చర్యలలో ఇతర బృందాలతో కలిసి పనిచేయడం వల్ల వారికి సహాయంగా ఉన్నట్లు పరిస్థితి కనిపిస్తున్నది. కేంద్ర ,రాష్ట్ర, రెస్క్యూ బృందాలు, నిపుణులు , అక్కడ రాత్రనక పగలనక పని చేస్తున్నారు. సొరంగం నుంచి ఇలాంటి ప్రమాదాలలో రక్షించడానికి నిపుణులైన బృందాలను రప్పిస్తారు. ఈసారి ఈ విషయంలో కేంద్రం కూడా ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్ర మంత్రులు ఉత్తం కుమార్ రెడ్డి, జూపల్లి కృష్ణారావు,కోమటిరెడ్డి వెంకరెడ్డి తదితరులు,ప్రత్యేకంగా వీరిని సురక్షితంగా బయటికి తీసుకరానికి ప్రయత్నాలు చేస్తున్నారు. గత వారం రోజులుగా ఎక్కడ కూడా ఏమాత్రం జాప్యం లేకుండా వీరు సహాయక చర్యలను చేపడుతున్నారు. రిస్క్ తీసుకొని మరి రెస్క్యూ సిబ్బంది పనిచేస్తుంది. రాష్ట్రంలో దేశంలో ఎక్కడ వరదలు వచ్చినా సింగరేణి అవసరం ఎక్కడ ఉంటే అక్కడికి రెస్క్యూ సిబ్బంది వెళ్లడం సహజంగా జరుగుతూ వస్తున్నది .ఎన్నో సాహసోపేత మైన ఆపరేషన్ లను సింగరేణి రెస్క్యూ సిబ్బంది చేసిన దాఖలాలు ఉన్నాయి. కేరళ చెన్నైకి కూడా వీరు వెళ్లడం జరిగింది. ఆంధ్రప్రదేశ్లోనూ ఇటు తెలంగాణలోని భద్రాచలం ప్రాంతానికి కూడా వెళ్లి వరదల సమయంలో ఎంతో సాహసోపేతంగా వరదల్లో ఇరుక్కుపోయిన ప్రజలను కాపాడిన దాఖలాలు ఉన్నాయి. ప్రమాదాలు జరిగి బొగ్గు బావుల్లో బండ కింద కార్మికులు ఇరుక్కుపోయిన సందర్భాలలో నీళ్లు నిండి పోయిన పరిస్థితులలో కార్మికులను కాపాడడంలో ఎంతో ఓర్పు నేర్పుతో సింగరేణి రెస్క్యూ సిబ్బంది పని చేసిన దాఖలాలు ఉన్నాయి. ఇప్పుడు ఏకంగా ఎస్ఎల్బీసీ వద్దకు సిబ్బందితోపాటు సింగరేణి సిఎండి బలరాం కూడా చేరుకొని సొరంగం లోకి వెళ్లడం సాహసోపేతమైన చర్య మాత్రమే కాకుండా అధికారి ,కార్మికుడు అనే భేదభావాలు లేకుండా మనుషులను కాపాడడానికి తమ సిబ్బందితో ఒక సామాన్యుడి మాదిరి బలరాం వెళ్లడం నిజంగా గొప్ప విషయమే!ఆయన మానవ త్వానికి, మనిషి తనానికి ఇది ఒక మచ్చు తునకగా పేర్కొనవచ్చు! బలరాం అంటే నే నిండు మనిషి !నిండు మనిషి కి ప్రతి రూపం!మానవత్వం ఉన్న మనిషి !ఎవరైనా కష్టాల్లో ఉన్నారంటే వెంటనే స్పందించే అధికారిగా ఇప్పటికే సింగరేణి లో, సింగరేణి చుట్టుపక్క ప్రాంతాలలో మంచి పేరు న్న మనిషిగా బలరాం ను పేర్కొనవచ్చు! ఏది ఏమైనా ప్రతి ఒక్కరు సొరంగంలో ఇరుక్కున్న ఆ ఎనిమిది మందిని కాపాడడానికి చేస్తున్న కృషి ఫలించాలని ఆశిద్దాం! వారి కుటుంబ సభ్యులకు వారిని కాపాడి అప్పజెప్పితే వారం రోజులుగా ఎదురు చూస్తున్న వారి కుటుంబాలలో కొంత ఉపశమ నం కలుగుతుంది. ఆ మేరకు అందరి కృషి ఫలించాలని వారు వారి వారి కుటుంబ సభ్యుల వద్దకు సురక్షితంగా చేరుకోవాలని కోరుకుందాం !



ఎండి.మునీర్
సీనియర్ జర్నలిస్ట్, విశ్లేషకులు,
9951865223,

# హైదరాబాద్ యువతకు మరిన్ని ఉపాధి అవకాశాలు

- మల్లేపల్లి లైట్‌హౌస్ సెంటర్ ప్రారంభం
- మేయర్ గద్వాల్ విజయలక్ష్మి



**హైదరాబాద్ సిటీ, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** హైదరాబాద్ యువత భవిష్యత్తును మెరుగుపరిచే దిశగా జీహెచ్ఎంసీ చర్యలు చేపట్టిందని, అందులో భాగంగా లైట్‌హౌస్ కేంద్రాల ద్వారా యువతకు నైపుణ్యాన్ని పెంపొందించి, ఉద్యోగ అవకాశాలు అందించడమే లక్ష్యమని మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అన్నారు. ఈ కార్యక్రమం హైదరాబాద్ యువతకు ఉద్యోగ అవకాశాలు పొందేందుకు, స్వయం ఉపాధి అభివృద్ధి చేసుకునేందుకు ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. హైదరాబాద్ నగరంలోని మొజంపురా బజార్ ఘాట్ లో ఏర్పాటు చేసిన మల్లేపల్లి లైట్‌హౌస్ సెంటర్‌ను శుక్రవారం జీహెచ్ఎంసి మేయర్ గద్వాల్ విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మేయర్ గద్వాల్ విజయలక్ష్మి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి యువతకు నైపుణ్య శిక్షణను అందించి, ఉపాధి అవకాశాలు కల్పిండంపై ప్రత్యేక దృష్టి సారించారన్నారు. అందులో భాగంగా యువతకు స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్, లైట్‌హౌస్ కమ్యూనిటీస్ ఫౌండేషన్ (ఎల్‌సిఎఫ్) భాగస్వామ్యంతో నగర యువతకు నైపుణ్యం, ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటుందని తెలిపారు. జిహెచ్ఎంసి అంటే శానిటేషన్ మాత్రమేనని అనుకుంటారని, కానీ జిహెచ్ఎంసి మరో కోణంలో ముందడుగు వేస్తుందన్నారు. నగర అభివృద్ధితో పాటు యువతకు ఉద్యోగ, స్వయం ఉపాధి కల్పనకు అధిక ప్రాధాన్యతనిస్తుందని వివరించారు. 2023లో చందానగర్‌లో ప్రారంభమైన లైట్‌హౌస్ ప్రోగ్రామ్ ద్వారా ఇప్పటివరకు 1300 మందికి పైగా యువత వివిధ నైపుణ్యాలను అభివృద్ధి చేసుకున్నారని, అందులో 500 మందికి పైగా యువత ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలతో, స్వయం ఉపాధి ద్వారా ఆదాయాన్ని పొందుతున్నారని తెలిపారు. యుబిఎస్ సంస్థ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్ఆర్) కార్యక్రమంలో భాగంగా జీహెచ్ఎంసీ లైట్‌హౌస్ కేంద్రాల నిర్వహణకు ఆర్థిక మద్దతును అందిస్తోందని, అందులో భాగంగా ఈ రోజు ప్రారంభమైన మల్లేపల్లి లైట్‌హౌస్ సెంటర్ యువతకు ఉచిత నైపుణ్య శిక్షణ, కెరీర్ మార్గదర్శకత్వాన్ని అందించనుందని పేర్కొన్నారు. మల్లేపల్లి లైట్‌హౌస్ సెంటర్‌లో యువతకు కెరీర్ మార్గదర్శకత్వం, వ్యక్తిత్వ వికాసం కోసం 50 గం.ల ఫౌండేషన్ కోర్సు, స్పోకెన్ ఇంగ్లీష్ కోర్సులు, ఐటీ అండ్ డిజిటల్ స్కిల్స్ కోసం 'టెక్ హబ్ ' ఫ్యాషన్ డిజైనింగ్, బ్యూటీ పార్లర్ అండ్ మేకప్ తరగతులు, ఆన్‌లైన్ లెర్నింగ్, కెరీర్ కౌన్సెలింగ్ తదితరాలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. 14-17 ఏళ్ల యువత కోసం యువత భవిష్యత్‌కు సిద్ధం కావడానికి వ్యక్తిత్వ వికాసం మరియు కెరీర్ మార్గదర్శకత్వం కల్పించే లైట్‌హౌస్ కిరణ్ కోర్సును మల్లేపల్లి కేంద్రంలో మొదటిసారిగా అందిస్తున్నారని చెప్పారు. జీహెచ్ఎంసీ, ఎల్‌సిఎఫ్ భాగస్వామ్యంతో నగరంలో ఉప్పల్, బోరబండ వంటి ప్రాంతాల్లో కొత్త లైట్‌హౌస్ సెంటర్లను ఏర్పాటు చేయాలని లక్ష్యంగా గలదని ,రాబోయే 3 సంవత్సరాల్లో 5 వేల మందికిపైగా యువతకు ఉపాధి అవకాశాలు, కెరీర్ మార్గదర్శకత్వం అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాంపల్లి కార్పొరేటర్ జాఫర్ ఖాన్, జోనల్ కమీషనర్ అనురాగ్ జయంతి, డిప్యూటీ కమిషనర్ సురేందర్, సంబంధిత అధికారులు, స్థానిక ప్రజలు, నిరుద్యోగ యువత, లైట్ హౌస్ కమ్యూనిటీస్ ఫౌండేషన్ ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# పట్టణ పాలనలో ఆరోగ్యం కీలక పాత్ర

- జిహెచ్ఎంసి కమిషనర్ ఇలంబర్తి



**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ అనిమల్ బయోటెక్నాలజీలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని జరిగిన కార్యక్రమంలో జీహెచ్ఎంసీ కమిషనర్ ఇలంబర్తి ముఖ్య అతిథిగా హాజరై ఒక ఆరోగ్యం "ప్రజారోగ్యం మరియు పట్టణ పాలనలో దాని భూమిక" అన్న అంశంపై ప్రసంగించారు. కమిషనర్ మాట్లాడుతూ.. నేషనల్ సైన్స్ డే కార్యక్రమంలో పాల్గొనడం ఎంతో గౌరవంగా భావిస్తున్నానని, ఈ రోజు సర్ సివి రామన్ ను స్మృతులను స్మరించుకుంటూ మన భవిష్యత్తును రూపొందించడంలో సైన్స్ కీలక పాత్రను హైలైట్ చేసిన రోజన్నారు. సైన్స్ సమాజాన్ని ప్రగతి పథంలో నడిపించే ప్రాముఖ్యతను ఆయన చెప్పారు. ఒక ఆరోగ్యం దృక్పథాన్ని అవలభించడం ద్వారా ప్రజారోగ్యం, జంతు ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ పరస్పర సంబంధాన్ని అర్థం చేసుకోవడం సమర్థవంతమైన పట్టణ పాలనకు కీలకంగా మారుతుందని ఇలంబర్తి పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ వివిధ ఆరోగ్య మరియు పర్యావరణ ప్రాజెక్ట్ ల ద్వారా ఒక ఆరోగ్య విధానాన్ని అమలు చేయడానికి చేస్తున్న కృషిని ఆయన వివరించారు. నగరాలు వేగవంతంగా అభివృద్ధి చెందుతున్న తరుణంలో ప్రజారోగ్యం, జంతువుల ఆరోగ్యం, పర్యావరణ పరిరక్షణ అంతర్గతంగా అనుసంధానమై ఉన్నాయని, దీనిని గుర్తించి చర్యలు తీసుకోవడం అనివార్యమని వివరించారు. ఒక ఆరోగ్య విధానాన్ని అమలు చేయడం ద్వారా మాత్రమే పట్టణ ప్రజారోగ్య సవాళ్లను అదిగమించగలమని, జీహెచ్ఎంసీ అర్థవంతమైన చర్యలు తీసుకుంటూ భాగస్వామ్య సంస్థలతో కలిసి సమగ్ర ఆరోగ్య పాలనను ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉందని ఇలంబర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్.ఐ.ఏ.బి డైరెక్టర్ డా.జి.తారు శర్మ, పి.హెచ్.డి విద్యార్థులు, పాఠశాలల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# పేషెంట్ బంగారు మంగళసూత్రం మాయం

- జెఆర్ రెడ్డి లయన్స్ ఆసుపత్రిలో సిబ్బంది నిర్వాకం
- మీడియాతో చెప్పి గోడువెళ్ళబోసుకున్న బాధితురాలు ప్రత్యూష



**కీసర, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** చికిత్స కోసం ఆసుపత్రికి వెళితే పేషెంట్ బంగారు మంగళ సూత్రం మాయమైన సంఘటన కీసర పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. భాదితురాలు శుక్రవారం మీడియా ముఖంగా తమ ఆవేదనను వ్యక్తం చేశారు. ఆలస్యంగా వెలుగులోకి వచ్చిన ఈ సంఘటన వివరాల్లోకి వెళితే.. చర్లపల్లి లక్ష్మీ నగర్ కాలనీలో నివాసముండే జె.ప్రత్యూష (20) అనే మహిళకు ఫిబ్రవరి 10వ తేదీన సాయంత్రం ఛాతీ నొప్పి రావడంతో సమీపంలోని జె.ఆర్ రెడ్డి లయన్స్ ఆసుపత్రికి చికిత్స కోసం వెళ్లారు. ఈసీజీ తీసే సమయంలో మంగళ సూత్రం తీయమని చెప్పడంతో తీసి నర్స్‌కి ఇచ్చానని, తర్వాత మర్చిపోయి ఇంటికి వెళ్ళి, మరుసటి రోజు వచ్చి అడిగితే.. ఆసుపత్రి యాజమాన్యం తమకేం తెలియదంటూ నిర్లక్ష్యపు సమాధానం చెబుతున్నారని భాదితురాలు ఆవేదన వ్యక్తం చేశారు. భాదితురాలు పోలీసులను ఆశ్రయించడంతో కీసర పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. సుమారు 45 గ్రాముల తన బంగారు మంగళ సూత్రాన్ని ఇప్పించి తనకు న్యాయం జరిగేలా చూడాలని బాధితురాలు కోరుకుంటుంది.

# మందిపల్లి టు చిట్యాల మధ్య బ్రిడ్జి నిర్మాణం చేపట్టాలి

- బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి రవి కుమార్



**నారాయణపేట, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** మాగనూరు మండలంలోని మందిపల్-మక్తల్ మండలంలోని చిట్యాల గ్రామాన్ని కలిపే రోడ్డుకి అడ్డంగా ప్రవహిస్తూన్న వాగుపై బ్రిడ్జి నిర్మించి ప్రజల ఇబ్బందులు తీర్చాలని బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి శంకరోళ్ళ రవికుమార్ అన్నారు. శుక్రవారం ఈ రెండు గ్రామాలను కలిపే వాగు స్థలాన్ని గ్రామస్తులు, నాయకులు, కార్యకర్తలతో కలిసి సందర్శించి, పరిశీ లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాగు ఉండడం వల్ల చుట్టుపక్కల ఉన్న దాదాపు 10 నుంచి 20 గ్రామాలకు రాకపోకలకు ఇబ్బందిగా మారిందన్నారు. మక్తల్, మాగనూరు మండల కేంద్రాలకు చేరడానికి సుదూర ప్రయాణం చేయవలసి వస్తుందన్నారు. ఇక్కడ బ్రిడ్జి వేస్తే ఈ రెండు మండలాల్లో ఉన్న దాదాపు 20 - 30 గ్రామాలకు ప్రయాణ సౌలభ్యంతో పాటు అటు గద్వా లకు ఇటు రాయిచూర్ కు కూడా ప్రయాణం సులభం అవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు జయా నంద్ రెడ్డి, మందిపల్లి వెంకటప్ప, అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# సీఎంతో భేటీ అయిన ఎమ్మెల్యే రాజేష్ రెడ్డి

- మార్చి నెలలో ముఖ్యమంత్రి నాగర్‌కర్నూల్ నియోజకవర్గ పర్యటన



**నాగర్‌కర్నూల్ ఆర్సీ, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** శుక్రవారం ఉదయం హైదరాబాద్ నందు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నివాసంలో నాగర్‌కర్నూల్ నియోజకవర్గానికి సంభందించిన పలు అభివృద్ధి పనుల గురించి చర్చించిన ఎమ్మెల్యే, అందులో ముఖ్యంగా నాగర్‌కర్నూల్ పట్టణంలో నూతన జూనియర్ కాలేజీ భవనం మరియు జేఎన్టీయూ క్యాంపస్ ఏర్పాటు, కొత్త ఆర్ అండ్ బీ రోడ్ల మంజూరు తదితర అభివృద్ధి అంశాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లగా అందుకుగాను సానుకూలంగా స్పందించిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వాటికి సంభందించిన మంజురిలను త్వరితగతిన ఇవ్వాల్సిందిగా సంబధిత అధికారులను ఆదేశించడం జరిగింది. మార్చి నెలలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని నాగర్ కర్నూలు నియోజకవర్గ పర్యటనకు రావాల్సిందిగా కోరిన ఎమ్మెల్యే. దానికి సంభందించి తొందరలోనే తేదీని ఖరారు చేస్తానని చెప్పిన ముఖ్యమంత్రి.

# సీఎం పర్యటన ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి

- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి



**వనపర్తి బ్యూరో, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటనకు ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. మార్చి 2వ తేదీన ముఖ్యమంత్రి వనపర్తి జిల్లా పర్యటనను దృష్టిలో ఉంచుకొని శుక్రవారం ఉదయం జిల్లా ఎస్పీ రావుల గిరిధర్, అదనపు కలక్టర్ లోకల్ బాడీస్ సంచిత్ గంగ్వార్, అదనపు కలెక్టర్ రెవెన్యూ జి. వెంకటేశ్వర్లు, జడ్పి సిఇఒ యాదయ్య, డిఎస్పీ వేంకటేశ్వర రావు, ఇతర సంబంధిత అధికారులతో కలిసి కే.డి.ఆర్. పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుచున్న ఏర్పాట్లను పర్యవేక్షించారు. బహిరంగ సభకు వచ్చే అతి ప్రముఖులు, రాష్ట్ర స్థాయి అధికారులు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు అవసరమైన వసతులు పకడ్బందీగా ఉండే విధంగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులు కలక్టర్ వెంట ఉన్నారు.

# ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలి

- రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్



**హుజూర్‌నగర్, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** రాష్ట్ర ప్రభుత్వం రైతుల పట్ల చిత్తశుద్ధితో వ్యవహరించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు కంబాల శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం హుజూర్ నగర్ లో సిపిఐ కార్యాలయంలో ఆ సంఘం ముఖ్య నాయకుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం మభ్య మాటలతో రైతులను పక్కదోవ పట్టించిందని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎన్నుకున్నారన్నారు. మిర్చి రైతులకు మద్దతు ధర, రైతుల రుణమాఫీ, సన్నరకం వడ్లకు బోనస్, రైతు భరోసా విషయంలో పలువురు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారందరికీ న్యాయం చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ పట్టణ కార్యదర్శి గుండు వెంకటేశ్వర్లు, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు జడ శ్రీనివాస్, యల్లవుల రమేష్, జడ వెంకన్న, జక్కుల రమేష్, సుందరి పద్మ, జక్కుల శ్రీనివాస్, యల్లావుల ఉమా, చెన్నబోయిన సైదులు, చక్రాల స్టాలిన్, యల్లావుల సురేందర్, కుడి తొట్టి స్వామి తదితరులు పాల్గొన్నారు.

# జిల్లాలో నెల రోజులపాటు 30, 30(ఎ) పోలీసు యాక్ట్

- జిల్లా ఎస్పీ చెన్నూరి రూపేష్



**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** జిల్లాలో శాంతి భద్రతలను దృష్టిలో వుంచుకొని నెల రోజుల పాటు (మార్చ్ 1వ తేది నుండి 31 వరకు) జిల్లా వ్యాప్తంగా 30, 30(ఎ) పోలీసు యాక్ట్-1861 అమలులో ఉంటుందని జిల్లా యస్పి చెన్నూరి రూపేష్ ఒక ప్రకటనలో తెలిపారు . పోలీసు అధికారుల ముందస్తు అనుమతి లేనిది సంగారెడ్డి జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు, ర్యాలీలు, పబ్లిక్ మీటింగ్స్, సభలు, సమావేశాలు నిర్వహించరాదని, శాంతి భద్రతలకు భంగం కలిగే విధంగా, ప్రజాధనానికి నష్టం కల్గించే, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు చేపట్టకూడదన్నారు. జిల్లా ప్రజలు, ప్రజా ప్రతినిధులు, వివిధ సంఘాల నాయకులు ఈ విషయంలో పోలీసులకు సహకరించవలసిందిగా సూచించారు. అనుమతి లేకుండా పై చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టరిత్య కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# ట్రాక్టర్ ప్రయాణం అటో.. ఇటో



**పి.ఏ.పల్లి, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** పి.ఏ.పల్లి మండలంలో వేరుశనగ పంట తెంపటానికి రైతులు కూలీలను ట్రాక్టర్ యందు ప్రమాదపుటంచున తరలిస్తున్నారు. ఒక్క ట్రాక్టర్ యందు దాదాపుగా 40 నుండి 50 మందిని తరలిస్తున్నారు. ఏదైనా జరగరాని ప్రమాదం జరిగితే వారి కుటుంబ సభ్యులు రోడ్డున పడతారు. గతంలో పడమటి తండా వాసులు ఇదే విధంగా ట్రాక్టర్లో పనికి వెళ్తున్నప్పుడు ట్రాక్టరు పుట్టంగండి కాలువలో పడి 9 మంది కూలీలు చనిపోయారు. సంబంధిత శాఖ అధికారులు ఏదైనా సంఘటన జరిగితే హడావుడి చేస్తారు. ఇప్పటికైనా అధికారులు తనిఖీలు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలని పలువురు కోరుతున్నారు.

# ఆవిష్కరణలు భవిష్యత్తుకు ఉపయోగం



**పాపన్నపేట, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** విద్యార్థులకు సైన్స్ పట్ల ఆసక్తి కల్పించి,భవిష్యత్ లో ఎన్నో ఆవిష్కరణలు చేసి సమాజానికి ఉపయోగపడే విధంగా విద్యార్థులకు ప్రోత్సహించామని పాపన్నపేట శ్రీవిద్య పాఠశాల ప్రిన్సిపల్ రవీందర్ అన్నారు. శుక్రవారం అంతర్జాతీయ సైన్స్ దినోత్సవం పురస్కరించుకొని పాఠశాలలో వివిధ తరగతుల విద్యార్థులు సైన్స్ ప్రయోగ పరికరాలతో కొన్ని ప్రాజెక్టులు తయారు చేసుకొచ్చారు. వారు తయారు చేసిన ప్రాజెక్టులు గురించి తోటి విద్యార్థులకు ఉపాధ్యాయులకు చక్కగా విశ్లేషించారు. సైన్స్ ప్రయోగ ప్రాజెక్ట్ చేయడానికి విద్యార్థులకు ఉపాధ్యాయులు ప్రోత్సహించడంతో వివిధ నైపుణ్యాలతో ప్రాజెక్టులు తయారు చేసి సైన్స్ పట్ల ఆసక్తి పెంచుకున్నారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ నిటలాక్ష్యప్ప, ఉపాధ్యాయులు సునీత, నిర్మల, వనజ, ప్రియాంక, దుర్గ, విజయ, పల్లవి, వసంత, అనురాధ, విలాస్, జ్యోతిరాజ్, శీలా తదితరులు ఉన్నారు.

# రంజాన్ మాసం నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలి

- అదనపు కలెక్టర్ లక్ష్మీనారాయణ



**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** ప్రశాంత వాతావరణంలో పవిత్ర రంజాన్ మాసం నిర్వహించుటకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఐడీఓసీ కాన్ఫరెన్స్ హాల్ నందు రంజాన్ మాసం ఉపవాస దీక్షల సందర్భంగా చేపట్టాల్సిన ఏర్పాట్లు, చేపట్టాల్సిన ఏర్పాట్లపై ముస్లిం మత పెద్దలు, సంబంధిత అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రంజాన్ మాసం ఉపవాస దీక్షలు మార్చి 2 నుంచి ప్రారంభమవుతున్నందున జిల్లాలో ఉన్న ప్రతీ మసీద్, ఈద్గాలలో త్రాగునీరు, శానిటేషన్, నిరంతర విద్యుత్ సరఫరా, వీధి లైట్లు, తదితర ఏర్పాట్లు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గ్రామాలు, పట్టణాలోని ప్రార్థనా స్థలాల పరిసరాలలో పారిశుధ్య కార్యక్రమాలను నిరంతరం నిర్వహించాలని, తాగునీటి సమస్య తలెత్తకుండా నీటిని సరఫరా చేయాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. నమాజ్ సమయంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా ఏర్పాట్లు చేయాలని విద్యుత్‌శాఖ అధికారులకు సూచించారు. రంజాన్ పర్వదినం రోజు ప్రార్థనా స్థలాల్లో మెడికల్ సదుపాయాలు ఏర్పాటు చేయాలని డి.యం.హెచ్.ఓకు ఆదేశించారు. ఎక్కడ కూడా శాంతి భద్రతల సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని, సమస్యాత్మక ప్రాంతాలలో ప్రత్యేక నిఘాను ఏర్పాటు చేయాలని పోలీస్ అధికారులకు సూచించారు. రంజాన్ మాసం ప్రశాంతంగా, శాంతియుత వాతావరణంలో జరుపుకోవాలని ముస్లిం ప్రతినిధులకు సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ నర్సింగ రావు, ఆర్డీఓ శ్రీనివాస రావు, గద్వాల తహసీల్దార్ మల్లికార్జున్, జిల్లా మైనారిటీ సంక్షేమ అధికారి రమేష్ బాబు, డి.యం.హెచ్.ఓ సిద్దప్ప,విద్యుత్ శాఖ ఈ.ఈ రమేష్ బాబు, మున్సిపల్ కమిషనర్లు, ముస్లిం మత పెద్దలు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాజీ మార్గమే...రాజ మార్గం

- జాతీయ లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి
- జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** వివాదాలు అనేవి పెంచుకోవాలనుకుంటే జీవితకాలం కొనసాగుతాయి...ఒకవేళ ఇంతటితో కలిసుంటామని ఒక నిర్ణయానికి వస్తే ఇప్పుడే అవి సమసిపోతాయని రాజీమార్గమే రాజమార్గమని జిల్లా ఎస్పీ యోగేష్ గౌతమ్ తెలిపారు. జాతీయ లోక్ అదాలత్ సందర్భంగా జిల్లా లో వివిధ రకాల రాజీపడ దగు కేసులలోని కక్షిదారులకు విజ్ఞప్తి చేస్తూ ఒక ప్రకటనను విడుదల చేసారు. ఉచిత న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో మార్చ్ 08వ తారీఖు వరకు నారాయ ణపేట, కోస్గి కోర్టులలో "నేష నల్ లోక్ అదాలత్" సంద ర్భంగా కక్షిదారులకు అందు బాటులో ఉంటారని తెలి పారు. మీకు తెలిసిన వాళ్లపై ఏమైనా కేసులు ఉంటే వాటిని రాజీ చేసుకొని కోర్టుకు హాజరై నట్లయితే ఆ కేసులను పూర్తిగా క్లోజ్ చేయడం జరుగుతుం దని అన్నారు. యాక్సిడెంట్ కేసులు, కొట్టుకున్న కేసులు, చీటింగ్ కేసులు, వివాహ బంధానికి సంబంధించిన కేసులు, చిన్న చిన్న దొంగ తనం కేసులు, కరోనా సమయంలోని కేసులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు ఇతర రాజీ పడదగు కేసులను జాతీయ లోక్ అదాలత్ ద్వారా తమ తమ కేసులను సత్వరమే పరిష్కరించుకుని న్యాయం పొందవచ్చని ఎస్పీ అన్నారు. ఈ అవకా శాన్ని కేసులలో ఉన్నటువంటి ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసు కోగలరని కోరారు. దీనికోసం ఫిర్యాదు దారుడు, నేరస్తులు అందరూ తమ యొక్క ఆధార్‌కార్డు తీసుకుని సంబంధిత కోర్ట్/ప్రదేశంలో హాజరు కావాలని తెలిపారు. జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా వ్యా ప్తంగా బాధితులకు మంచి అవకాశం అని దిని సద్విని యోగం చేసుకోవాలని ఎస్పీ తెలిపారు.

# కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఇంటర్మీడియట్ పరీక్షలు నిర్వహించాలి

- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతి కుమారి



**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** కట్టుదిట్టమైన ఏర్పాట్ల నడుమ ఇంటర్మీడియట్ వార్షిక పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి సూచించారు. ఈ నెల 5వ తేదీ నుండి ప్రారంభం కానున్న ఇంటర్ వార్షిక పరీక్షల ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, పోలీస్ కమిషనర్లు, ఎస్పీలతో సీ.ఎస్ శుక్రవారం సాయంత్రం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష జరిపారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ, ఎలాంటి పొరపాట్లకు, కాపీయింగ్ కు తావులేకుండా ప్రశాంత వాతావరణంలో సాఫీగా పరీక్షలను నిర్వహించేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలన్నారు. పరీక్షా కేంద్రాలలోకి ఎట్టి పరిస్థితుల్లోనూ సెల్ ఫోన్లను అనుమతించకూడదని, చీఫ్ సూపరింటెండెంట్లు, డిపార్ట్మెంటల్ అధికారులు, ఇన్విజిలేటర్ లతో పాటు కేంద్రాలను తనిఖీ చేసేందుకు వెళ్లే అధికారులు సైతం సెల్ ఫోన్ లు తీసుకెళ్లకూడదని ఆదేశించారు. ప్రతి ఒక్కరినీ క్షుణ్ణంగా తనిఖీలు చేసిన తరువాతనే లోనికి అనుమతించాలన్నారు. పరీక్షా కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తూ, గట్టి పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేయాలని అన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం కలెక్టర్ బి.యం. సంతోష్ పరీక్షల నిర్వహణపై వివిధ శాఖల అధికారులకు కీలక సూచనలు చేశారు. పరీక్షా కేంద్రాలకు ప్రశ్నాపత్రాలు తీసుకురావడం మొదలుకుని, పరీక్షలు ముగిసిన మీదట ఆన్సర్ షీట్లను నిర్ణీత పాయింట్‌కు తరలించేంతవరకు ఎంతో జాగ్రత్తగా ఉండాలన్నారు. ప్రతి కేంద్రంలోనూ పరీక్షల నిర్వహణ తీరును చీఫ్ సూపరింటెండెంట్ లు నిశితంగా పర్యవేక్షించాలని ఆదేశించారు. పరీక్ష కేంద్రాల వద్ద తాగునీటి వసతి, సరిపడా ఫర్నీచర్, టాయిలెట్స్ వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉంచాలన్నారు. పరీక్షా సమయాలకు అనుగుణంగా రవాణా సదుపాయం అందుబాటులో ఉండేలా బస్సులు నడిపించాలని, పరీక్షలు జరిగే సమయంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడకుండా చూడాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. పరీక్షా కేంద్రాల పరిసర ప్రాంతాల్లోని జిరాక్స్ సెంటర్ లను మూసి వేయించాలని, 144 సెక్షన్ అమలు చేయాలని, తగిన సంఖ్యలో పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యార్థుల సౌకర్యార్థం కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయడం జరిగిందని, వార్షిక పరీక్షలకు సంబంధించి ఏవైనా సమస్యలు, సందేహాలు ఉంటే 9441016098కు కాల్ చేయాలని సూచించారు. జిల్లాలో పరీక్షలు సజావుగా నిర్వహించేందుకు మొత్తం 14 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందని, 8 ప్రభుత్వ కళాశాలలు, 6 ప్రైవేట్ కళాశాలలు గలవని అన్నారు. ఇంటర్ ప్రథమ సంవత్సరంలో 4057, ద్వితీయ సంవత్సరంలో 4284 మొత్తం 8341 విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నారని తెలిపారు. పరీక్షల నిర్వహణకు 14 మంది చీఫ్ సూపర్ ఇంటెండెంట్లు, 14 మంది డిపార్ట్మెంటల్ అధికారులు, 03 పేపర్ కస్టోడియన్ లు, 1 ఫ్లయింగ్ స్క్వాడ్, 02 సెట్టింగ్ స్క్వాడ్ లను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మార్చ్ 5వ తేదీ నుండి 25వ తేదీ వరకు జరిగే పరీక్షలను విజయవంతంగా నిర్వహించాలని సూచించారు. వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా ఎస్పీ శ్రీనివాసరావు, అదనపు కలెక్టర్లు లక్ష్మీనారాయణ, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాస రావు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి హృదయ రాజు, జిల్లా వైద్యాధికారి సిద్ధప్ప, మున్సిపల్ కమిషనర్లు సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# "దయనీయంగా మారిన దర్జీల బతుకులు"



- చేర్యాలలో ప్రపంచ దర్జీల దినోత్సవం

**చేర్యాల, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** కార్పొరేట్ శక్తులు రెడీమెడ్ రంగలోకి రోజురోజుకు విస్తరిస్తూ పట్టణ, గ్రామాలలో టైలరింగ్ పై జీవనాన్ని కొనసాగించి వారి పరిస్థితి దయనీయంగా మారిందని దర్జీలు పేర్కొన్నారు. ఏండ్ల తరబడి కుట్టులోనే జీవితాలను గడుపుతూ అద్దె ఇండ్లల్లో, షాప్‌లలో ఉంటూ కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. పూటకు ఐదువేళ్లు నోట్లోకి వెళ్లలేని పరిస్థితిలలో జీవితానికి భద్రత శూన్యం అవుతూ ఆరోగ్య సమస్యలు సైతం వెంటాడుతున్నాయి, ముఖ్యంగా కంటిచూపు దెబ్బతినడంతో భవిష్యత్ అంధకారంగా మారింది. ప్రభుత్వం సబ్సిడీ రుణాలు, ఉచిత కరెంట్ అందించాలని కోరుతున్నారు. కొంతకాలం కిందట రెడీమేడ్ వస్త్రాలతో గిరాకీలు తగ్గినా ఇప్పుడిప్పుడే మళ్లీ టైలరింగ్ డిమాండ్ పెరుగుతూ వస్తోంది. పూర్వకాలంలో పద్మశాలీలు,మేర కులాలవారు మాత్రమే వస్త్రాలు కుట్టేవారు. ప్రస్తుతం అన్నివర్గాల వారు టైలరింగ్లో ప్రావీణ్యం సంపాదించుకున్నారు. టైలరింగ్ వృత్తిపైనే ఆధారపడి పిల్లలను ఉన్నత చదువులు చదివించడంతోపాటు పెండ్లిళ్లు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. దర్జీల పట్ల ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని కోరుతున్నారు.

# బ్యాచ్ నెంబర్ తప్పుగా నమోదైన పురుగుల మందును కొనొద్దు

- జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్

**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** ఉప వ్యవసాయ సంచాలకులు పెస్టిసైడ్ టెస్టింగ్ ల్యాబ్ వారి నివేదికానుసారం లాంబ్డా సైహాలోథ్రిన్ 5% ఈసీ విత్ యాక్టివ్ ఇంగ్రిడియంట్స్ 3.07% బ్యాచ్ నెంబర్ 24092601 గల పురుగుమందు తప్పుగా బ్రాండ్ చేయబడినదిగా నిరూపనైనందున ఈ బ్యాచ్ నెంబర్ గల పురుగు మందును రైతులు ఎవరు కొనుగోలు చేయవద్దని జిల్లా వ్యవసాయ అధికారి సక్రియ నాయక్ ప్రకటన ద్వారా తెలిపారు.

# ప్రధానమంత్రి ఇంటర్న్‌షిప్ పథకం రెండవ దశ ప్రారంభం

- జిల్లా కలెక్టర్ సంతోష్

**గద్వాల నడిగడ్డ, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** భారత ప్రభుత్వం అందించే ప్రధానమంత్రి ఇంటర్న్ షిప్ పథకం" రెండవ దశ ప్రారంభమైనట్లు జిల్లా కలెక్టర్ బి.యం. సంతోష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ ఇంటర్న్ షిప్ పథకానికి దరఖాస్తు చేసుకునే వారి వయస్సు 21 నుండి 24 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. కుటుంబ సభ్యులలో ఎవరు కూడా ప్రభుత్వ ఉద్యోగి అయి ఉండకూడదని, పదవ తరగతి, ఇంటర్ , డిగ్రీ , ఐటిఐ పాలిటెక్నిక్ డిప్లమా పూర్తయి ఉండాలని, కుటుంబ సంవత్సర ఆదాయం ఎనిమిది లక్షలలోపు కలిగి ఉండాలని అన్నారు. ఎంపికైన విద్యార్థులకు నెలసరి జీతం 5000 రూపాయలు ఇస్తూ ఒకేసారి 6000 మంజూరు చేయబడతాయి అని తెలిపారు. ఈ 12 నెలల ఇంటర్న్ షిప్ కాలవ్యవధిలో కనీసం 6 నెలలు ఉద్యోగ శిక్షణ ఉంటుందని, దీని వలన ఉపాధి అవకాశాలను మెరుగుపరుచుకోవచ్చని తెలిపారు.

# అంతర్జాతీయ స్థాయి కరాటేలో సత్తా చాటిన చారకొండ విద్యార్థి విగ్నేష్



**చారకొండ, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** హైదరాబాద్లోని సరూర్నగర్ ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన అంతర్జాతీయ లెవల్ గ్రాండ్ చాంపియన్షిప్ అండర్ 14 కలాటే విభాగంలో చారకొండ మండల కేంద్రానికి చెందిన చారకొండ జంగయ్య, వెంకటమ్మల దంపతుల కుమారుడు విగ్నేష్ మొదటి స్థానంలో ప్రతిభ కనబరచడంతో కరాటే రాష్ట్ర అధ్యక్షుడు మల్లికార్జున్ గౌడ్ చేతుల మీదుగా విగ్నేష్ మొదటి బహుమతిని అందుకున్నాడు. విగ్నేష్ హైదరాబాద్లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో 8వ తరగతి చదువుతున్నాడు. అంతార్జాతీయ స్థాయి కరాటేలో విగ్నేష్ ప్రతిభ కనబరచడంతో తల్లిదండ్రులు, కరాటే మాస్టర్, పాఠశాల ఉపాధ్యాయులు, తోటి విద్యార్థులు, బంధువులు, చారకొండ గ్రామస్థులు విగ్నేష్ ను అభినందించారు

# పరీక్షల వేళ పని చెప్పొద్దు

- ఆర్జేడి ఎస్ సి.విజయలక్ష్మి



**నారాయణపేట జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** పరీక్షల వేళ పిల్లలకు పనులు చెప్పొద్దని ఆర్ జే డి,ఎస్ సి.విజయలక్ష్మి తల్లిదండ్రులకు సూచించారు. "తలుపు తట్టండి" కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం 6 గం నుండి 8 గం. లోపు మరికల్ మండలం మాద్వార్ గ్రామంలోని పదవ తరగతి విద్యార్థుల పబ్లిక్ పరీక్షల సన్నహకం నిమిత్తం వారి ఇండ్లను సందర్శించి వారి తల్లిదండ్రులతోముచ్చటించారు. ఈ సందర్భంగా విజయలక్ష్మి మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యార్థులకు ఇంట్లో పనులేవి చెప్పకుండా రాబోయే 20 రోజుల్లో చదవ డం రాయడం పైనే దృష్టి పెట్టాలని అన్నారు. పిల్లల ఆరోగ్యం చాలా ముఖ్యమని, ఒత్తిడి లేకుండా వారితో ప్రేమ గా మెలగాలి అంటూనే, విద్యార్థులకు ఇబ్బంది కలి గించే ఏ అవకాశం ఇవ్వరా దన్నారు. తల్లిదండ్రులు తమ ఇళ్లకు ఇలా ఉపాధ్యాయులు రావడం తమ బాధ్యతను గుర్తుచేసిందని అన్నారు. విద్యార్థులు చాలా ఆత్మ విశ్వాసంతో ఉన్నారని, వారి చురుకుదనం ఇలా ఉపా ధ్యాయులని వాటి ఇండ్లకు వచ్చేలా చేసిందన్నారు. విద్యార్థుల ప్రతీ అవసరంలో ఉపాధ్యాయులు అందుబాటులో ఉంటారని విద్యార్థులూ నిస్సంకోచముగా తమ సందేహాలు నివృత్తి చేసుకోని పబ్లిక్ పరీక్షలు మరింత కాన్ఫిడెంట్ గారాయలన్నారు. జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ప్రారంభించిన ఈ కార్యక్ర మంలో అన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు విద్యార్థుల ఇళ్లకు వెళ్ళడం జరిగిందని, ఇలా విద్యార్థుల్లో పరీక్షల పట్ల భయం పోగొట్టడం, తల్లిదం డ్రుల బాధ్యత గుర్తు చేయడం వల్ల మరింత మెరుగైన ఫలితాలుసాధించవచ్చన్నారు. కార్యక్రమంలో డీఈఓ గోవిందరాజు, ఏ ఏం ఓ విద్యా సాగర్ ఎమ్ ఈఓ మనోరంజని జీహెచెం నాగరత్న ఉపా ధ్యాయులు పాల్గొన్నారు.

# పదవి విరమణ సర్వసాధారణం

- జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్



**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** ప్రతి ఉద్యోగికి పదవీ విరమణ సాధారణమని జిల్లా కలెక్టర్ రాహుల్రాజ్ అన్నారు. జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో ఏవీఎస్‌గా విధులు నిర్వహించిన కిషోర్ బాబు శుక్రవారం పదవి విరమణ పొందారు. జిల్లా కలెక్టర్ కిషోర్ బాబుని శాలువాతో సత్కరించి, పూలమాలలు వేసి పదవీ విరమణ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ మాట్లాడుతూ పదవి విరమణ అనేది ప్రతి ఉద్యోగికి సహజమని గత 29 సంవత్సరాలుగా క్రమశిక్షణ, అంకితభావంతో సేవ చేసిన కిషోర్ బాబు గొప్ప వ్యక్తి అని కొనియాడారు. విధి నిర్వహణలో అందరి మన్ననలు పొందడంతో పాటు , ఉత్తమ సేవలు అందించారని తెలిపారు. సాధారణ ఉద్యోగ జీవితం నుండి మొదలై తన ప్రయాణం లో ఏవీఎస్ గా పదవి విరమణ పొందడం తన క్రమశిక్షణకు, పట్టుదలకు నిదర్శనం అని తెలిపారు. రానున్న రోజుల్లో అష్టైశ్వర్యాలు ఆరోగ్యంతో ఉండాలని తెలిపారు. డి పి ఆర్ ఓ రామచంద్ర రాజు మాట్లాడుతూ కిషోర్ బాబు అంటేనే క్రమశిక్షణ అని, ఎవరిని నొప్పించకుండా తన పనులు తాను చేసుకుంటూ ఉద్యోగ బాధ్యత నిర్వహించాలని గుర్తు చేశారు. 29 సంవత్సరాలు ఉద్యోగ జీవితంలో ఎన్నో ఆటుపోట్లు ఎదుర్కొని ఉన్నత స్థాయిలో పదవి విరమణ పొందడం తమ శాఖకి చాలా గొప్ప విషయం అన్నారు. జీవితంలో కిషోర్ బాబు మరింతగా ఉన్నతంగా స్థిరపడాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిషోర్ బాబు కుటుంబ సభ్యులు, మిత్రులు శర్మ, ఏపీఆర్ఓ బాబురావు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టండి

- ప్రభుత్వ మెనూ ప్రకారం భోజనం అందించాలి
- జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరు



**సంగారెడ్డి ప్రతినిధి, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** వార్షిక పరీక్షలు దగ్గర పడుతున్నందున విద్యార్థులు చదువుపై దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ క్రాంతి వల్లూరి విద్యార్థులకు సూచించారు. సంగారెడ్డి పట్టణంలోని అంబేద్కర్ స్టేడియం సమీపంలోని శివాజీ నగర్‌లోని షెడ్యూల్ కులాల బాలికల వసతి గృహాన్ని జిల్లా కలెక్టర్ శుక్రవారం రాత్రి ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో కిచెన్ షెడ్డును, డైనింగ్‌హాల్‌ను, స్టోర్‌రూమ్‌లో నిత్యవసర వస్తువులను పరిశీలించారు. వసతి గృహంలో విద్యార్థులకు నూతన మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పరీక్షల సమయం దగ్గర పడుతున్నందున చదువుపై విద్యార్థులు దృష్టి సారించాలని విద్యార్థులకు సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ విద్యార్థులతో కలిసి రాత్రి భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ శాఖ అధికారి జగదీష్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# డప్పు వాయిద్యం మాల మాదిగల ప్రతీక



**చేర్యాల, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** చేర్యాల మండలం అర్జున్ పట్ల గ్రామంలోఎమ్మార్పీఎస్ డప్పు కళాకారులకు మంతపురి భూమయ్య గౌడ్ చేతుల మీదుగా శుక్రవారం డప్పులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భూమయ్య గౌడ్ మాట్లాడుతూ.. డప్పు వాయిద్యం ఎన్నో తరాలుగా మాల మాదిగల జీవితంలో ఒక అంతర్భాగమైంది, వారి వాయిద్య చప్పుడుతో శుభ, అశుభ కార్యక్రమాలకు వారు లేనిదే జరగని పరిస్థితి, వారు ఒక్కో కార్యక్రమానికి ఒక్కో విధంగా డప్పు శబ్దాన్ని చేస్తూ,వారు ఏ కార్యక్రమానికి హాజరయ్యారో అర్థం అయ్యే విధంగా ప్రదర్శించే ఇలాంటి కళాకారులను అందరూ ఆదరించి వారి యొక్క నైపుణ్యాన్ని గుర్తించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ భీమ్ రెడ్డి నరసింహ రెడ్డి,చేర్యాల ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షులు సింగపక బాబు, చేర్యాల మార్కెట్ కమిటీ డైరెక్టర్ సింగపక కుమారు, మాజీ సర్పంచ్ డప్పు గాలయ్య, మాజీ ఎంపిటిసి (కుల పెద్దమనిషి) సింగపక కనకయ్య, ఎమ్మార్పీఎస్ గ్రామ శాఖ అధ్యక్షులు సింగపక రవి, కుల పెద్ద మనుషులు మాదాస్ బాలమల్లు, సింగపాక రాజయ్య, సింగపక పోచయ్య, లింగంపల్లి రాజు, సింగపక బాలయ్య, సింగపక సాయిలు పాల్గొన్నారు.

# ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాలలో మెరుగైన సేవలు అందించాలి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి
- ఆకస్మికంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం తనిఖీ



**నార్కట్‌పల్లి, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** ముందస్తు అనుమతు లేకుండా ఎవ్వరు విధులకు గైర్హాజరు కావద్దని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. శుక్రవారం నాడు నార్కట్ పల్లి మండలం అక్కనపల్లి గ్రామంలో ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ వరూధిని ఎలాంటి ముందస్తు అనుమతి లేకుండా సెలవు పెట్టకుండా విధులకు గైరహాజరైనట్లు సిబ్బంది ద్వారా తెలుసుకొని నిర్ధారించారు జిల్లా యంత్రాంగం పదేపదే అధికారులకు సిబ్బందికి ముందస్తు సమాచారం లేకుండా గైర్హాజరు కావద్దని తెలియజేసినప్పటికీ డాక్టర్ వరూధిని ఉన్నతాధికారుల అనుమతి లేకుండా ముందస్తు సమాచారం లేకుండా సెలవు పెట్టకుండా విధులకు గైర్హాజర్ కావడం ఆమెకు విధుల పట్ల ఉన్న నిర్లక్ష్యాన్ని స్పష్టంగా తెలియజేస్తుందని అందువల్ల ఆమెకు షోకాజ్ నోటీసు ఇవ్వడం జరిగింది రెండు రోజుల్లో వివరణ ఇవ్వాలని కోరారు. అనంతరము మందుల స్టాక్ రిజిస్టర్ను తనిఖీ చేసి మందులు ఎలా ఇస్తున్నారు స్టాఫ్ నర్స్ ను అడిగి తెలుసుకోవడం జరిగింది ప్రాథమిక వైద్య కేంద్రం సిబ్బందితో మాట్లాడుతూ గర్భిణీ స్త్రీలు చిన్నపిల్లలు వృద్ధులు తదితరులకు వారికి అందిస్తున్న చికిత్స పట్ల తీసుకున్న జాగ్రత్తలు చిన్నపిల్లలకి ఇచె ట్టి కాలు తదితర వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాల ద్వారా మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

## రెసిడెన్షియల్ కళాశాల ఆకస్మికంగా తనిఖీ

నార్కట్‌పల్లి మండలము చిన్న నారాయణపురంలో ఉన్న తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ కళాశాలను ఆకస్మికంగా తనిఖీ చేయడం జరిగింది కళాశాల హాస్టల్ లో వంటశాల గదిని వంట సరుకులను కూరగాయలను పప్పు దినుసులను పరిశీలించి వంటగది శుభ్రంగా లేకపోవడంతో ప్రిన్సిపల్ పై ఆగ్రహం వ్యక్తం చేశారు మరోసారి వంటగది అపరిశుభ్రంగా ఉన్నట్లయితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు అనంతరం విద్యార్థులతో కలెక్టర్ ముఖాముఖి మాట్లాడి ప్రశ్నా జవాబుల ద్వారా విద్యాసామర్థ్యాలను పరిశీలించడం జరిగింది. విద్యార్థినిలకు చాక్లెట్లను పంపిణీ చేసారు. పక్కా హాస్టల్ భవనం మంజూరు చేయాలని ప్రిన్సిపల్ సిబ్బంది విజ్ఞప్తి చేయగా పరిశీలిస్తామని తెలిపారు.

# ఏడుపాయల జాతరకు వచ్చిన భక్తుడు అదృశ్యం



**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ బాగా రెడ్డిపల్లి గ్రామానికి చెందిన పేర్ల పెంటయ్య 42 శివరాత్రి నాడు పండగకు ఏడుపాయల నవరాత్రుల సందర్భంగా ఇంటి నుండి జాతరకు వచ్చినట్లు, ఆ తర్వాత ఇంటికి రాకపోవడంతో బంధువుల వద్ద స్నేహితుల వద్ద వెతకగా ఆచూకీ లభ్యం కాకపోవడంతో కొల్చారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేస్తున్నట్లు తెలిపారు. యువకుడు వయసు 42 సంవత్సరాలు ఉంటుందని భార్య లక్ష్మి తమ్ముడు కొల్చారం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు బంధువులు తెలిపారు. పై ఫోటోలో ఉన్న వ్యక్తి ఎక్కడైనా కనిపిస్తే 7032423857, 9346153018 ఈ నెంబర్లకు తెలపాలని విజ్ఞప్తి చేశారు.

# భార్యాభర్తలు అనారోగ్యంతో మృతి

- అనాథాలుగా మారిన చిన్నారులు



**మల్దకల్, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** జోగులాంబ గద్వాల జిల్లా మల్దకల్ మండలం చర్ల గార్లపాడు గ్రామంలో అమ్మా, నాన్న లేక అనాథలుగా చిన్నారులు మారారు. మల్దకల్ మండలం చర్లగార్లపాడు గ్రామంలో అనారోగ్యంతో తల్లి, ఆర్థిక ఇబ్బందులతో తండ్రి మృతి చెందగా ముగ్గురు చిన్నారులు అనాథలయ్యారు. గ్రామస్థుల కథనం ప్రకారం.. కుమ్మరి వీరేశ్,భారతి కుండలు చేస్తూ జీవిస్తున్నారు. భారతి జనవరి 16న అనారోగ్యంతో మృతి చెందింది. భార్య లేని లోటు, ఆర్థిక ఇబ్బందులతో వీరేశ్ గురువారం ఆత్మహత్య చేసుకున్నాడు. తల్లిదండ్రులు మృతి చెందడంతో వారుకున్న ముగ్గురు చిన్నారులు అనాథలయ్యారు. అనాథలైన పిల్లలకు ఆర్.ఎం.పి వీరేష్ తోపాటు వారి స్నేహ బృందం మట్టి ఖర్చులు నిమిత్తం 24500 ఆర్థిక సాయం అందజేశారు. ఆ ముగ్గురు చిన్నారులను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు స్థానిక ప్రజా ప్రతినిధులను అఖిలపక్ష నాయకులను వేడుకుంటున్నారు.

# కెన్యాలో పర్యటించిన అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి

**ముల్కనూర్ సొసైటీ డెవలప్మెంట్ గూర్చి పవర్ పాయింట్ ప్రజెంటేషన్..**

**భీమదేవరపల్లి, ఫిబ్రవరి 28(జనం సాక్షి)**




: అండర్‌స్టాండింగ్ ది కెన్యా మోడల్ ఆఫ్ కో – ఆపరేటివ్స్ అండ్ అగ్రికల్చరల్ సిస్టమ్స్ స్టడీ విజిట్ కొరకు ములకలూరు సొసైటీ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి కెన్యాలోని మొంబాసా నగరంలో పర్యటించారు. ఈ సమావేశం ఫిబ్రవరి 24 నుండి 28 వరకు నిర్వహించబడుతుంది. ఈ సమావేశంలో నేడాక్ ప్రతినిధులు, సభ్యులు పాల్గొని సహకారాన్ని పెంపొందించుకోవడానికి, జ్ఞానాన్ని పంచుకోవడానికి సహకార రంగంలో ప్రతిభావంతమైన బుద్ధిని ప్రోత్సహించడానికి సమావేశం అయినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ముల్కనూర్ సహకార సంఘ అధ్యక్షులు అలిగిరెడ్డి ప్రవీణ్ రెడ్డి సంఘ కార్యక్రమాలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. స్టడీ టూర్ లో భాగంగా "అండర్ స్టాండింగ్ ది కెన్యా మోడల్ ఆఫ్ కో– ఆపరేటివ్ అండ్ అగ్రికల్చరల్ సిస్టమ్స్" అంశంపై కెన్యాలో విజయవంతమైన సహకార సంఘాలు క్రెడిట్ సహకార సంఘాల చేత నిర్వహించబడుతున్న వినూత్న వ్యూహాలు సభ్యుల ఓటింగ్ తో కీలక నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలను పరిశీలించారు. ఈ సమావేశంలో ఎన్సీడీసీ మేనేజింగ్ డైరెక్టర్ చైర్మన్ పంకజ్ కుమార్ బన్సాల్ ఇఫ్కో చైర్మన్ దిలీప్ సంఘాని పాల్గొన్నారు.

# బస్సు ప్రమాద బాధితులను పరామర్శ

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :**



కరీంనగర్, మెదక్, ఆదిలాబాద్, నిజామాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికలు ముగిసిన తరువాత బైంసా నుంచి బ్యాలెట్ బాక్స్‌లు, సిబ్బందితో కరీంనగర్ వస్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదంలో గాయపడి కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారిని పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ పులి ప్రసన్న హరికృష్ణ శుక్రవారం పరామర్శించారు. ప్రమాదానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. వారికి ఉన్నతమైన చికిత్సను అందించాలని ఆసుపత్రి వైద్యులను కోరారు. ప్రమాధ బాధితులకు అండగా ఉంటానని ఆయన వారికి మనోధైర్యాన్ని కల్పించారు.

# హామీలు నెరవేర్చడంలో ప్రభుత్వం విఫలం



**బిజెపి పట్టభద్రుల అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి**

**ఝరాసంగం, ఫిబ్రవరి 28 (జనం సాక్షి):**

కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని బిజెపి పట్టాభద్రుల అభ్యర్థి చిన్నమైల్ అంజిరెడ్డి అన్నారు. శుక్రవారం మండల కేంద్రమైన ఝరాసంగంలో శ్రీ కేతకీ సంగమేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి, ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ నాయకులు బిజెపి కార్యకర్తలకు ఎంతో ఒత్తిడికి గురిచేశారని, దాని అధిగమించి పార్టీ కోసం పని చేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలిపారు. ఈ ఎన్నికల్లో భారీ మెజారిటీతో గెలుస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. నిరుద్యోగ భృతి కింద రూ 4 వేలు నెలకు అందజేస్తామని చెప్పి ఇంత వరకు ఇవ్వకపోవడం దారుణమన్నారు. కేంద్ర ప్రభుత్వం పీఎం కిసాన్ పథకం కింద రైతులకు వ్యవసాయ సాగు కోసం సంవత్సరానికి రూ, 6 వేలు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లా బిజెపి అధ్యక్షురాలు గోదావరి, జిల్లా బిజెపి నాయకులు మల్లికార్జున్, బిజెపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటాం

**మూడు సంవత్సరాలు జైలు శిక్ష, పదివేల రూపాయల జరిమానా**

**నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 28(జనంసాక్షి):**



నాగర్ కర్నూల్ జిల్లా వైద్య మరియు స్వరాజ్యలక్ష్మి శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రైవేట్ అల్ట్రాసౌండ్ స్కానింగ్ సెంటర్స్ ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ఆరోగ్య మరియు కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని ప్రైవేటు స్కానింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తున్నామన్నారు. శుక్రవారం విహన స్కానింగ్ సెంటర్, శ్రీ సత్య సాయి నర్సింగ్ హోమ్ లోని స్కానింగ్ కేంద్రాలను పరిశీలించారు. డిసెంబర్ జనవరి, ఫిబ్రవరి నెలలో నిర్వహించిన గర్భవతుల స్కానింగ్ వివరాలను, ఫారం– ఎఫ్ లను మరియు రికార్డులను , స్కానింగ్ మిషన్ వివరాలను తనిఖీ చేశారు. లింగ నిర్ధారణ చట్టం గురించి తెలిపే బోర్డులను పరిశీలించి, స్కానింగ్ కోసం వచ్చిన గర్భవతులకు లింగ నిర్ధారణ నిరోధ చట్టం గురించి అవగాహన కలిగించారు. లింగ నిర్ధారణ పరీక్షలు చేసే వారికి, చేయించుకున్న వారికి మరియు ప్రోత్సహించిన వారు గర్భ నిర్ధారణ నిరోధక చట్టం ప్రకారం శిక్షార్హులు. లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే మూడు సంవత్సరాలు జైలు శిక్ష, పదివేల రూపాయల జరిమానా వేస్తామని, ఈ చట్టం అమలుకు వైద్యులు మరియు ప్రజలు ప్రతి ఒక్కరు సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిపిఓ రేణయ్య, ప్రైవేట్ ఆస్పత్రుల డాక్టర్లు పాల్గొన్నారు.

# నిశిత పరిశీలన, నిత్య పరిశోధలతోనే శాస్త్రవేత్తలు



**మల్దకల్ ఫిబ్రవరి 28 (జనంసాక్షి)**

మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ సైన్స్ దినోత్సవం ఘనంగా జరుపుకున్నారు. పాఠశాల విద్యార్థిని విద్యార్థులు సైన్స్ సంబంధించిన వివిధ రకాల ప్రదర్శనలను ప్రదర్శించారు. వివిధ పటాలను రంగోళి రూపంలో, మూఢనమ్మకాలను నిర్మూలించే నాటికలను, సైన్స్ యొక్క విభిన్న విషయాలను పాటల రూపంలో, నృత్య ప్రదర్శనలను, ఉపన్యాసాలను ఇచ్చారు. అనంతరంక్విజ్ కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులను ఉద్దేశించి పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ శాస్త్రవేత్తల కృషిని కొనియాడారు. నిశిత పరిశీలనలే, నిరంతర పరిశోధనలే విద్యార్థులను శాస్త్రవేత్తలను చేస్తుందని, విద్యార్థులు ఇప్పటినుంచి వివిధ పరిశోధనల గురించి , వివిధ శాస్త్రవేత్తల జీవిత చరిత్రలను చదివి అర్థం చేసుకొని భవిష్యత్తులో గొప్ప పరిశోధనలు చేయుటకు ఇప్పటినుంచే కృషి చేయాలి అన్నారు. వివిధ విభాగాల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు సురేష్, సైన్స్ ఉపాధ్యాయులు సుజాత, వరలక్ష్మి, మనెమ్మ, లోకేశ్వరి, ప్రశాంతి, నాగేశ్వర రావు, ప్రదీప్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# న్యాల్ కల్‌లో ఉచిత చికెన్, ఎగ్ మేళా

**బారులు తీరి ఎగబడ్డ చికెన్ ప్రియులు**



**న్యాల్ కల్, ఫిబ్రవరి 28, (జనం సాక్షి)**

ఓ ప్రవేట్ కంపెనీ ఏర్పాటు చేసిన ఉచిత చికెన్, ఎగ్ మేళాకు జనం బారులు తీరి ఎగ బడ్డారు. శుక్రవారం రాత్రి న్యాల్ కల్ లోని బైపాస్ రోడ్డు, మాణిక్ నగర్ కాలనీ కూడలి వద్ద ఉచిత చికెన్, ఎగ్ మేళాను ఏర్పాటు చేశారు. గ్రామంలోని వివిధ కాలనీ వాసులతో పాటు సమీప గ్రామంలోని జనాలు తరలి రావడంతో "ఉచిత చికెన్ ఎగ్ మేళ" ప్రదేశం చికెన్ ప్రియులతో కోలాహలంగా మారింది. తోపులాటతో కిక్కిరిసింది. ఈ మేరకు కంపెనీ, స్థానిక వ్యాపారులు రెండు క్వింటాల చికెన్, 2000 గుడ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడు కే. భాస్కర్ రెడ్డి, సహకార
సంఘం చైర్మన్ సిద్ధి లింగయ్య స్వామి, సంగయ్య సేట్, మల్లేష్, ఇసాం పాటిల్, కంపెనీ ప్రతినిధులు రాములు, అంజి, సంతోష్, నిర్వాహకులు మొహమ్మద్ మోదసిర్, తదితరులు పాల్గొన్నారు.

# పట్టభద్రుల, ఉపాధ్యాయుల ఎమ్మెల్సీలుగా బిజెపి అభ్యర్థుల గెలుపు ఖాయం

**జిల్లా బిజెపి అధ్యక్షుడు వాల్దాస్ మల్లేష్ గౌడ్**

**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 28 (జనం సాక్షి )**



మెదక్– కరీంనగర్– నిజామాబాద్ – ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీలుగా బిజెపి అభ్యర్థులు గెలవడం ఖాయమని జిల్లా బిజెపి అధ్యక్షులు వాల్దాస్ మల్లేష్ గౌడ్ అన్నారు. జిల్లాలో గురువారం జరిగిన పట్టభద్రుల ఎమ్మెల్సీ, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో భాగంగా పట్టభద్రుల ఎమ్మెల్సీ ఓటింగ్ శాతం 74%, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ 94% నమోదయిందని, ఢిల్లీలో నరేంద్ర మోడీ సంక్షేమ, అభివృద్ధి మెదక్ పార్లమెంట్ లో మన రఘునందన్ రావు పోరాడి నైజానికి ఆకర్షితులై టీచర్స్ ఎమ్మెల్సీ అభ్యర్థి మల్కా కొమురయ్య కి, పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి అంజి రెడ్డి కి మద్దతుగా మొదటి ప్రాధాన్యత ఓటు వేసినటువంటి ఓటరు మహాశయులకు ప్రత్యేక ధన్యవాదములు. టీచర్స్ మరియు పట్టభద్రుల ఏ సమస్యలైనా భారతీయ జనతా పార్టీతోనే సాధ్యం మీయొక్క విశ్వాసాన్ని ఈ సమస్య అయినా పరిష్కరించడమే ధ్యేయంగా అనుక్షణం పనిచేసే మన మెదక్ పార్లమెంట్ సభ్యులు రఘునందన్ రావుకు చేదోడుగా మరో ఇద్దరినీ బలాన్ని అందిస్తే ఏ సమస్య అయినా పరిష్కారమే ధ్యేయంగా పనిచేయడం జరుగుతుం దన్నారు. అదేవిధంగా ఎన్నో రోజులుగా ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అనుక్షణం పనిచేసినటువంటి భారతీ య జనతా పార్టీ నాయకులకు కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదములు.

# మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డికి పలువురి పరామర్శ



**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :**

గుండె శస్త్ర చికిత్స అనంతరం కోలుకుంటున్న నర్సాపూర్ మాజీ శాసనసభ్యులు చిలుముల మదన్ రెడ్డిని హైదరాబాదులోని ఆయన నివాసంలో శుక్రవారం పలువురు ఎమ్మెల్యేలు మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నాయకులు కలిసి పరామర్శించారు. నర్సాపూర్ మాజీ శాసనసభ్యులు చిలుముల మదన్ రెడ్డికి ఇటీవల గుండె ఆపరేషన్ జరిగిన విషయం తెలుసుకొని, రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ, పిసిసి ప్రధాన కార్యదర్శి, నర్సాపూర్ నియోజకవర్గ ఇన్చార్జి ఆవుల రాజిరెడ్డి స్వయంగా హైదరాబాదులోని ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో ఉన్న వారి నివాసానికి వెళ్లి పరామర్శించారు. మంత్రితో పాటు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన శాసనసభ్యులు డాక్టర్ మైనంపల్లి రోహిత్ రావు, డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి, మాజీ శాసనసభ్యులు మైనంపల్లి హనుమంతరావు మెదక్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు అంజనేయులు గౌడ్ మరియు ఇతర నాయకులు పాల్గొన్నారు.
ఆవుల రాజిరెడ్డి మాజీ ఎమ్మెల్యే మదన్ రెడ్డిని పరామర్శించి, ఆయన ఆరోగ్య పరిస్థితిని గురించి తెలుసుకున్నారు. త్వరితగతిన కోలుకుని ప్రజాసేవలో మరింత క్రియాశీలంగా పాల్గొనాలని ఆకాంక్షించారు. అలాగే గుండె శస్త్ర చికిత్స అనంతరం కోలుకుంటున్న నర్సాపూర్ మాజీ శాసనసభ్యులు చిలుముల మదన్ రెడ్డి గని హైదరాబాదులోని వారి నివాసంలో కలిసి పరామర్శించిన మాజీమంత్రి హరీష్ రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునితాలక్ష్మారెడ్డి ఈ సందర్భంగా మదన్ రెడ్డి ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకున్నారు. వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు.

# మహిళలకు ఆహార పదార్థాల తయారీలో శిక్షణ



**హయత్ నగర్, ఫిబ్రవరి 28 (జనంసాక్షి)**

మన్సూరాబాద్ డివిజన్ లోని వీరన్న గుట్ట తొలి అధ్యక్షుడు, టిఆర్ఎస్ సినియర్ నాయకులు కేకేఎల్ గౌడ్ సహకారంతో సీడ్ ఆర్గనైజేషన్ సంస్థ సెల్ఫ్ డెవలప్మెంట్ పథకం క్రింద మహిళలకు ఛిరు ధాన్యాలతో పలు రకాల స్వీట్స్, వివిధ ఆహార వంటకాలు తయారు చేసే విధానం లో గత 15 రోజులుగా ట్రైనింగ్ ఇచ్చారు. ఈ కార్యక్రమం విజయవంతం గా పూర్తి చేసుకున్న మహిళలకు సర్టిఫికెట్లు ప్రధానం చేశారు. ఈ సందర్భంగా కేకేఎల్ గౌడ్ మాట్లాడుతూ మహిళలు తమ కాళ్ల పైన తాము నిలబడడానికి
ఈ శిక్షణ ఎంతో ఉపయోగపడ్డదని అన్నారు. కార్యక్రమంలో కాలనీ అధ్యక్షులు నరసిం హ, ప్రధాన కార్యదర్శి కోటయ్య, కోశాధికారి రవి, నాగేంద్ర చారి, బాలరాజు గౌడ్, సీహెచ్ శేఖర్, కడారి వెంకటేష్, కావాలి శ్రీను, పులుసు రవి సీడ్ ప్రతినిధులు ఎస్ బ్రహ్మచారి, రాజ్య లక్ష్మి, భవాని, రవి, కాలనీ వాసులు, తదితరులు పాల్గొన్నారు.

# మాజీ మంత్రి హరీశ్‌రావుపై మరో కేసు

**హైదరాబాద్ (జనం సాక్షి)**



మాజీ మంత్రి హరీష్ రావుపై మరో కేసు నమోదైంది. కాంగ్రెస్ నేత చక్రధర్‌గౌడ్ ఫిర్యాదు మేరకు హైదరాబాద్‌లోని బాచుపల్లి పోలీసులు బిఆర్ఎస్ నేత హరీష్ రావుపై కేసు నమోదు చేశారు. మాజీ మంత్రి హరీష్ రావు సహా మరో ముగ్గురి నుంచి ప్రాణహాని ఉందని బాచుపల్లి పోలీసులను చక్రధర్ గౌడ్ ఆశ్రయించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు సంతోష్ కుమార్, హరీష్ రావు, రాములు, వంశీలపై కేసు నమోదైంది. బీఎన్ఎస్ యాక్ట్ ప్రకారం హరీష్ రావు పై 351 (2) ఆర్/డబ్ల్యూ3, (5) సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఈ కేసులో ఎ–1 వంశీ కృష్ణ, ఎ3 సంతోష్ కుమార్, ఎ4గా పరుశురాములు పేర్లను చేర్చిన పోలీసులు ఎ2గా హరీష్ రావు పేరు చేర్చారు. గతంలో హరీష్ రావుపై చక్రధర్‌గౌడ్ ఫోన్ టాపింగ్ ఆరోపణలు చేశారు. తన ఫోన్ ట్యాప్ చేసి తన భార్యతో, బంధువులతో జరిపిన ఫోన్ సంభాషణలను విన్నారని, కోర్టు చర్యలు తీసుకోవాలని పోలీసులతో పాటు న్యాయస్థానాన్ని సైతం చక్రధర్ గౌడ్ ఆశ్రయించడం తెలిపిందే. తాజాగా హరీష్ రావు సహా కొందరి నుంచి ప్రాణహాని ఉందని ఫిర్యాదు చేయడం కలకలం రేపుతోంది.

# పోసానికి 14 రోజుల రిమాండ్

**హైదరాబాద్ (జనం సాక్షి)**



టాలీవుడ్ నటుడు, వైసిపి సానుభూతిపరుడు పోసాని కృష్ణమురళిని పోలీసులు రాజంపేట సబ్ జైలుకు తరలించారు. కులాలు, రాజకీయ పార్టీల మధ్య విద్వేషాలు, వైషమ్యాలు రెచ్చగొట్టేలా గతంలో కామెంట్లు చేసిన కేసులో అరెస్ట్ అయిన పోసానికి అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు కోర్టు రెండు వారాల రిమాండ్ విధించింది. గురువారం రాత్రి నుంచి శుక్రవారం ఉదయం వరకు ఇరువైపుల వాదనలు కొనసాగాయి. బిఎన్ఎస్ బీఎన్ఎస్ చట్టం ప్రకారం పోసానికి 41ఏ నోటీసులు ఇచ్చి బెయిల్ ఇవ్వాలని ఆయన తరఫున పొన్నవోలు సుధాకర్ రెడ్డి వాదనలు వినిపించారు. అందుకు మేజిస్ట్రేట్ నిరాకరించి, 14 రోజుల రిమాండ్ విధించారు. మార్చి 12 వరకు రిమాండ్ లో ఉండను న్నారు. మేజిస్ట్రేట్ రిమాండ్ విధించిన అనంతరం పోలీసులు పోసానిని రాజంపేట సబ్ జైలుకు తరలించారు. పోసానిని తమ కస్టడీకి ఇవ్వాలని కోరుతూ పోలీసులు పిటిషన్ దాఖలు చేసే అవకాశం ఉంది.

# లాజిస్టిక్స్, సప్లై చైన్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

**హైదరాబాద్ (జనంసాక్షి)**




టెక్ మహీంద్రా ఫౌండేషన్ తన కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కార్యక్రమంలో భాగంగా టెక్ మహీంద్రా స్మార్ట్ అకాడమీ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతకు సప్లై చైన్ మేనేజ్‌మెంట్, వేర్ హౌస్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో ఉచిత శిక్షణనిస్తూ ఉపాధి అవకాశాలు కల్పిస్తోందని సంస్థ ప్రాజెక్ట్ మేనేజర్ దీప్తి తెలిపారు. ఈ కోర్సుల్లో ప్రవేశానికి ఇంటర్మీడియట్, డిప్లొమా, ఐటిఐ, డిగ్రీలు విద్యార్హతలుగా ఉంటాయని, అభ్యర్థుల వయసు 18 నుండి 35 లోపు ఉండాలని, ఈ కోర్సులకు సంబంధించిన క్లాసులు మార్చి మొదటి వారంలో ప్రారంభమవుతాయని తెలిపారు. కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు విస్తృతంగా ఉంటాయని ముఖ్యంగా మహిళలకు అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, మరిన్ని వివరాలకు ఎర్రగడ్డ రైతు బజార్ ఎదురుగా ఉన్న (మెట్రో పిల్లర్ నంబర్ ఏ980 ) సనత్ నగర్ సెయింట్ తెరిసా చర్చి కాంపౌండ్ ఆవరణలో ఉన్న టెక్ మహీంద్ర స్మార్ట్ అకాడమీ ఫర్ లాజిస్టిక్స్ కార్యాలయంలో లేదా 7337332606 లో సంప్రదించాలని ప్రాజెక్ట్ మేనేజర్ దీప్తి తెలిపారు.

# వాణిజ్య మైనింగ్‌పై ప్రోత్సాహం

- బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ముంబైలో హై-ఇంపాక్ట్ రోడ్ షో
- ఇప్పుడు భూగర్భ గనులను కూడా వేలం

(ఎండి.మునీర్/ప్రత్యేక ప్రతినిధి/జనంసాక్షి)
బొగ్గు రంగంలో పెట్టుబడి అవకాశాలను, వాణిజ్య బొగ్గు మైనింగ్ వేలాలను ప్రోత్సహించడానికి నిరంతర ప్రయత్నాలలో భాగంగా బొగ్గు మంత్రిత్వ శాఖ శుక్రవారం ముంబైలో హై-ఇంపాక్ట్ రోడ్ షోను విజయవంతంగా నిర్వహించింది. కేంద్ర బొగ్గు, గనుల మంత్రి జి. కిషన్ రెడ్డి (జి. కిషన్ రెడ్డి) ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్, బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి మరియు నామినేటెడ్ అథారిటీ రూపిందర్ బ్రార్, బొగ్గు మంత్రిత్వ శాఖ సీనియర్ అధికారులు కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో భారతదేశంలో బొగ్గు తవ్వకాల భవిష్యత్తుపై లోతైన చర్చలు జరిపిన కీలక వాటాదారులు, పరిశ్రమ నాయకులు, పెట్టుబడిదారులు, విధాన నిపుణులు కూడా పాల్గొన్నారు. ఈ రోడ్ షో ప్రైవేట్ రంగ భాగస్వామ్యాన్ని వేగవంతం చేయడానికి, దేశీయ బొగ్గు ఉత్పత్తిని పెంచడానికి మరియు స్థిరమైన మైనింగ్ సంస్థలను ప్రోత్సహించడానికి ఒక వ్యూహాత్మక వేదికగా పనిచేస్తుంది. ఇది విధాన సంస్కరణలు, వ్యాపార సౌలభ్యత మరియు సాంకేతిక పురోగతులపై దృష్టి సారించింది, పర్యావరణ స్థిరత్వం మరియు దీర్ఘకాలిక ఇంధన భద్రతను నిర్ధారిస్తూ భారతదేశ బొగ్గు రంగం యొక్క పూర్తి సామర్థ్యాన్ని ఉపయోగించుకోవాలనే ప్రభుత్వ నిబద్ధతను పునరుద్ఘాటించింది. కేంద్ర బొగ్గు మరియు గనుల మంత్రి జి. కిషన్ రెడ్డి తన ముఖ్యోపన్యాసంలో, భారతదేశ ఆర్థిక పురోగతిలో, ముఖ్యంగా ఇంధన భద్రతను నిర్ధారించడంలో మరియు పారిశ్రామిక మరియు విద్యుత్ రంగాల పెరుగుతున్న డిమాండ్లను తీర్చడంలో బొగ్గు కీలక పాత్రను హైలైట్ చేశారు. దేశీయ బొగ్గు ఉత్పత్తిని వేగవంతం చేయడానికి, దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించడానికి మరియు స్థిరమైన మైనింగ్ సంస్థలను నిర్ధారించడానికి ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని ప్రభుత్వం యొక్క నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు. భారతదేశంలో బొగ్గు ఉత్పత్తిలో గణనీయమైన పెరుగుదల ఉందని మంత్రి హైలైట్ చేశారు, ఇది పరిశ్రమలు మరియు విద్యుత్ ప్లాంట్లు తమ ఇంధన అవసరాలను సమర్థవంతంగా తీర్చుకోవడానికి వీలు కల్పించింది. డిమాండ్-సరఫరా అంతరాన్ని తగ్గించడానికి మరియు క్యాప్టివ్ మరియు వాణిజ్య వినియోగదారులకు నిరంతరాయంగా బొగ్గు లభ్యతను నిర్ధారించడానికి ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలను ఆయన నొక్కిచెప్పారు. భారతదేశ ఇంధన రంగానికి బొగ్గు వెన్నెముక అని, విద్యుత్ ఉత్పత్తిలో 70 శాతానికి పైగా బొగ్గు దోహదపడుతుందని రెడ్డి ధృవీకరించారు. వాణిజ్య బొగ్గు తవ్వకాలలో ప్రైవేట్ పెట్టుబడులను ఆకర్షించడం, వ్యాపారాన్ని సులభతరం చేయడం మరియు పర్యావరణ ప్రభావాన్ని తగ్గించడంతో పాటు మైనింగ్ కార్యకలాపాలను ఆప్టిమైజ్ చేయడానికి ఆటోమేషన్ మరియు డిజిటల్ పర్యవేక్షణ వంటి అధునాతన సాంకేతిక పరిజ్ఞానాలను




అమలు చేయడానికి కీలక సంస్కరణలను కూడా ఆయన వివరించారు. అదనంగా, తిరిగి స్వాధీనం చేసుకున్న భూములలో ప్రభుత్వం పెద్ద ఎత్తున అటవీకరణ కార్యక్రమాలను మంత్రి హైలైట్ చేశారు, ఇది పర్యావరణ ఉద్యానవనాలు, గ్రీన్ బెల్టులు మరియు జీవవైవిధ్య ప్రాంతాల అభివృద్ధికి దారితీసింది. ఇంకా, గని మూసివేత ప్రణాళిక ప్రకారం, వ్యవసాయం, అటవీ మరియు గని పర్యాటకం వంటి స్థిరమైన ఉపయోగాల కోసం మైనింగ్ తర్వాత ప్రకృతి దృశ్యాలను పునరుద్ధరించడం జరుగుతుందని, ఇది స్థానిక సమాజాలకు ప్రయోజనం చేకూరుస్తుందని ఆయన హామీ ఇచ్చారు. భారతదేశం ప్రపంచంలోనే 3వ అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరించే దిశగా పయనిస్తూ, 2047 నాటికి అభివృద్ధి చెందిన భారతదేశం కోసం కృషి చేస్తుండగా, గని భద్రత, పునరావాసం మరియు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలకు ప్రాధాన్యత ఇస్తూ, సమాజ సంక్షేమానికి ప్రభుత్వం నిబద్ధతను మంత్రి పునరుద్ఘాటించారు. స్థిరత్వాన్ని నొక్కి చెబుతూ, బొగ్గుపై ఆధారపడిన వర్గాల సామాజిక-ఆర్థిక అభ్యున్నతి యొక్క ప్రాముఖ్యతను మంత్రి హైలైట్ చేశారు మరియు కార్మికుల భద్రత ఇప్పటికీ ప్రాధాన్యతగా ఉందని అన్నారు. పర్యావరణ పరిరక్షణ మరియు దీర్ఘకాలిక ప్రాంతీయ స్థిరత్వాన్ని నిర్ధారించడానికి బొగ్గు కంపెనీలు ఉత్తమ భద్రతా చర్యలు మరియు పర్యావరణ అనుకూల మైనింగ్ పద్ధతులను అవలంబించాలని ఆయన కోరారు. బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి విక్రమ్ దేవ్ దత్ తన ప్రసంగంలో, బొగ్గు రంగంలో సజావుగా పెట్టుబడులు పెట్టడానికి మంత్రిత్వ శాఖ మద్దతును పెట్టుబడిదారులకు హామీ ఇచ్చారు. అనుమతులు పొందడం నుండి ప్రాజెక్టు అమలు వరకు ప్రతి దశలోనూ పెట్టుబడిదారులకు సహాయం చేయడానికి మంత్రిత్వ శాఖ కట్టుబడి ఉందని ఆయన ఉద్ఘాటించారు. దీనికోసం, ప్రాజెక్టులను త్వరలో అమలులోకి తీసుకురావడానికి అనుమతులను వేగవంతం చేయడానికి నియంత్రణ సంస్థలు మరియు వాటాదారుల మంత్రిత్వ శాఖలతో సమన్వయం చేసుకుంటుంది. త్వరిత ఆమోద ప్రక్రియను మంత్రిత్వ శాఖ నిర్ధారిస్తోందని ఆయన నొక్కి చెప్పారు. ఇది బొగ్గు బ్లాకుల కేటాయింపులో అడ్డంకులను తగ్గిస్తుంది మరియు పారదర్శకతను మెరుగుపరుస్తుంది. మైనింగ్ కార్యకలాపాలు భారతదేశం స్థిరత్వ లక్ష్యాలకు అనుగుణంగా ఉండేలా చూసుకోవడానికి, తవ్వకాలు జరపని భూములలో అడవుల పెంపకం, బాధ్యతాయుతమైన గనుల మూసివేత పద్ధతుల ద్వారా జీవవైవిధ్య పరిరక్షణపై మంత్రిత్వ శాఖ దృష్టి సారించిందని కార్యదర్శి పునరుద్ఘాటించారు. త్వరలో ప్రారంభం కానున్న 12వ వేలంలో భూగర్భ గనులు కూడా ఉంటాయని, అదనపు ఆర్థిక ప్రోత్సాహకాలను అందిస్తాయని ఆయన ప్రకటించారు. రాబోయే బొగ్గు గనుల వేలంలో పరిశ్రమ నాయకులు, పెట్టుబడిదారులు చురుకుగా పాల్గొనాలని ప్రోత్సహిస్తూ, వ్యాపార విశ్వాసాన్ని పెంచడానికి నియంత్రణ మద్దతు, ఆర్థిక ప్రోత్సాహకాలు మరియు క్రమబద్ధీకరించబడిన ప్రక్రియలతో సహా పూర్తి ప్రభుత్వ మద్దతును వారికి హామీ ఇచ్చారు. భారతదేశ బొగ్గు రంగం పెట్టుబడులకు, ఆవిష్కరణలకు అపారమైన అవకాశాలను అందిస్తుందని, స్వావలంబన మరియు స్థితిస్థాపక ఇంధన భవిష్యత్తుకు మార్గం సుగమం చేస్తుందని ఆయన పునరుద్ఘాటించారు. బొగ్గు మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, నియమించబడిన అధికారిణి రూపిందర్ బ్రార్ తన స్వాగత ప్రసంగంలో బొగ్గు తవ్వకంలో ప్రైవేట్ రంగం భాగస్వామ్యం యొక్క వ్యూహాత్మక ప్రాముఖ్యతను నొక్కి చెప్పారు. పారదర్శకమైన, పోటీతత్వ మరియు పెట్టుబడిదారులకు అనుకూలమైన బొగ్గు రంగాన్ని నిర్మించాలనే మంత్రిత్వ శాఖ నిబద్ధతను ఆయన పునరుద్ఘాటించారు. పెట్టుబడిదారులకు అందుబాటులో ఉన్న కీలక ప్రోత్సాహకాలను కూడా ఆయన హైలైట్ చేశారు. దీర్ఘకాలిక వృద్ధి కోసం విధాన సంస్కరణలను సద్వినియోగం చేసుకోవాలని వాటాదారులను కోరారు. వాణిజ్య బొగ్గు తవ్వకం ప్రారంభమైనప్పటి నుండి బొగ్గుకు డిమాండ్ పెరిగిందని, ప్రభుత్వం క్యాప్టివ్ ప్రయోజనాలకు మించి దాని వినియోగాన్ని అనుమతించిందని, మైనింగ్ కంపెనీలు ఎక్కువ సౌలభ్యంతో పనిచేయడానికి, మార్కెట్లో బొగ్గును ఒక వస్తువుగా విక్రయించడానికి సహాయపడుతుందని ఆయన అన్నారు. ఈ రోడ్ షోలో పెట్టుబడి అవకాశాలు, నియంత్రణ సంస్కరణలు, స్థిరత్వ చర్యలు, బొగ్గు గ్యాసిఫికేషన్ అవకాశాలపై వివరణాత్మక చర్చలు జరిగాయి. ఇది విధాన రూపకర్తలు, పరిశ్రమ నాయకుల మధ్య ప్రత్యక్ష సంభాషణకు ఒక వేదికను అందించింది, రాబోయే వాణిజ్య బొగ్గు గనుల వేలం, సాంకేతిక పురోగతులు, స్థిరమైన బొగ్గు తవ్వకంలో ఉత్తమ పద్ధతులు, వ్యాపార సౌలభ్యానికి విధాన మద్దతు మరియు ప్రాజెక్టు ఆమోదాలను వేగవంతం చేయడంపై అంతర్దృష్టితో కూడిన చర్చలను సులభతరం చేసింది. ఈ రోడ్ షోలో ఆకర్షణీయమైన, ఇంటరాక్టివ్ ప్రశ్నోత్తరాల సెషన్ ఉంది, ఇక్కడ పెట్టుబడిదారులు బొగ్గు రంగంలో విధానాలు, వేలం ప్రక్రియలు, వృద్ధి అవకాశాలపై అంతర్దృష్టిని పొందడానికి అధికారులతో సంభాషించారు. సంభావ్య పెట్టుబడిదారుల ప్రశ్నలకు సమగ్రంగా సమాధానాలు లభించాయి. పరిశ్రమ పారదర్శకత, పెట్టుబడిదారులకు అనుకూలమైన విధానంపై విశ్వాసాన్ని బలోపేతం చేసింది. పెట్టుబడులను పెంచడం, దేశీయ ఉత్పత్తిని పెంచడం, భారతదేశంలో బొగ్గు తవ్వకాలకు స్థిరమైన భవిష్యత్తును నిర్ధారించడం అనే బొగ్గు మంత్రిత్వ శాఖ లక్ష్యంలో ముంబై రోడ్ షో మరో మైలురాయి. ఈ కార్యక్రమం ఆత్మనిర్భర్ భారత్ దార్శనికతకు అనుగుణంగా పెట్టుబడిదారుల విశ్వాసాన్ని బలోపేతం చేయడానికి, ఆవిష్కరణలను ప్రోత్సహించడానికి మరియు భారతదేశ ఇంధన భద్రతా లక్ష్యాలను ముందుకు తీసుకెళ్లడానికి ప్రభుత్వ నిబద్ధతను బలోపేతం చేసింది.

## సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గాన్ని అనుసరించాలి

- జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్



**ములుగు ప్రతినిధి, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేసినప్పుడే ఆ మహనీయుడికి నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో శ్రీశ్రీశ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ వారి 286 జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంత్ సేవాలాల్ జయంతి పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ 18వ శతాబ్దంలోనే అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజంలోనూ ఎన్నో అవరోధాలను అధిగమిస్తూ సేవాలాల్ మహారాజ్ సంఘ సంస్కర్తగా పని చేశారని అన్నారు. ఆయన పరమపదించి దాదాపు రెండు వందల సంవత్సరాలు దాటినా కూడా సేవాలాల్ మహారాజ్ ను దైవంగా భావిస్తున్నారంటే ఆయన చేసిన బోధనలు, అనుసరించిన మార్గం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అహింసా మార్గాన్ని అవలంభించాలని, అనర్థాలకు కారణమయ్యే మద్యపానానికి దూరంగా ఉండాలని, మహిళలను గౌరవించాలని సేవాలాల్ చేసిన బోధనలు ప్రతి ఒక్కరికి అనుసరణీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందని అన్నారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ బంజారా జాతి అభివృద్ధికి, వారి అభ్యున్నతికి 22 సూత్రాలను అందించారని అన్నారు. భాష వేషము కట్టుబొట్టు మన యొక్క సాంప్రదాయాలు మన యొక్క పద్ధతులు కూడా కాపాడుకుంటేనే మనం పలానా ట్రైబల్ ఒక లంబాడి గా గుర్తిపు ఉంటుందని అన్నారు. ఏదైనా మారాలంటే మనమే మారాలని, దానికోసం వారు చూపిన బాటలో నడవాలని అన్నారు. సామాజికంగా గిరిజనులు ఇంకా ఎదగాలని అన్నారు. సేవాలాల్ మహారాజ్ చెప్పిన విధంగా సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని అన్నారు. మాజీ గ్రంథాలయ చేర్మెన్ పోరిక గోవిందనాయక్ మాట్లాడుతూ, బంజారా జాతి సేవాలాల్ చూపిన విధంగా ఏకతాటిపై ఉండాలని, మద్య మాంసాలకు దూరంగా వుండాలని, ఆయన ఆశయాలను సాధించి బంజారా సంస్కృతిని కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమములో బంజారా ముఖ్య స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

## షార్ట్‌సర్క్యూట్‌తో మణికొండలో అగ్ని ప్రమాదం

- ఊపిరాడక ముగ్గురు సజీవ సమాధి
- మిగతా 5గురిని ఉస్మానియా ఆసుపత్రికి తరలించిన నార్సింగ్ పోలీసులు



**రాజేంద్రనగర్, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** నార్సింగ్ మున్సిపాలిటీ పరిధిలో పుప్పాల గూడ పాషా కాలనీలో శుక్రవారం సాయంత్రం భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. నార్సింగ్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ప్రమాదంలో ముగ్గురు అక్కడికక్కడే సజీవ సమాధి అయ్యారు. నార్సింగ్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ రెడ్డి సంఘటన స్థలం నుంచి తెలిపిన వివరాల ప్రకారం పుప్పాలగూడలో ని పాషా కాలనీలోని ఓ అపార్ట్మెంట్ గ్రాండ్ ఫ్లోర్ లోని కిరాణా షాపు షార్ట్ సర్క్యూట్ కారణంగా చలరేగిన మంటలు పక్కనే ఉన్న కారుకు వ్యాపించాయి. దీంతో కారులోని సిలిండర్ పేలి మొదటి అంతస్తు వరకు మంటలు ఉధృతంగా వ్యాపించాయి. ఈ క్రమంలో మొదటి అంతస్థులోని రెండు గ్యాస్ సిలిండర్లు వరకు మంటలు వ్యాపించి దట్టమైన పొగలు వ్యాపించడంతో ఇంట్లో ఉన్న సిజిరా ఖాటూన్ అమ్మాయి (7), జమీలా ఖాటూన్ (70), సహానా ఖాటూన్ (40) సహా ముగ్గురు వ్యక్తులు ఊపిరాడక మరణించారు. అదే అంతస్థులో మిగతా 5 మంది భయభ్రాంతులకు గురై రెండవ అంతస్తు పైభాగం వరకు చేరుకొని కేకలు వేసి పరుగులు తీశారు. ఇది గమనించిన స్థానికులు అగ్నిమాప కేంద్రానికి, మణికొండ మున్సిపాలిటీకి సమాచారం అందించడంతో వెంటనే అక్కడికి చేరుకున్న అగ్నిమాపక ఫైర్ ఇంజన్లు, మున్సిపాలిటీ డిజాస్టర్ వెహికల్, మంచినీటి ట్యాంకర్లతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నం చేశారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు ముగ్గురు మృతదేహాలని పోస్టార్టం నిమిత్తము ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. దట్టమైన పొగలు వ్యాపించి ఊపిరాడక ముగ్గురు మృతి చెందారని నార్సింగ్ ఇన్స్పెక్టర్ హరికృష్ణ రెడ్డి తెలిపారు. మరో ఐదుగురిని స్థానికుల సహాయంతో రక్షించారు. వారిలో ఇద్దరికి బోన్ ఫ్యాక్చర్ అయి ఉస్మానియా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. మంటలను పూర్తిగా ఆర్పి వేసి, దర్యాప్తు చేస్తున్నారు.

## రంగారెడ్డి జిల్లా అదనపు సెషన్స్ జడ్జి కోర్టు ప్రారంభం



**చేవెళ్ల, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** చేవెళ్ల పట్టణ కేంద్రంలో కోర్టు భవనాల సముదాయంలో నూతనంగా రంగారెడ్డి జిల్లా అదన సెషన్స్ జడ్జి కోర్టు ప్రారంభించడం జరిగింది. శుక్రవారం సాయంత్రం తెలంగాణ రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సుజాయ్ పాల్, రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ పి వాకింగ్ కోసి, రంగారెడ్డి జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎం శశిధర్ రెడ్డి, సమక్షంలో వర్చువల్ గా జిల్లా అదనపు కోర్టును ప్రారంభించారు. చేవెళ్ల కొట్టు భవనంలో జిల్లా అదనపు జడ్జి ప్రదీప్ నాయక్ సమక్షంలో న్యాయవాదులు కోర్టు అధికారులు ఘనంగా కార్యక్రమాన్ని నిర్వహించారు జిల్లా అదనపు కోటు ప్రారంభం సందర్భంగా కోర్టు భవనంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కోర్టు జడ్జి దశరథరామయ్య, సీనియర్ న్యాయవాదులు రేసు మహేందర్ రెడ్డి, రామ్ రెడ్డి, చేవెళ్ల కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి, ప్రధాన కార్యదర్శి సత్యానందం, ప్రభుత్వ చేవెళ్ల తాసిల్దార్ బి.కృష్ణయ్య, ఎంపీడీవో హిమబిందు, న్యాయవాదులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## పదవ తరగతి పరీక్షలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

- సమాచార హక్కు చట్టం రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ నాయక్

**చారకొండ, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** పదవ తరగతి పరీక్షలో విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించి ఉన్నత స్థాయి ఎదగాలని సమాచార హక్కు చట్టం రక్షణ సమితి రాష్ట్ర అధ్యక్షుడు కొర్ర కిషన్ నాయక్ అన్నారు. శుక్రవారం మండలంలోని జూపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సమాచరం హక్కు చట్టం రక్షణ సమితి ఆధ్వర్యంలో పదవ తరగతి విద్యార్థులకు ప్యాడ్లు, పెన్నులు పంపిణీ చేశారు. ఈసందర్భంగా కిషన్ నాయక్ మాట్లాడుతూ ప్రతి విద్యార్థి క్రమశిక్షణ పాటిస్తూ పట్టుదలతో చదివినప్పుడే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని పేర్కొన్నారు. పదవ తరగతి విద్యార్థులు సెల్ ఫోన్లు, టీవీలకు దూరంగా ఉండి సమయం వృథా చేయకుండా చదువుపై దృష్టి సారించి 100 శాతం ఉత్తీర్ణత సాధించాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో స.హ చట్టం రక్షణ సమితి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మమమ్మద్ హజీమ్, రాష్ట్ర కార్యదర్శి పగిడిమర్రి యాదగిరి, కోశాధికారి ఆనంద్, ఉప్పునుంతల యూటీఎఫ్ మండల అధ్యక్షుడు మీసాల మల్లికార్జున్, ఎంఈవో ఝాన్సీరాణి, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## దుర్గమ్మను దర్శించుకున్న పద్మదేవేందర్ రెడ్డి



**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** మెదక్ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షురాలు మాజీ ఎమ్మెల్యే ఎం పద్మ దేవేందర్ రెడ్డి శుక్రవారం సాయంత్రం ఏడుపాయల జాతర పురస్కరించుకొని వనదుర్గామాతను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ వనదుర్గామాత ఆశీస్సులతో మెదక్ జిల్లా ప్రజలు సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. అనంతరం ఆలయా అర్చకులు ఘనంగా సన్మానించి తీర్థప్రసాదాలు అందజేశారు. అనంతరం జాతరలో ప్రతి ఏటా మాదిరిగా గాజులు కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏడుపాయల దేవస్థానం మాజీ చైర్మన్ లు బాల గౌడ్, విష్ణువర్ధన్ రెడ్డి, పాపన్నపేట పార్టీ అధ్యక్షులు విష్ణువర్ధన్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రెడ్డి, మాజీ ధర్మకర్తలు మనోహర్ దుర్గయ్య కిష్టయ్య, తాజా మాజీ సర్పంచ్ లు జగన్, గురుమూర్తి గౌడ్, లింగారెడ్డి, శ్రీనాథ్ రావు, బద్రి మల్లేశం, నవీన్ గౌడ్ నాయకులు వెంకటేశం, సాయిరెడ్డి, బాబా గౌడ్, సాయిరెడ్డి, కిష్టయ్య, కిష్టాగౌడ్, శంకర్ సెట్, శ్రీనివాస్, మల్లేష్, సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

## వరంగల్ రైల్వే స్టేషన్‌కు సొబగులు



**వరంగల్ ప్రతినిధి: ఫిబ్రవరి 28 (జనం సాక్షి) :** భారతీయ రైల్వేలో ప్రయాణీకులకు ప్రపంచ స్థాయి సౌకర్యాలను అందించాలనే దృక్పథంతో భారీ స్థాయిలో రైల్వే స్టేషన్ల పునరాభివృద్ధి పనులు చేపట్టడం ద్వారా గొప్ప పరివర్తన దిశగా పురోగమిస్తుంది. " అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్" (ఏ.బి.ఎస్.ఎస్.) కింద, తెలంగాణ వ్యాప్తంగా 40 రైల్వే స్టేషన్‌లను రూ. 2,737 కోట్ల అంచనా వ్యయంతో, ఆధునిక ప్రయాణీకుల సౌకర్యాలను అందించడానికి మరియు వాటిని ప్రాంతీయ జనాభాకు వృద్ధి కేంద్రాలుగా మార్చడానికి పునరాభి వృద్ధి చేయబడుతున్నాయి. అమృత్ భారత్ స్టేషన్ స్కీమ్(ఏ.బి.ఎస్.ఎస్) కింద గుర్తించబడి సుమారుగా రూ. 25.41 కోట్ల వ్యయంతో ఈ స్టేషన్‌ను పునరాభివృద్ధి చేయడం జరుగుతోంది. ఈ ఆర్థిక సంవత్సరంలో పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకోవడమైనది. ఈ పనులన్నింటినీ దక్షిణ మధ్య రైల్వే ఆధ్వర్యంలో ముందుకు పోతున్నట్లు పి ఆర్ ఓ ఏ శ్రీధర్ తెలిపారు.

# మళ్లోస్తాం దుర్గమ్మా..ఏడుపాయల దుర్గమ్మా..

**మెదక్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :** గత మూడు రోజులుగా కోరిన కోర్కెలు తీర్చే కొంగుబంగారంగా వన దుర్గామాతకు మొక్కులు చెల్లించుకున్న భక్తజనం అమ్మవారిని దర్శించుకుని పులకించిపోయారు. వన దుర్గ భవాని దేవాలయానికి పై భాగంలో మంజీరా నదిపై నిర్మించిన ఘనపూర్ ప్రాజెక్టు నిండుగా నీళ్లతో ప్రవహిస్తుండడంతో ఆహ్లాదకరమైన వాతావరణంలో అమ్మవారిని తనివితీరా చూసి తన్మయత్వం చెందారు. జిల్లాలోని పాపన్నపేట మండలం నాగుసాన్పల్లి గ్రామ శివారులోని మంజీరా నది పాయల్లో కొలువైన వన దుర్గమ్మను లక్షలాది మంది భక్తుల ఇలవేల్పైన వనదుర్గమ్మ కొలువైన ఏడుపాయల అడవుల్లో ఎన్నో రకాల అనుభూతులు పొందారు. మదిలో ధ్యానం. దుర్గమ్మ నామంతో ఏడుపాయల క్షేత్రం అధ్యాత్మిక వాతావరణం నెలకొంది. భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చి దుర్గా భవాని మాతను దర్శించుకున్నారు. పలు మొక్కులు చెల్లించుకున్నారు. దీవించమ్మ... వనదుర్గమ్మ తల్లి అని వేడుకున్నారు. మహాశివరాత్రి ఉత్సవాలలో భాగంగా మెదక్ జిల్లా ఏడుపాయల వనదుర్గా క్షేత్రంలో ఉత్సవాలు ఘనంగా జరిగాయి. మూడవ రోజు శుక్రవారం రథోత్సవం కన్నుల పండువగా సాగింది.



రథాన్ని పువ్వులతో సుందరంగా అలంకరించారు. హరిత ప్రాంగణం నుండి రాజగోపురం వరకు మాత నామస్మరణతో ఈ ప్రక్రియ అట్టహాసంగా జరిగింది. భక్తులు ఆర్టీసీ బస్సులో, ప్రైవేట్ వాహనాలలో తిరుగు ప్రయాణం అయ్యారు. ఆలయ ఈవో చంద్రశేఖర్, వివిధ శాఖ అధికారులు, నాగ్సాన్ పల్లి గ్రామ ప్రజలు, తదితరులు ఉన్నారు.

### పోలీస్ సిబ్బంది గట్టి బందోబస్తు

ఏడుపాయల ఉత్సవాల ముగింపు సందర్భంగా శుక్రవారం సాయంత్రం రథోత్సవం కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలో రథంగోలి వద్ద నిలిపిన రథంపైకి అమ్మవారి ఉత్సవ విగ్రహాన్ని ఊరేగింపుగా తీసుకువచ్చారు. రథం ఎదుట 18 రకాల పనిబాటలవారు పట్టు పరిచి, అన్నాన్ని హారతిగా పోసి దూపదీపాలు, పసుపు, కుంకుమ పెట్టి గుమ్మడికాయ, కొబ్బరికాయలు కొట్టి రథాన్ని ప్రారంభించారు. పోతరాజుల విన్యాసాలు, భక్తుల జయజయ ధ్వానాల మధ్య రథం గోలి నుంచి రాజగోపురం రథయాత్ర కొనసాగింది. రథోత్సవాన్ని తిలకించడానికి వేలాదిగా భక్తులు తరలివచ్చారు. ఆలయ ఈవో చంద్రశేఖర్ , పునరుద్ధరణ కమిటీ సభ్యులు డీఎస్పీ ప్రసన్న కుమార్, మెదక్ రూరల్ రాజశేఖర్ రెడ్డి, పాపన్నపేట ఎస్సై శ్రీనివాస్ గౌడ్ పాల్గొన్నారు.

### అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే

మెదక్ మాజీ ఎమ్మెల్యే పద్మా దేవేందర్ రెడ్డి వనదుర్గమ్మను శుక్రవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. ఆమె వెంట.. ఏడుపాయల మాజీ చైర్మన్ ఎస్.బాలాగౌడ్, భారాస పార్టీ మండల అధ్యక్షుడు విష్ణువర్ధన్ రెడ్డి, నాయకులు, జగన్, బాబాగౌడ్, గురుమూర్తి గౌడ్, బద్రీ మల్లేష్, కొత్తూరి శ్రీనివాస్ తదితరులు ఉన్నారు.

# బంగారం ధరల్లో భారీ మార్పు.. ఆ ఒక్క కారణంతోనే...

పసిడి ప్రియులకు అదిరిపోయే శుభవార్త అందింది. ఇటీవల వరుసగా పెరుగుకుంటూ పోయిన బంగారం ధరలు ఒక్కసారిగా తగ్గుతున్నాయి. వరుసగా పతనం అవుతున్నాయి. ఈ క్రమంలోనే ఆల్ టైమ్ గరిష్ట స్థాయిల నుంచి దిగొస్తున్నాయి. ఇప్పుడు ఒక్కసారిగా ఇంటర్నేషనల్ మార్కెట్లో, ఎంసీఎక్స్ మార్కెట్లో బంగారం ధరలు దిగొచ్చాయి.

కొద్ది రోజులుగా బంగారం ధరలు.. పసిడి ప్రియుల్ని వణికించాయన్న సంగతి తెలిసిందే. దేశీయంగా, అంతర్జాతీయంగా అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో వరుసగా పెరుగుకుంటూ పోయాయి. ఈ క్రమంలోనే ఆల్ టైమ్ గరిష్ట స్థాయిల్ని తాకాయి. దీంతో సామాన్యులకు కొనాలంటేనే కష్టమైంది. ముఖ్యంగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకుంటున్న కఠిన నిర్ణయాలు.. మరీ ముఖ్యంగా టారిఫ్స్ విధిస్తుండటంతో వాణిజ్య యుద్ధ భయాలు నెలకొన్నాయి. దీంతో ఇన్వెస్టర్లు సురక్షిత పెట్టుబడి సాధనంగా భావించే బంగారంపైకి పెట్టుబడులు మళ్లించారు. సాధారణంగానే సంక్షోభ సమయాల్లో బంగారం ఆదుకుంటుందన్న నానుడి ఉంది. దీంతో రేట్లు ఒక్కసారిగా పెరుగుకుంటూ పోయాయి.



అయితే ఇప్పుడు ఒక్కసారిగా పడిపోతున్నాయి. వరుసగా జీవన కాల గరిష్ట స్థాయిల నుంచి తగ్గుతున్నాయి. ఇటీవల ఆల్ టైమ్ హై నుంచి ప్రాఫిట్ బుకింగ్ నేపథ్యంలో పడిపోగా.. ఇప్పుడు మరోసారి మరో కారణంగా బంగారం ధరల్లో ఒక్కసారిగా ఊహించని మార్పు కనిపించింది. అంతర్జాతీయ మార్కెట్లో, అదే విధంగా దేశీయ మార్కెట్లలో ధరలు సడెన్‌గా దిగొచ్చాయి.

ఇంటర్నేషనల్ మార్కెట్లో చూస్తే.. ఇవాళ (ఫిబ్రవరి 27న) ఉదయం స్పాట్ గోల్డ్ రేటు ఔన్సుకు (31.10 గ్రాములు) 2920 డాలర్ల స్థాయిలో కదలాడగా.. ఇప్పుడు వార్త రాసే సమయంలో (సాయంత్రం 5.40 గంటలకు) ఇది 2880 డాలర్ల లెవెల్స్‌కు పడిపోయింది. అంటే దాదాపు 40 డాలర్లు పతనమైందని చెప్పొచ్చు. అమెరికా డాలర్ సహా బాండ్ ఈల్డ్స్ భారీగా పుంజుకోవడమే బంగారం ధరలు తగ్గేందుకు ప్రధాన కారణంగా నిలిచిందని నిపుణులు చెబుతున్నారు. డాలర్ ఇండెక్స్ తాజాగా 0.20 శాతంగా పెరగ్గా.. పదేళ్ల యూఎస్ ట్రెజరీ ఈల్డ్స్ కనిష్ట స్థాయిల నుంచి తిరిగి పుంజుకున్నాయి. దీంతో ఇన్వెస్టర్లకు ఇవి ఆకర్షణీయంగా మారగా.. బంగారం డిమాండ్ తగ్గిందని చెప్పొచ్చు. ఈ క్రమంలోనే రేట్లు దిగొచ్చాయి.

మరోవైపు మల్టీ కమొడిటీ ఎక్స్ఛేంజీలోనూ బంగారం ధరలు పతనం అయ్యాయి. కమొడిటీ ట్రేడింగ్ జరిగే ఎంసీఎక్స్‌లోనూ బంగారం ధర తగ్గినట్లు చూయిస్తోంది. ఇక్కడ ఇవాళ ఏప్రిల్ కాంట్రాక్టులకు సంబంధించి 10 గ్రాముల మేలిమి బంగారం ధర 0.85 శాతం (రూ. 740) తగ్గి రూ. 85,140 కి చేరినట్లు చూయిస్తోంది. ఇక భవిష్యత్తులోనూ ట్రంప్ ట్రేడ్ పాలసీలు, మాక్రోఎకనామిక్ డేటా, యూఎస్ డాలర్ కదలికలు, బాండ్ ఈల్డ్స్ వంటివి.. బంగారం ధరల్ని నిర్ణయించడంలో కీలకంగా వ్యవహరిస్తాయని నిపుణులు అంటున్నారు. అంతర్జాతీయంగా బలహీన సంకేతాలు కూడా గోల్డ్ రేట్లు తగ్గేందుకు కారణమవుతుందని చెబుతున్నారు. దేశీయంగా బంగారం ధరల విషయానికి వస్తే హైదరాబాద్ నగరంలో ప్రస్తుతం 22 క్యారెట్ల బంగారం ధర రూ. 400 తగ్గి తులం రూ. 80,100కు చేరింది. కిందటి రోజు కూడా రూ. 250 పడిపోయింది. మరోవైపు 24 క్యారెట్ల గోల్డ్ రేటు రూ. 440 తగ్గడంతో 10 గ్రాములకు రూ. 87,380 కి దిగొచ్చింది. ఇక ఇవాళ ఇంటర్నేషనల్ మార్కెట్లో గోల్డ్ రేట్లు తగ్గుముఖం పట్టగా.. ఇది రేపు (ఫిబ్రవరి 28) ఉదయం 10 గంటల తర్వాత దేశీయ మార్కెట్లలో కనిపిస్తుంది. అంటే దేశీయంగా మళ్లీ అప్పుడు ధరలు తగ్గినట్లు కనిపిస్తుంది.



# 3 బ్యాంకులకు షాకిచ్చిన ఆర్బీఐ..

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా దేశంలోని అన్ని బ్యాంకులు, ఇతర బ్యాంకింగేతర ఆర్థిక సంస్థలకు పెద్దన్నలా వ్యవహరిస్తుంటుంది. తమ నియమ నిబంధనలు పాటించని బ్యాంకులపై చర్యలు తీసుకుంటుంది. గత కొంత కాలంగా దూకుడుగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు 3 సహకార బ్యాంకులపైనా చర్యలు తీసుకుంది.

దేశంలోని అన్ని బ్యాంకులు, నాన్ బ్యాంకింగ్ ఫైనాన్షియల్ కంపెనీలకు నియంత్రణ సంస్థగా భారతీయ రిజర్వ్ బ్యాంకు ఉంటుందన్న సంగతి తెలిసిందే. ఇక ఇవన్నీ ఆర్బీఐ కనుసన్నల్లోనే పనిచేస్తుంటాయి. ఆర్బీఐ అనుమతులు, అంగీకారంతోనే కార్యకలాపాలు నిర్వహించాల్సి ఉంటుంది. ఇంకా.. బ్యాంకులు, కోసం ఆర్బీఐ ప్రత్యేక మార్గదర్శకాలు రూపొందిస్తుంటుంది. ఈ నియమ నిబంధనలకు లోబడి అవి పనిచేయాల్సి ఉంటుంది. ఇక వాటిని పట్టించుకోకుండా నిబంధనల్ని ఉల్లంఘించినట్లయితే ఆర్బీఐ చర్యలు కూడా తీసుకుంటుంది. ఇక్కడ చర్యలు పలు రకాలుగా ఉంటాయి. ఎక్కువగా జరిమానాలతో సరిపెట్టినా.. కొన్ని సార్లు సమస్య తీవ్రంగా ఉన్నట్లయితే అప్పుడు ఏకంగా బ్యాంక్ లైసెన్స్ రద్దు చేసే అవకాశమూ ఉంటుంది.

> పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ నుంచి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, బజాజ్ సహా చాలా ప్రముఖ సంస్థలపైనా చర్యలు తీసుకుంది ఆర్బీఐ. నిబంధనల్ని ఉల్లంఘిస్తే ఎవర్నీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేసింది. అయితే ఇప్పుడు 3 సహకార బ్యాంకులకు ఆర్బీఐ ఝలక్ ఇచ్చింది.

రిజర్వ్ బ్యాంక్ గవర్నర్‌గా శక్తికాంత దాస్ ఉన్న సమయంలో.. చాలా దూకుడుగా వ్యవహరించిన సంగతి తెలిసిందే. పేటీఎం పేమెంట్స్ బ్యాంక్ నుంచి హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకు, బజాజ్ సహా చాలా ప్రముఖ సంస్థలపైనా చర్యలు తీసుకుంది ఆర్బీఐ. నిబంధనల్ని ఉల్లంఘిస్తే ఎవర్నీ ఉపేక్షించేది లేదని స్పష్టం చేసింది. అయితే ఇప్పుడు 3 సహకార బ్యాంకులకు ఆర్బీఐ ఝలక్ ఇచ్చింది. నిబంధనల ఉల్లంఘనల నేపథ్యంలో మూడింటికీ జరిమానా విధించింది. ఇందులో తెలుగు రాష్ట్రాల నుంచి కూడా ఒక బ్యాంకు ఉంది.

అది గుంటూర్ డిస్ట్రిక్ కో- ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ లిమిటెడ్, ఆంధ్రప్రదేశ్. ఇక్కడ బ్యాంకింగ్ నియంత్రణ చట్టం - 1949 సెక్షన్ 36, సెక్షన్ 56 కింద నిబంధనల్ని ఉల్లంఘించినందుకు రూ. 50 వేల జరిమానా విధించినట్లు తెలిపింది. ఈ మేరకు ఆర్బీఐ సర్క్యులర్ విడుదల చేసింది. ఇక్కడ ఆర్బీఐ మార్గదర్శకాల్ని పట్టించుకోకుండా బ్యాంక్ నిర్లక్ష్యంగా వ్యవహరించి నట్లు తేలింది. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి బ్యాంకు తన అకౌంట్లు, బ్యాలెన్స్ షీట్ వివరాల్ని ప్రచురించలేకపోయింది. ఇదే సమయంలో కాపీలను ఆర్బీఐ, నాబార్డ్‌లకు అందించడం లోనూ విఫలమైంది. ఈ నేపథ్యంలో.. ఆ బ్యాంకుకు జరిమానా ఎందుకు విధించకూడదో ప్రశ్నించి.. బ్యాంక్ రిప్లై అనంతరం జరిమానాతో సరిపెట్టింది. ఈ బ్యాంకుకు ఇప్పుడు జరిమానాతో సరిపెట్టింది గానీ.. ఇలాంటివే పునరావృతం అయితే కఠిన ఆంక్షలు తీసుకునే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. ఇంకొన్ని సార్లు బ్యాంక్ లైసెన్సులు రద్దు చేసిన సందర్భాలు కూడా ఉన్నాయి. అయితే ఆర్బీఐ ఎక్కువగా.. సహకార బ్యాంకులు, స్మాల్ ఫైనాన్స్ బ్యాంకులపైనే చర్యలు తీసుకుంటుంటుంది. వీటిల్లో మూలధన నిల్వలు తక్కువగా ఉండటమే కారణం. గుంటూర్ డిస్ట్రిక్ట్ బ్యాంకుతో పాటు.. ఆర్బీఐ మహిళా సహకారి బ్యాంకు (వడోదరా, గుజరాత్), గుల్బర్గా అండ్ యాద్‌గిర్ డిస్ట్రిక్ట్ కోఆపరేటివ్ సెంట్రల్ బ్యాంకులపైనా (కర్ణాటక) చర్యలు తీసుకుంది. వీటికి వరుసగా రూ. 25 వేలు, రూ. 50 వేల చొప్పున జరిమానా విధించింది.

# కియా సొనెట్ నుంచి స్కోడా కైలాక్ వరకు..



మీరు కారు కొనుగోలు చేయాలని చూస్తున్నారా.. అదిరిపోయే ఫీచర్లతో సూపర్ రిచ్ లుక్‌లో కనిపించేలా ఉండే కాంపాక్ట్ స్పోర్ట్స్ యుటిలిటీ వెహికిల్ కొనాలనుకుంటే ఇది మీ కోసమే. కియా, స్కోడా, టాటా సహా పలు మోడళ్ల కార్లు రూ. 8 లక్షల్లోపు ధరల్లోనే ప్రారంభం అవుతున్నాయి. ఈ బడ్జెట్ ధరల్లో ఏమేం కార్లు ఉన్నాయి.. ఇటీవలి కాలంలో సొంతంగా ఒక కారు కొనుగోలు చేయాలనుకునే వారి సంఖ్య పెరిగింది. ముఖ్యంగా సిటీల్లో ఇంటికి ఒక కారు ఉంటే మంచిదనే అభిప్రాయం చాలా మందిలో ఉంది. ఇక వీరిని దృష్టిలో పెట్టుకొని ప్రముఖ కార్ల తయారీ కంపెనీలు కూడా చవక ధరల్లోనే అద్భుత ఫీచర్లతో పోటాపోటీగా కొత్త కొత్త కార్లను మార్కెట్లోకి విడుదల చేస్తున్నాయని చెప్పొచ్చు. ఇక్కడ చాలా ఎంపికలు ఉన్నాయి. సూపర్ రిచ్‌గా కనిపిస్తుంది. ఇవి కూడా అందుబాటు ధరల్లోనే ఉన్నాయి. స్టైలిష్‌గా కనిపిస్తుంటాయి. ఇక ఇప్పుడు మనం రూ. 8 లక్షల్లోపు ధరలో (ఎక్స్- షోరూం) పెర్ఫామెన్స్, సేఫ్టీ, టెక్నాలజీ పరంగా టాప్-5 కార్ల గురించి చూద్దాం.

కియా సొనెట్- దీని ప్రారంభ ధర రూ. 8 లక్షలు (ఎక్స్- షోరూం). ఈ కాంపాక్ట్ ఎస్‌యూవీ మల్టిపుల్ కలర్ ఆప్షన్లతో అందుబాటులో ఉంది. 1.2 లీటర్ పెట్రోల్, 1 లీటర్ టర్బో పెట్రోల్, 1.5 లీటర్ డీజిల్ ఆప్షన్లు ఉన్నాయి. ఇందులో అత్యంత భద్రతా పరమైన ఫీచర్ 6 ఎయిర్‌బ్యాగ్స్ ఉన్నాయి. ఇంకా ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్ హిల్ హోల్డ్ అసిస్ట్ వంటివి ఉన్నాయి. క్యాబిన్ విషయానికి వస్తే ఇక్కడ 10.25 అంగుళాలతో రెండు డిస్‌ప్లేలు ఉన్నాయి. యాంబియెంట్ ఎల్ఈడీ లైటింగ్, ప్రీమియం బోస్ సెవన్ స్పీకర్ సిస్టమ్ ఉంది.

మహీంద్రా దీని ఎక్స్ షోరూం ప్రారంభ ధర కూడా రూ. 8 లక్షలుగానే ఉంది. ఈ అందుబాటు ధరల్లో ఇతర కార్ మోడళ్లకు ఇది గట్టి పోటీనిస్తుంది. ఇక్కడ రెండు పెట్రోల్ ఇంజిన్ ఆప్షన్లు, ఒక డీజిల్ పవర్‌ట్రెయిన్ ఆప్షన్ ఉంది. ఇక్కడ కూడా 6 ఎయిర్‌బ్యాగ్స్‌తో వస్తుంది. ఇంకా భద్రతా ఫీచర్లలో 3 పాయింట్ సీట్ బెల్ట్స్, ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్, లెవెల్-2 360 డిగ్రీ కెమెరా అండ్ ఫ్రంట్ రాడార్ సెన్సార్ ఉన్నాయి. ఇక్కడ కూడా 10.25 అంగుళాలతో రెండు డిజిటల్ డిస్‌ప్లేలు, వైర్‌లైస్ ఆండ్రాయిడ్ ఆటో, వైర్డ్ యాపిల్ కార్ ప్లే, ప్రీమియం సేఫ్టీ ప్యాకేజీ వంటివి ఉన్నాయి.

టాటా నెక్సన్- దీని ఎక్స్ షోరూం ప్రారంభ ధర రూ. 8 లక్షలుగానే ఉంది. ఇక్కడ 1.2 లీటర్ టర్బో ఛార్జ్‌డ్ పెట్రోల్, 1.5 లీటర్ డీజిల్ ఇంజిన్ ఆప్షన్లతో వస్తుంది. దీంట్లో కూడా సేఫ్టీ ఫీచర్ కింద 6 ఎయిర్‌బ్యాగ్స్ అందుబాటులో ఉన్నాయి. హిల్ అసిస్ట్, 360 డిగ్రీ కెమెరా ఉంది. క్యాబిన్ ఫీచర్స్ విషయానికి వస్తే 10.25 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ డిస్‌ప్లే, వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్‌ప్లే, టచ్‌స్క్రీన్ క్లైమేట్ కంట్రోల్స్, వైర్‌లెస్ ఛార్జింగ్ ప్యాడ్ వంటివి ఉన్నాయి. హ్యుందాయ్ వెన్యూ- రూ. 7.94 లక్షలు (ఎక్స్ షోరూం ధర). ఇందులో 3 ఇంజిన్ ఆప్షన్లు ఉన్నాయి. టర్బో ఛార్జ్‌డ్ 1 లీటర్ పెట్రోల్ ఇంజిన్ కూడా ఇందులో ఉంది. ఇక్కడ 8 అంగుళాల ఇన్ఫోటైన్‌మెంట్ డిస్‌ప్లే, డిజిటల్ డ్రైవర్స్ క్లస్టర్, పవర్డ్ డ్రైవర్ సీటింగ్, టూ స్టెప్ రీక్లైనింగ్ రియర్ సీట్స్, వైర్‌లెస్ ఛార్జర్ ఫీచర్లు ఉన్నాయి. దీంట్లోనూ 6 ఎయిర్‌బ్యాగ్స్ ఉన్నాయి. ఎలక్ట్రానిక్ స్టెబిలిటీ కంట్రోల్ ఆప్షన్ ఉంది. స్కోడా కైలాక్- దీని ఎక్స్ షోరూం ధర రూ. 7.89 లక్షల నుంచి ప్రారంభం అవుతుంది. ఇది సబ్‌కాంపాక్ట్ సెగ్మెంట్లోకి కొత్తగా ప్రవేశించింది. ఇక్కడ 1 లీటర్ టర్బో పెట్రోల్ ఇంజిన్ ఆప్షన్ ఉంది. దీంట్లో కూడా 8 అంగుళాల డిజిటల్ ఇన్‌స్ట్రుమెంట్ క్లస్టర్, 10.1 అంగుళాల టచ్‌స్క్రీన్ ఇన్ఫోటైన్‌మెంట్ సిస్టమ్ సపోర్టింగ్ వైర్‌లెస్ ఆండ్రాయిడ్ ఆటో, యాపిల్ కార్ ప్లే, ఆటోమేటిక్ క్లైమేట్ కంట్రోల్, వెంటిలేటెడ్ అండ్ ఎలక్ట్రికల్లీ అడ్జస్టబుల్ ఫ్రంట్ సీట్స్, వైర్‌లెస్ ఛార్జింగ్, ఎలక్ట్రిక్ సన్‌రూఫ్, టైర్ ప్రెజర్ మానిటరింగ్ సిస్టమ్ (%పూమీ%) వంటి ఫీచర్లను కలిగి ఉంది.



# కుంభమేళా పారిశుద్ధ్య కార్మికులకు సీఎం యోగి గుడ్‌న్యూస్..

ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళా శివరాత్రి పర్వదినం ఫిబ్రవరి 26వ తేదీన ఘనంగా ముగిసింది. ఈక్రమంలోనే ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ ఈరోజు అరైల్ ఘాట్‌కు వెళ్లారు. ప్రత్యేక పూజల అనంతరం 45 రోజుల పాటు అక్కడే ఉండి భక్తులకు సేవలు అందించిన వైద్యారోగ్య, పారిశుద్ధ్య కార్మికులతో కలిసి భోజనం చేశారు. అలాగే ఒక్కొక్కరికీ 10 వేల రూపాయల బోనస్ ప్రకటించారు. నేరుగా ఆ డబ్బులు కార్మికుల ఖాతాల్లోకే రాబోతున్నాయని వివరించారు. ఉత్తర ప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్‌లో జరిగిన మహా కుంభమేళా గురించి ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. దేశం నలుమూలల నుంచే కాకుండా విదేశాల నుంచి సైతం 66 కోట్లకు పైగా జనాలు అక్కడకు వెళ్లి గంగ, యమున, సరస్వతీ నదులు కలిసే త్రివేణీ సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించారు. ఈక్రమంలోనే యూపీ సర్కారు అక్కడకు వచ్చే భక్తుల కోసం ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఎలాంటి సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు అనేక జాగ్రత్తలు తీసుకుందని. ఫిబ్రవరి 26వ తేదీన కుంభమేళా ఘనంగా ముగిసిపోగా.. 45 రోజుల పాటు అక్కడే ఉండి భక్తులకు సేవలు చేసిన కార్మికులకును సీఎం యోగి ఆదిత్యనాథ్ కలిశారు. ఈక్రమంలోనే వారికి బోనస్ ప్రకటించారు.

జనవరి 13వ తేదీన ప్రారంభం అయిన మహా కుంభమేళా 45 రోజుల పాటు సాగగా.. ఫిబ్రవరి 26వ తేదీన ఘనంగా ముగిసింది. మహా శివరాత్రి పర్వదినం రోజే చివరి రోజు కాగా పెద్ద ఎత్తున భక్తులు వచ్చారు. మొత్తంగా ఈ సీజన్ లో 66 కోట్లకు పైగా భక్తులు ప్రయాగ్‌రాజ్ వెళ్లి పుణ్య స్నానాలు ఆచరించారు. ఇదంతా ఇలా ఉండగా.. యూపీ సీఎం యోగి అదిత్య నాథ్ ఈరోజు త్రివేణీ సంగమానికి వెళ్లారు. అరైల్ ఘాట్ వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆపై బోటులో ప్రయాణించి.. గంగా హారతి కార్యక్రమంలో పాల్గొన్నారు. మంత్రులు, ఎమ్మెల్యేలు సీఎం వెంట వచ్చారు. యూపీ ముఖ్యమంత్రి యోగి ఆదిత్య నాథ్‌తో పాటు డిప్యూటీ సీఎం బ్రజేష్ పాఠక్, కేపీ మౌర్య, ఇతర మంత్రులు కూడా ఉండగా.. 45 రోజుల పాటు కుంభమేళా లోనే ఉండి భక్తులకు సేవలు అందించిన పారిశుద్ధ్య, వైదారోగ్య శాఖ కార్మికులను కలిశారు. వారితో పాటే భోజనం కూడా చేశారు. సీఎం యోగి, యూపీ మంత్రివర్గం సహా.. పోలీసు అధికారులు, కార్మికులు అంతా కలిసి ఒకే చోట తిన్నారు. ఆపై ఏర్పాటు చేసిన సభలో కార్మికులతో మాట్లాడారు. అక్కడే వారందరికీ ముఖ్యమంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. 45 రోజుల పాటు కుంభమేళాలోనే ఉండి పారిశుద్ధ్య, వైద్య సేవలు అందించిన కార్మికులకు 10 వేల బోనస్ ప్రకటించారు. ఒక్కొక్కరికీ 10 వేలు ఎక్కువగా ఇస్తుండగా.. ఆ డబ్బులను నేరుగా వారి ఖాతాల్లోనే జమ చేస్తామన్నారు. అంతేకాకుండా ఏప్రిల్ నెల నుంచి శానిటేషన్ వర్కర్లకు కనీస వేతనం 16 వేలు అందే విధంగా చర్యలు చేపట్టనున్నట్లు చెప్పారు. దీంతో పాటు ఆయా కార్మికులు అందరికీ ఆయుష్మాన్ భారత్ ఆరోగ్యా బీమా కల్పించనున్నట్లు వెల్లడించారు. సీఎం ప్రకటనతో కార్మికులంతా తెగ సంబర పడిపోయారు. ఇన్ని రోజులు చాలా కష్టపడి పని చేశామని.. అందుకు ప్రతిఫలంగా 10 వేల బోనస్ ఇవ్వడం తమకు చాలా సంతోషంగా ఉందన్నారు.

# అమెరికా గోల్డ్ కార్డ్ కంటే ఎక్కువే..!






అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించిన యూఎస్ గోల్డ్ కార్డ్‌పై ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా చర్చ జరుగుతోంది. 5 మిలియన్ డాలర్లు చెల్లించిన వారికి నేరుగా వీసాను మంజూరు చేసే విధానాన్ని తీసుకువచ్చారు. అయితే ఇది కేవలం సంపన్నులకు మాత్రమే ఉపయోగపడుతుందనే వాదనలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే అసలు ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన వీసాలను ఏ దేశం జారీ చేస్తోంది. వాటి విలువ ఎంత. అందులో అమెరికా స్థానం ఎంత అనేది ఈ స్టోరీలో తెలుసుకుందాం.

ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన వీసాలు కలిగిన దేశాలు ఇవే.. అమెరికా గోల్డ్ కార్డ్ కంటే ఎక్కువే..!

అమెరికా పౌరసత్వం పొందేవారి కోసం డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం కొత్త విధానాన్ని తీసుకువచ్చిన విషయం తెలిసిందే. ప్రస్తుతం ఉన్న గ్రీన్ కార్డు స్థానంలో అమెరికా గోల్డ్ కార్డ్ వీసాను ప్రవేశపెట్టనున్నట్లు డొనాల్డ్ ట్రంప్ వెల్లడించారు. అయితే అందుకోసం 5 మిలియన్ డాలర్లు అంటే మన భారత కరెన్సీలో దాదాపు రూ.43 కోట్లకు పైనే చెల్లించాల్సి ఉంటుంది. ట్రంప్ ప్రకటనతో ఇప్పటివరకు అమెరికా పౌరసత్వం కోసం ఎదురుచూస్తున్న వారికి పెద్ద షాక్ తగిలినట్లయింది. అందులో అధికమంది భారతీయులే ఉండటం గమనార్హం. కేవలం డబ్బున్న వారికి మాత్రమే అమెరికా పౌరసత్వం, అక్కడ శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లయిందని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే అమెరికా మాత్రమే కాకుండా ఇలాంటి విధానాన్ని ప్రపంచంలోని చాలా దేశాలు అమలు చేస్తున్నాయి. అంతేకాకుండా పౌరసత్వం కల్పించేందుకు అమెరికా కంటే ఎక్కువగా వసూలు చేస్తున్నాయి.

హెన్లే అండ్ పార్ట్‌నర్స్ అనే ఇన్వెస్ట్‌మెంట్ మైగ్రేషన్ కన్సల్టింగ్ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం 30 దేశాలు ఇలాంటి వీసా ప్రోగ్రామ్స్‌ను అమలు చేస్తున్నాయి. ఈ దేశాల్లో కొన్ని తమ దేశంలో పెట్టుబడికి పెట్టినందుకు బదులుగా అక్కడ నివసించే హక్కులను అందిస్తున్నాయి. మరికొన్ని ఆయా దేశాల పౌరసత్వాలను కల్పిస్తున్నాయి. పెట్టుబడి పెడితే నివాసం కల్పించే దేశాల్లో ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన టాప్-3 దేశాలుగా న్యూజిలాండ్, సింగపూర్, హాంకాంగ్ నిలిచాయి. ఇక ప్రపంచంలోనే అత్యంత శక్తివంతమైన పాస్‌పోర్ట్‌లను కలిగి ఉన్న దేశాలు కూడా ఇవే కావడం గమనార్హం. ఇవి ప్రపంచంలోని అనేక దేశాలకు వీసా లేకుండానే ప్రయాణాన్ని అందిస్తున్నాయి.

న్యూజిలాండ్- న్యూజిలాండ్ యాక్టివ్ ఇన్వెస్టర్ ప్లస్ వీసా ప్రోగ్రామ్

ఎవరైనా ఈ న్యూజిలాండ్ యాక్టివ్ ఇన్వెస్టర్ ప్లస్ వీసా ప్రోగ్రామ్ కింద ఆ దేశంలో శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకోవాలని నిర్ణయించుకున్నవారు.. 4 ఏళ్ల కాలంలో ఈక్విటీలు, దాతృత్వం, ప్రత్యక్షంగా పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. అది కూడా 5-15 మిలియన్ న్యూజిలాండ్ డాలర్లు అంటే 2.9 - 8.6 మిలియన్ అమెరికన్ డాలర్లు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అంటే మన భారత కరెన్సీలో రూ.24.77 కోట్ల నుంచి రూ.74.33 కోట్ల వరకు న్యూజిలాండ్‌లో పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. అంతేకాకుండా ఇంగ్లీష్ మాట్లాడటం రావాలి. ఇక ఆ 4 ఏళ్లలో కనీసం 117 రోజులు న్యూజిలాండ్‌లో నివసించాల్సి ఉండాలి. ఇవన్నీ చేసి.. 4 ఏళ్ల తర్వాత న్యూజిలాండ్‌లో వారు శాశ్వత నివాసం కోసం దరఖాస్తు చేసుకోవచ్చు.

> కేవలం డబ్బున్న వారికి మాత్రమే అమెరికా పౌరసత్వం, అక్కడ శాశ్వత నివాసం ఏర్పాటు చేసుకునేందుకు అవకాశం కల్పించినట్లయిందని నిపుణులు పేర్కొంటున్నారు. అయితే అమెరికా మాత్రమే కాకుండా ఇలాంటి విధానాన్ని ప్రపంచంలోని చాలా దేశాలు అమలు చేస్తున్నాయి. అంతే కాకుండా పౌరసత్వం కల్పించేందుకు అమెరికా కంటే ఎక్కువగా వసూలు చేస్తున్నాయి. హెన్లే అండ్ పార్ట్‌నర్స్ అనే ఇన్వెస్ట్‌మెంట్ మైగ్రేషన్ కన్సల్టింగ్ సంస్థ వెల్లడించిన వివరాల ప్రకారం 30 దేశాలు ఇలాంటి వీసా ప్రోగ్రామ్స్‌ను అమలు చేస్తున్నాయి. ఈ దేశాల్లో కొన్ని తమ దేశంలో పెట్టుబడికి పెట్టినందుకు బదులుగా అక్కడ నివసించే హక్కులను అందిస్తున్నాయి. మరికొన్ని ఆయా దేశాల పౌరసత్వాలను కల్పిస్తున్నాయి.

సింగపూర్- సింగపూర్ గ్లోబర్ ఇన్వెస్టర్ ప్రోగ్రామ్

ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన వీసా ప్రోగ్రామ్‌లో సింగపూర్ రెండో స్థానంలో నిలిచింది. అయితే పెట్టుబడిదారులు సింగపూర్‌లో నివాసం పొందేందుకు పలు ఆప్షన్లు ఉన్నాయి. కొత్తది లేదా ఇప్పటికే సింగపూర్‌లో ఉన్న బిజినెస్‌లలో 10 మిలియన్ సింగపూర్ డాలర్లు అంటే 7.5 మిలియన్ అమెరికన్ డాలర్లు పెట్టుబడులు పెట్టాల్సి ఉంటుంది. అంటే మన భారత కరెన్సీలో దాదాపు రూ.65 కోట్లు. అంతేకాకుండా ఆ పెట్టుబడులతో సింగపూర్ పౌరులకు ఉద్యోగాలు కల్పిస్తున్నట్లు చూపించాల్సి ఉంటుంది. ఇది కాకుంటే.. 18.7 మిలియన్ అమెరికన్ డాలర్లు అంటే భారత కరెన్సీలో రూ.160 కోట్లను సింగపూర్‌కు చెందిన కంపెనీల్లో పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. లేని పక్షంలో సింగపూర్‌లో కనీసం 149.6 మిలియన్ అమెరికన్ డాలర్ల ఆస్తుల నిర్వహణతో కుటుంబంతో కలిసి నివసించాల్సి ఉంటుంది.

హాంకాంగ్ - హాంకాంగ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ ఎంట్రెన్స్ స్కీమ్

హాంకాంగ్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ ఎంట్రెన్స్ స్కీమ్ కింద.. పెట్టుబడి దారులు ఆ దేశంలో కనీసం 10 మిలియన్ హాంకాంగ్ డాలర్లు అంటే 1.3 మిలియన్ అమెరికన్ డాలర్లు పెట్టుబడి పెట్టాల్సి ఉంటుంది. అంటే మన కరెన్సీలో రూ.11.33 కోట్లను ప్రభుత్వ డెబిట్ సెక్యూరిటీలు, హాంకాంగ్ స్టాక్ ఎక్స్ఛేంజీలో నమోదైన కంపెనీ షేర్లలోనూ పెట్టుబడి పెట్టి ఉండాలి.

ఇలాంటి వీసా ప్రోగ్రామ్‌లు.. ఆయా దేశాల్లోని విదేశీయులను తమ దేశాల్లో భారీగా పెట్టుబడులు పెట్టించి.. వారికి శాశ్వత నివాసాన్ని కల్పిస్తాయి. ఆయా దేశాల్లో పెట్టుబడులు పెట్టి.. అక్కడ ఆశ్రయం పొంది తిరిగి డబ్బులను లాభంగా పొందవచ్చు. ఇక మరికొన్ని దేశాలు ఒకేసారి డబ్బు చెల్లిస్తే.. ఆయా దేశాల పౌరసత్వాలను అందిస్తాయి. మాల్టా దేశ పౌరసత్వాన్ని పొందాలంటే 6 లక్షల నుంచి 7.50 లక్షల యూరోలు అంటే 6.30 లక్షల డాలర్ల నుంచి 7.88 లక్షల డాలర్లను చెల్లించాల్సి ఉంటుంది. మన కరెన్సీలో అది రూ.5.50 కోట్ల నుంచి రూ.6.87 కోట్ల వరకు ఉంటుంది.

# పూణే అత్యాచార నిందితుడి అసలు రంగు ఇది!

మహారాష్ట్రలోని పూణే నగరంలో రెండు రోజుల క్రితం 26 ఏళ్ల యువతిపై అత్యాచారం జరగడం అందరికీ తెలిసిందే. ఓ ఆగంతకుడు సదరు మహిళతో మాట కలిపి ఎవరూ లేని బస్సు వద్దకు తీసుకెళ్లి దారుణానికి ఒడిగట్టాడు. పోలీసు స్టేషన్‌కు కేవలం 100 మీటర్ల దూరంలోనే ఈ ఘటన జరగ్గా.. కేసు సంచలనంగా మారింది. ఈక్రమంలోనే పోలీసులు కేసును చాలా సీరియస్‌గా తీసుకుని దర్యాప్తు చేస్తుండగా.. విస్తుపోయే విషయాలు వెలుగులోకి వచ్చాయి. వనాలుగైదు రోజులుగా ఇలా అమ్మాయిలను అత్యాచారం చేసేందుకు చూస్తున్నాడని పోలీసులు తెలుసుకున్నారు. పూణేలోని అత్యంత రద్దీగా ఉండే స్వర్‌గేట్ బస్టాండు సమీపంలో మంగళవారం రోజు ఉదయం 6 గంటల ప్రాంతంలో ఈ దారుణం చోటు చేసుకుంది. సతారా జిల్లాకు చెందిన 26 ఏళ్ల అమ్మాయి.. పలు ఇళ్లలో పని చేసుకుంటూ జీవనం సాగిస్తోంది. అయితే బస్టాపులో బస్సు కోసం ఎదురు చూస్తున్న ఈమెను గుర్తించిన నిందితుడు దత్తాత్రేయ రామదాస్ (36).. అక్కా అని పిలుస్తూ సదరు యువతితో మాట కలిపాడు. ఎక్కడికి వెళ్లాలని అడుగుతూ.. మీరు వెళ్లే బస్సు ఇక్కడ ఉండదని చెప్పాడు. పక్కనే ఉందని చూపిస్తూ ఎవరూ లేని బస్సు వద్దకు తీసుకెళ్లాడు. లోపల ఎవరూ లేకపోవడంతో సదరు యువతి బస్సు ఎక్కేందుకు ఆలోచిస్తుండగా.. చాలా మంది ప్రయాణికులు బస్సులో ఉన్నారని చెప్పి ఎక్కమన్నాడు. వారంతా లైట్లు ఆఫ్ చేస్కోవడం వల్ల మీకిలా అనిపిస్తుందనగా ఆమె లోపలికి వెళ్లింది. వెంటనే అతడు కూడా బస్సు ఎక్కి తలుపులు వేశాడు. ఆపై అత్యాచారానికి పాల్పడ్డాడు. ఆ తర్వాత వేరే బస్సు ఎక్కి అక్కడి నుంచి పారిపోయాడు. ఆపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేయగా.. నిందితుడిని పట్టుకునేందుకే గాలింపు చర్యలు చేపడుతున్నారు. తాజాగా మహారాష్ట్ర మంత్రి యోగేశ్ కదమ్.. ఘటనా స్థలాన్ని పరిశీలిం చారు. ఈ సందర్భంగానే మాట్లాడుతూ.. మంగళవారం 6 గంటల సమయంలో ఈ దారుణం జరిగిందని చెప్పారు. అరగంట లోపే సీసీటీవీ ఫుటేజీ ద్వారా నిందితుడిని కనిపెట్టినట్లు చెప్పుకొచ్చారు. అత్యాచారం చేసిన తర్వాత అతడు బస్సులో వెళ్లిపోయాడని.. నాలుగైదు రోజులుగా అతడు ఏం చేశాడో గుర్తించామన్నారు. నిందితుడు దత్తాత్రేయ రామదాస్ కావాలనే అందంగా ముస్తాబై, ఇన్‌షర్ట్ వేసుకుని మరీ పలు బస్టాండుల వెంట తిరిగాడని మంత్రి చెప్పుకొచ్చారు. అతడు అరెస్ట్ అయిన తర్వాతే అన్ని విషయాలు తెలుస్తాయని మంతి యోగేశ్ కదమ్ అన్నారు. నిందితుడిపై ఇప్పటికే అనేక కేసులు ఉన్నాయని.. 2019 నుంచి అతడు బెయిల్ మీద ఉన్నట్లు పోలీసులు చెప్పారు.

# సి.వి రామన్ సేవలు చారిత్రాత్మకకమైనవి

**అల్ఫోర్స్ స్కూల్ ఆఫ్ జెనెక్ట్ ఘనంగా జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలు**

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :**



భారత దేశంలో సైన్స్ శాస్త్రానికి సి.వి రామన్ చేసిన సేవలు చాలా చారిత్రాత్మకకమైనవి, మన దేశానికి అన్ని రంగాలలో గుర్తింపు తెచ్చే విధంగా కృషిచేసి ఎనలేని కీర్తిని భారతదేశానికి అందించారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డా?వి. నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ జెన్ నెక్స్ లో జాతీయ సైన్స్ దినోత్సవ వేడులకు ముఖ్య అతిధిగా హాజరై వారు మాట్లాడారు. ప్రారంభానికి ముందు వారు ప్రాంగణంలో ఏర్పాటు చేసినటువంటి సి.వి రామన్ చిత్రపటానికి పూలమాల వేసి వారు చేసిన సేవలను స్మరించుకున్నారు. సి.వి రామన్ భారతదేశం గర్వించదగ్గ శాస్త్రవేత్త అని వారి చిన్ననాటి నుండి సైన్స్ శాస్త్రంలో నిర్విరామంగా కృషిచేశారని, సైన్స్లో అనేక విషయాలను కనుగొన్నారు అని గుర్తుచేశారు. సైన్స్ శాస్త్రంలో మక్కువ పెంచుకొని అనేక అద్భుతాలను సృష్టించి ప్రపంచవ్యాప్తంగా ఒక ప్రత్యేక గుర్తింపు పొందాలని గుర్తుచేస్తూ వారిని అనుసరించి విద్యార్థులందరు ప్రత్యేకమైన ప్రణాళిక రూపొందించుకొని సైన్స్ లో పట్టుసాధించి నూతన ఆవిష్కరణకు సిద్ధం కావాలని సూచించారు. వారిని స్ఫూర్తిగా తీసుకొని ప్రతి విద్యార్థి సైన్స్ లో నిష్ణాతులై అందులో కొత్త విషయాలు కనుగొని ప్రపంచ అభివృద్ధికి బాసటగా నిలవాలని పిలుపునిచ్చారు. సి.వి రామన్ రూపొందించినటువంటి రామన్ ఎఫెక్ట్ గుర్తింపబడినటువంటి రోజున మన భారతదేశంలోనే కాకుండా ప్రపంచ వ్యాప్తంగా సైన్స్ దినోత్సవాన్ని చాలా వేడుకగా అట్టహాసంగా వివిధ రకాల కార్యక్రమాలతో ఘనంగా నిర్వహిస్తారని చెప్పారు. సర్ సి.వి రామన్ ప్రత్యేకమైనటువంటి పథకాల రూపొందించడమే కాకుండా వాటిని అమలు పరిచే విధానాలను చాలా చక్కగా తెలియపరుస్తూ విద్యార్థులందరూ సాంకేతిక పరిజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని, కొత్త విషయాలు తెలుసుకొని సమాజాభివృద్ధికి బాసరగా నిలవాలని వారు గుర్తు చేశారు. ప్రత్యేకంగా శ్రీరాంసాగర్ ప్రాజెక్టు హైడ్రో ఎలక్ట్రిక్ ప్రాజెక్టు, ఆటోమేటిక్ వాటర్ ప్లాంట్స్ సాగు విధానాలు సోలార్ సిస్టం మైక్రోస్కోప్ రక్తనమూనా పరిశీలన హైగ్రాలిక్ లిఫ్ట్ తదితర అద్భుత ఆవిష్కరణ ప్రదర్శించి విద్యార్థులు వారి మేథోసంపత్తిని చాటారు. కార్యక్రమంలో భాగంగా సుమారు 200 పైగా నమూనాలను ప్రదర్శించి విద్యార్థులు వారి ఆసక్తిని కనబరుస్తూ సర్ సి.వి రామన్ కి గొప్ప నివాళి అర్పించారు. ఈ వేడుకలలో భాగంగా సైన్స్ ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# లక్ష్యానికి అనుగుణంగా వస్త్ర ఉత్పత్తి చేయాలి.



**రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 28 (జనంసాక్షి)**

**హ్యాండ్లూమ్స్ టెక్స్టైల్స్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్**

**వివిధ శాఖల ప్రభుత్వ ఆర్డర్లు, ప్రొడక్షన్ పై సమీక్ష.**

**హాజరైన జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా.**

సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్ ప్రకారం లక్ష్యానికి అనుగుణంగా వస్త్రం ఉత్పత్తి చేయాలని హ్యాండ్లూమ్స్ టెక్స్టైల్స్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్ సూచించారు. సిరిసిల్ల లోని వస్త్ర పరిశ్రమకు చెందిన యజమానులు,ఆసాములు, కార్మికులు,టెక్స్టైల్ పార్క్ పరిశ్రమల యజమానులతో జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం హ్యాండ్లూమ్స్ టెక్స్టైల్స్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా తో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన ఆర్డర్ల వివరాలను వెల్లడించారు. ఇప్పటిదాకా ఎంత ఉత్పత్తి చేశారో ఆరా తీశారు. ఎస్సీ,ఎస్టీ,బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలు, సమగ్ర శిక్ష అభియాన్, మహిళా శక్తి చీరల ఆర్డర్లపై సమీక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు ఆయా శాఖలకు ఆయా శాఖల నుంచి సిరిసిల్ల వాసన పరిశ్రమకు అందించిన ఆర్డర్లలో 50 శాతం మార్చి 15 లోగా అందజేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయా వస్త్రాల ఉత్పత్తిలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. గతంలో తాము ఉత్పత్తి చేసిన వస్త్రాలకు సంబంధించిన బిల్లులు చెల్లించాలని, సెస్ విద్యుత్తు బ్యాక్ బిల్లింగ్ సమస్య పరిష్కరించాలని, యంత్రాల కొనుగోలు తదితర అంశాలకు సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా హ్యాండ్లూమ్స్ టెక్స్టైల్స్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ శైలజా రామయ్యార్ మాట్లాడుతూ జిల్లాలోని యజమానులు,ఆసాములు, కార్మికుల్లో అర్హులైన వారందరికీ బ్యాంకుల నుంచి రుణాలు అందజేసే ప్రక్రియ ప్రారంభమైందని తెలిపారు. వివిధ శాఖలకు సంబంధించిన బకాయిలను త్వరలోనే అందజేస్తామని ప్రకటించారు. విద్యుత్ బ్యాక్ బిల్లింగ్ అంశాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తామని స్పష్టం చేశారు. సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు ఆరు నెలల పాటు ఉపాధి కల్పించాలని రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. దీనికి అనుగుణంగా సిరిసిల్లలోని పరిశ్రమ బాధ్యులు ప్రణాళిక ప్రకారం ఉత్పత్తి చేయాలని, మిగతా రోజుల్లో ప్రైవేట్ మార్కెట్ నుంచి ఆర్డర్లు పొందేలా సిద్ధం కావాలని సూచించారు. మార్కెట్ అనుగుణంగా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పరిశ్రమకు సంబంధించి వివిధ సమస్యలపై చేనేత జౌళి శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఇటీవల సమీక్షించారని గుర్తు చేశారు. వస్త్ర పరిశ్రమబాధ్యులకు ఏమైనా ఇబ్బందులు ఉంటే రాతపూర్వకంగా తమ దృష్టికి తీసుకురావాలన్నారు. వాటిని త్వరితగతిన పరిష్కరిస్తామని భరోసా ఇచ్చారు. వస్త్ర పరిశ్రమ బాధ్యులు ఆయా శాఖల ఆర్డర్లు తీసుకుని పూర్తి చేసి అందజేయాలని ఆదేశించారు. దీంతో ఇంకా ఆర్డర్లు వచ్చే అవకాశం ఉంటుందని వివరించారు. ఆలస్యం అయితే పరిశ్రమపై ప్రభావం పడుతుందన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన యార్న్ బ్యాంక్ నుంచి ముడి సరుకు పంపిణీలో ఇబ్బందులు త్వరలోనే అన్ని పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో జిఎం టీజీఎస్కో రఘునందన్, ఎడిటీజీఎస్కో సందీప్ జోషి గౌతమ్,ఏడి హ్యాండ్లూమ్స్ అండ్ టెక్స్టైల్ సాగర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచాలి : జిల్లా కలెక్టర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 28 (జనం సాక్షి)**



ఉపాధి హామీ కూలీల సంఖ్య పెంచాలని, పనులు మంజూరై ప్రారంభించని వాటిని కన్వర్ట్ చేస్తూ సి సి రోడ్లు నిర్మించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ తెలిపారు. శుక్రవారం అధికారులతో కలిసి మహాత్మా గాంధీ ఉపాధి హామీ పథకం, సమగ్ర కుటుంబ సర్వే, గ్రామీణ ప్రాంతాల్లో పన్నుల వసూళ్లు, ఎల్.ఆర్.ఎస్., త్రాగునీటి సౌకర్యాలు, ఇందిరమ్మ ఇండ్లు, అంశాలపై ఎంపీడీఓ లు, తహసీల్దార్లు, ఎంపీఓ లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఉపాధిహామీ పథకంలో కూలీల సంఖ్య పెంచాలని, కనీసం రోజుకి ప్రతీ గ్రామ పంచాయతీలో 50 మంది కూలీలు పనిచేసే విధంగా ప్రోత్సహించాలని తెలిపారు. ఇప్పటివరకు పనులు మంజోరై పనులుప్రారంభించని వాటిని కన్వర్ట్ చేస్తూ సి సి రోడ్లు నిర్మించాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందని, మంజూరైన పనులు ప్రారంభించి ఈ ఆర్థిక సంవత్సరం మార్చి 31 లోగా పనులు పూర్తిచేయని వాటిని కూడా కన్వర్ట్ చేసి సి సి రోడ్లు నిర్మించాలనీ సూచించారు. సమగ్ర కుటుంబ సర్వే ఈ రోజు వరకు వచ్చిన వాటిని ఆన్ లైన్ లో పొందుపరచాలని తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరం ముగిసే లోగా పెండింగులో నున్న ఏరియర్స్, రెగ్యులర్ పన్నులు వసూలు చేయాలని తెలిపారు. ఎల్.ఆర్.ఎస్. కేంద వచ్చిన దరఖాస్తులను పరిశీలించి చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని తెలిపారు. దినపత్రికల్లో వచ్చే వ్యతిరేక వార్తలకు రిజాయిండర్ జారాచేయాలని తెలిపారు. త్రాగునీటి సమస్యలు రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని తెలిపారు. ప్రైవేటు అద్దె బోరుబావులు సిద్ధం చేసుకోవాలని సూచించారు. గ్రామ పంచాయతీ ట్రాక్టర్లను త్రాగునీటి సరఫరాకు అత్యవసర పరిస్థితులలో వినియోగించు కోవాలని తెలిపారు. ఓపెన్ బావుల్లో కోరినేషన్ చేయించాలని తెలిపారు. బోరుబావులు మరమ్మతులు చేయడానికి ఒక ఫిట్టర్ ను గ్రామ పంచాయతీ నిధులతో ఎంగేజ్ చేయాలని సూచించారు. రెసిడెన్షియల్ పాఠశాలలు, వసతి గృహాల్లో త్రాగునీటి సమస్యలు రాకుండా చూడాలని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరుకు లబ్ధిదారుల జాబితాలను ఎంపీడీఓ లు పరిశీలించి పంపించాలని తెలిపారు. ప్రతీ మండలంలో డెమోయిన్స్ట్రేషన్ క్రింద ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడం జరిగిందని, వాటిని త్వరగా నిర్మించాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో సబ్ కలెక్టర్ కిరణ్మయి, అదనపు కలెక్టర్లు వి.విక్టర్,, శ్రీనివాస్ రెడ్డి, ఆర్డీఓ ప్రభాకర్, ,జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ రావు, జడ్పీ సీఈవో చందర్, సిపిఓ రాజారాం,, మున్సిపల్ కమీషనర్ లు, ఎంపీడీఓ లు, తహసీల్దార్లు, ఎంపీఓ లు, పాల్గొన్నారు.

# పారమితలో ఘనంగా జాతీయ విజ్ఞాన దినోత్సవ వేడుకలు

**కరీంనగర్, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :**




స్థానిక నగరంలోని పారమిత పాఠశాలల్లో ప్రముఖ విజ్ఞానశాస్త్ర వేత్త సర్ సి.వి.రామన్ జన్మదినం పురస్కరించుకొని నిర్వహించిన వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు వివిధ శాస్త్రవేత్తల వేషధారణ లో నిర్వహించిన ప్రదర్శన, జల వనరులను పొదుపుగా ఎలా వాడుకోవాలి, థామస్ అల్వా ఎడిసన్ జీవిత చరిత్ర పై చేసిన నాటిక లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. విద్యార్థులు ప్రదర్శించిన దూరదర్శిని పరికరం, వివిధ రకాల డ్రోన్ లు, చంద్రయాన్ -3 మాడల్, హైడ్రాలిక్ బ్రేక్, విశ్వశక్తి పాలపుంతల గురించి చేసిన పరిశోధనలు పలువురిని ఆలోచింపచేశాయి. ఈ సందర్భంగా పారమిత పాఠశాలల చైర్మన్ డా.ఇ.ప్రసాద్ రావు మాట్లాడుతూ... విద్యార్థులు ప్రశ్నించే తత్వాన్ని అలవరుచుకొని, ప్రతీ విషయం పై సమగ్ర అవగాహన తెచ్చుకొని భవిష్యత్తులో గొప్ప ఆవిష్కరణలు చేయాలని, శాస్త్రవేత్తల ఆవిష్కరణల గురించి విజ్ఞాన సముపార్జన చేసి ప్రతీ ఒక్క విద్యార్థి సొంత ఆవిష్కరణలను రూపొందించాలని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్స్ ప్రసూన, అనూకర్ రావు, రశ్మిత, వి.యు.యం.ప్రసాద్, వినోద్ రావు, టి.యస్.వి.రమణ, హనుమంతరావు, ప్రిన్సిపాల్స్ గోపీకృష్ణ, బాలాజీ, ప్రశాంత్, సమన్వయకర్తలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# మాల్ ప్రాక్టీస్‌కు తావివ్వకుండా పదవ తరగతి పరీక్షలు నిర్వహించాలి జిల్లా కలెక్టర్

**కామారెడ్డి జిల్లా ప్రతినిధి ఫిబ్రవరి 28 (జనం సాక్షి)**



పదవ తరగతి వార్షిక పరీక్షలు మాల్ ప్రాక్టీస్ కు తావివ్వకుండా, పకడ్బందీగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో చీఫ్ సూపరింటెండెంట్ లు, డిపార్టుమెంటు అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మార్చి 21 నుండి ఏప్రిల్ 4 వరకు ఉదయం 9.30 గంటల నుండి మధ్యాహ్నం 12-30 వరకు నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. జిల్లాలో 54 కేంద్రాల్లో 12,579 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారని తెలిపారు. పరీక్ష హాలులోకి విద్యార్థులను నిశిత పరిశీలన చేసి కేంద్రంలోకి పంపించాలని తెలిపారు. పరీక్ష హాలులోకి ఎలక్ట్రానిక్ గూడ్స్, గడియారాలు అనుమతించడం జరుగదని తెలిపారు. బయటి వ్యక్తులు ఎవరు కూడా పరీక్ష కేంద్రంలోకి అనుమతించబోమని తెలిపారు. పరీక్ష ప్రశ్న పత్రాలను పోలీసు స్టేషన్ నుండి సరఫరా చేయడం జరుగుతుందని, కేంద్రాల్లో సూపరింటెండెంట్ గదిలో ఏర్పాటు చేసిన సి సి టివి ముందు ప్రశ్న పత్రాలను ఓపెన్ చేయాలనీ తెలిపారు. పరీక్షల నిర్వహణ అనంతరం ఏరోజుకారోజు జవాబు పత్రాలను పోస్టాఫీసుకు పంపించాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా విద్యా శాఖాధికారి రాజు, పరీక్షల విభాగం అధికారులు,పాల్గొన్నారు.

# గులాం అహ్మద్ హుస్సేన్ సేవలు అభినందనీయం

**ఎంఐఎం పార్టీ 67వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు వేలాదిగా తరలిరండి**

**దారుస్సలాంలో బెలూన్లు ఎగురవేసిన ఎంఐఎం జాతీయ ప్రధాన కార్యదర్శి అహ్మద్ పాషా ఖాద్రి**

**కరీంనగర్, ఫిబ్రవరి 28 (జనంసాక్షి)**



నేటి ఏఐ ఎంఐఎం పార్టీ 67వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు వేలాదిగా తరలిరావాలని, శనివారం 10గంటలకు దారుస్సలామ్ లో ఉండేట్లుగా ప్రతి ఒక్కరూ సమయ పాలన పాటించాలని ఎంఐఎం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ఎంఐఎం 67వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను పురస్కరించుకొని హైదరాబాద్ దారుస్సలాంలో ఎంఐఎం పార్టీ కరీంనగర్ అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో ప్రతి ఏటా ఎగురవేసే గ్యాస్ బెలూన్ల కార్యక్రమాన్ని, ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ వైసీ ఆదేశాల మేరకు పాషా ఖాద్రి, ఎంఐఎం కరీంనగర్ అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ తో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈసందర్భంగా పాషా ఖాద్రీ మాట్లాడుతూ గత 15 సంవత్సరాలుగా నిరాటంకంగా కరీంనగర్ ఎంఐఎం అధ్యక్షుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్, ప్రతి ఏడాదికి రెండుసార్లు, పార్టీ ఆవిర్భావ దినోత్సవం రోజున ఓసారి, జల్సా రహమతుల్ లిల్ ఆలమీన్ (మీలాద్ నబీ) సందర్భంగా మరోసారి, తన సొంత ఖర్చుతో ఎంఐఎం పార్టీ జాతీయ కార్యాలయంలో దారుస్సలాం హెడ్ క్వార్టర్ లో, ఈ బెలూన్ ఎగరవేసే కార్యక్రమం ఆనవాయితీగా వస్తుందన్నారు. గులాం అహ్మద్ హుస్సేన్, ఎంఐఎంపార్టీ పట్ల అంకితభావంతో, అధినేత అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీ పట్ల అమితమైన అభిమానంతో, ఉదార స్వభావాన్ని ప్రదర్శిస్తారని, ఎమ్మెల్యే పాషా ఖాద్రీ సంతోషం వ్యక్తం చేస్తూ.. గులాం అహ్మద్ హుస్సేన్ ను ఈసందర్భంగా ప్రత్యేకంగా అభినందిస్తూ, కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం.. అంకిత భావంతో అహర్నిశలు శ్రమించే వారికి పార్టీలో ఖచ్చితంగా గుర్తింపు ఉంటుందన్నారు. నేడు పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలకు తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పార్టీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈకార్యక్రమంలో ఎంఐఎం నాయకులు యునూస్, సయ్యద్ గౌస్ మొహియుద్దీన్, ఘాలేబ్, ఫహీం, షాకిర్ నప్హీ, అబ్దుల్లా ఖాన్, షకీలోద్దీన్, తబ్రేజ్, తన్వీర్ పాల్గొన్నారు.

# స్ట్రాంగ్ రూమ్‌లకు సీళ్లు

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :**






కరీంనగర్ అంబేద్కర్ స్టేడియంలో ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కరీంనగర్ జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, ఎన్నికల పరిశీలకులు బెన్వర్ మహేష్ దత్ ఎక్క, బుద్ధ ప్రకాష్ జ్యోతి, అడిషనల్ కలెక్టర్లు ప్రఫుల్ దేశాయ్, లక్ష్మీ కిరణ్, ట్రైనీ కలెక్టర్ అజయ్ యాదవ్ ఆధ్వర్యంలో ఎన్నికల బ్యాలెట్ బాక్సులు ఉంచిన స్ట్రాంగ్ రూమ్‌లకు శుక్రవారం తెల్లవారు జామున సీళ్లు వేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి మాట్లాడుతూ... గురువారం రాత్రి నుండి బ్యాలెట్ బాక్సులు రావడం మొదలైందని, శుక్రవారం తెల్లవారుజాము వరకు వివిధ జిల్లాల కు సంబందించిన మొత్తం బ్యాలెట్ బాక్సులు స్ట్రాంగ్ రూముకు చేర్చామని అన్నారు. ఎన్నికల అధికారుల కృషి, వివిధ రాజకీయ పార్టీలు, అభ్యర్థుల సహకరంతో ఎన్నికలు ప్రశాంతంగా జరిగాయని తెలిపారు. మార్చ్ 3 నుండి జరిగే కౌంటింగ్ ప్రక్రియ సైతం సజావుగా సాగేందుకు అందరూ సహకరించాలని కోరారు. టీచర్, పట్టభద్రుల బ్యాలెట్ బాక్స్ లను వేర్వేరుగా భద్రపరిచడం జరిగిందని అన్నారు. పోలింగ్ స్టేషన్ ల వారీగా లెక్కింపు ఉంటుందని తెలిపారు. మార్చి 8 వరకు ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉంటుందని, స్ట్రాంగ్ రూము వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. జిల్లా యంత్రాంగం స్ట్రాంగ్ రూమ్ ల వద్ద ఫైర్ సేఫ్టీ జాగ్రత్తలను తీసుకుందని, ప్రతీ రోజు ఎన్నికల అధికారులు వీటిని పర్యవేక్షస్తారని అన్నారు. అంబేద్కర్ స్టేడియం వద్ద మూడంచెల భద్రత ఏర్పాటు చేశామని, రౌండ్ ది క్లాక్ సీసీ కెమెరాలతో నిఘా ఉంటుందని కలెక్టర్ తెలిపారు.

# ముమ్మరంగా సీఎం ప్రోగ్రాం ఏర్పాట్లు

**పిన్ టూ పిన్ పర్యవేక్షిస్తున్న ఎమ్మెల్యే మేఘారెడ్డి**

**వనపర్తి బ్యూరో ఫిబ్రవరి 28 (జనంసాక్షి)**



మార్చ్ 2వ తేదీన తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు ఎనుముల రేవంత్ రెడ్డి వనపర్తికి వస్తున్న సందర్భంగా వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘ రెడ్డి ఏర్పాట్లను నిశితంగా పర్యవేక్షిస్తు న్నారు. శుక్రవారం ఆయన పాలిటెక్నిక్ లో ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభ దగ్గరుండి పర్యవేక్షించారు. జన సమీకరణకు సంబంధించి ఆయా మండలాల నాయకులతో ప్రత్యేకంగా మాట్లాడి ఏర్పాట్లకి సంబంధించిన ఆదేశాలను జారీ చేశారు. అధికారులతో సమన్వయం చేస్తూ మొదటిసారి నియోజకవర్గానికి ముఖ్యమంత్రి వస్తున్న సందర్భంగా నిర్వహించే కార్యక్రమాలన్నింటిని పూర్తిస్థాయిలో పర్యవేక్షించాలని సభను పెద్ద ఎత్తున జయప్రదం చేయాలన్నారు. ముఖ్యమంత్రి రాక సందర్భంగా నిర్వహించబోయే కార్యక్రమాల సందర్భంగా వెంకటేశ్వర స్వామి ఆలయంలో పూజ కార్యక్రమం, ముఖ్యమంత్రి అద్దెకుండి విద్యాభ్యాసన చేసిన పార్వతమ్మ ఇంటి పరిశీలన, క్యాంపు కార్యాలయంలో నిర్వహించే ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు, జూనియర్ కళాశాల ఆవరణలో చేపట్టే శంకుస్థాపన కార్యక్రమాల ఏర్పాట్లను, ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ

ముఖ్యమంత్రి హోదాలో మొట్టమొదటిసారిగా నియోజకవర్గానికి ఎనుముల రేవంత్ బహిరంగ సభను విజయవంతం చేసేందుకు ప్రతి కృషి చేయాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు నాయకులకు ఆయన పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ పట్ట నాయకులు ఆయా మండలాల నాయకులు కార్యకర్తలు అధికారులు తదితరులు ఉన్నారు.

# తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలి

**సీఎం రేవంత్ రెడ్డికి టీయూఎఫ్ ఆధ్వర్యంలో పోస్టుకార్డులు**



**చేర్యాల, ఫిబ్రవరి 28 (జనంసాక్షి)**

తెలంగాణ ఉద్యమకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం నాయకులు అందే అశోక్, అంబటి అంజయ్య, బండోజు భాస్కర్ ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం టీయూఎఫ్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్ రెడ్డి కి చేర్యాల పోస్ట్ ఆఫీసు నుంచి పోస్టుకార్డులు పంపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్ర సాధన కోసం ఎంతో మంది ఉద్యమకారులు తమ విలువైన జీవితాలను త్యాగం చేసి ఎంతో మంది అమరులయ్యారని, మరికొంత మంది కేసుల పాలై జైలు జీవితాలు గడిపి ఆర్థికంగా ఎంతో నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యమకారుల పరిస్థితిలను దృష్టిలో పెట్టుకొని కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీ మేరకు ఉద్యమకారులకు 25 వేల రూపాయల పింఛన్, 250 గజాల ఇంటి స్థలం, ఉద్యమ కారులకు గుర్తింపు కార్డు, ఉద్యమకారుల సంక్షేమ బోర్డు ను ఏర్పాటు చేసి తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2 లోపు అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈకార్యక్రమంలో ఉద్యమకారులు ఎండీ. జహూరద్దీన్, తౌట రమేష్, గజ్జల సురేందర్, మ్యాక యాదయ్య, అంజయ్య, శ్రీనివాస్, రాజు, నర్సయ్య, తదితరులు పాల్గొన్నారు.

# పదవి విరమణ పొందిన పోలీస్ అధికారులు

**కరీంనగర్ బ్యూరో, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) :**




**ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికిన పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి**

కరీంనగర్ కమీషనరేట్ వ్యాప్తంగా పదవి విరమణ పొందిన ముగ్గురు పోలీస్ అధికారులను ఘనంగా సన్మానించి, వీడ్కోలు పలికిన కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి. కరీంనగర్ కమీషనరేట్ లో పనిచేస్తూ.. పదవీకాలం ముగిసిన కమ్యూనికేషన్ విభాగం నందు పనిచేస్తున్న ఎస్సై జి. నరసింహారావు 35 సంవత్సరాలు, ఇద్దరు ఏఎస్సైలు , సీసీఆర్బి లో విధులు నిర్వహిస్తున్న యం.డి. మన్సూర్ 41 సంవత్సరాలు, రూరల్ పోలీస్ స్టేషన్ నందు పనిచేస్తున్న కె. అంజయ్య 40 సంవత్సరాలు, సుదీర్ఘ కాలంపాటు పోలీసు శాఖకు సేవలందించి శుక్రవారం రోజు పదవి విరమణ పొందారు. కమీషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలు లో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కరీంనగర్ పోలీస్ కమీషనర్ అభిషేక్ మొహంతి మాట్లాడుతూ... ప్రతీ ప్రభుత్వ ఉద్యోగికి పదవి విరమణ అనివార్యమన్నారు. ఎన్నో సవాళ్లతో కూడుకుని వున్న పోలీస్ ఉద్యోగం సంపూర్ణంగా చేసి పదవి విరమణ పొందడమే గొప్ప విజయం అన్నారు. ఇంతకాలం సేవలందించగలిగారంటే కుటుంబ సభ్యుల సహకారం కూడా ఎంతో ఉందన్నారు. పదవి విరమణ పొందుతున్న అధికారులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. అనంతరం పదవి విరమణ పొందుతున్న అధికారులకు పోలీస్ కమీషనర్ పూలమాలవేసి శాలువాతో సత్కరించారు.

వారికి జ్ఞాపికలు అందచేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ ఏ.లక్ష్మీనారాయణతో పాటుగా సీసీఆర్బి ఏసీపీ విజయ్ కుమార్, రిజర్వు ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి (సంక్షేమం), కరీంనగర్ పోలీస్ అసోసియేషన్ అధ్యక్షులు ఎస్సై మామిడి సురేందర్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

శనివారం
01 మార్చి 2025
జనంసాక్షి
www.janamsakshi.org
JANAMSAKSHI DAILY


# ఎవరిదీ.. ఈ పాపం

అదిలాబాద్ ప్రతినిధి (జనంసాక్షి)



తప్పు ఎవరు చేశారో కానీ శిక్ష మనం అనుభవిస్తున్నాం అనడానికి ఈ చిత్రం ఓ చక్కటి ఉదాహరణ, దృశ్యాన్ని చూస్తే గుర్తుకు వచ్చేది చెట్టు నీడ, తప్పు ఎవరు చేశారో ఏమో తెలియదు. పలు గ్రామాలకు వెళ్ళే రహ దారి పక్కన ఏపుగా పెరిగి ఉన్న పచ్చటి వేప చెట్టును నరికి వేయ బడి ఉన్న దృశ్యం అదిలాబాద్ జిల్లాలో కనిపించింది.దీని ఫలితంగా అన్ని కాలాల్లో మనుషులకు నీడనిస్తూ అటు పక్షులకు ఆవాసాన్ని కల్పిస్తూ ఇంకో పక్క ప్రపంచానికి ఆక్సీజన్ ను అందించే మహా వృక్షం వేపచెట్టు కనిపించ కుండా పోయింది. మండు వేసవిలో ఈ చెట్టు దారిన పోయే వారికి అమ్మలా నీడ నిచ్చేది. ఎవరో చేసిన పాపానికి శిక్ష మనం అనుభవించడం అంటే ఇదేనేమో! (వైల్డ్ లైఫ్ ఫోటోగ్రాఫర్ లింగంపల్లి కృష్ణ)

## నలుగురిపై హత్యయత్నం కేసు

బెల్లంపల్లి, ఫిబ్రవరి 28, (జనంసాక్షి)

బెల్లంపల్లి రూరల్ తాళ్ల గురిజాల పోలీస్ స్టేషన్ పరిధిలో నలుగురిపై హత్యయత్నం కేసు నమోదు అయినట్టు తాళ్ల గురిజాల ఎస్సై రమేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం జనకా పూర్ గ్రామానికి చెందిన దుర్గం మహేందర్ పై దుర్గం సాయి, దుర్గం సన్నీ, కోట బానేష్, మరొక వ్యక్తి కలిసి కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడటంతో బాధితుని తల్లి దుర్గం యశోద పిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై వివరించారు.

# ఓపెన్ కాస్ట్ వద్దని కలెక్టర్‌కు వినతి

బెల్లంపల్లి, ఫిబ్రవరి 28 (జనంసాక్షి)



బెల్లంపల్లి నియోజకవర్గంలో శాంతిఖని, శ్రావణ్ పల్లి ఓపెన్ కాస్ట్ చేయవద్దని శుక్రవారం ఓపెన్ కాస్ట్ వ్యతిరేక జేఏసీ పోరాట కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ కు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ సింగరేణి యాజమాన్యం ఓపెన్ కాస్ట్ ప్రకటించడం వల్ల బెల్లంపల్లి పట్టణానికే కాకుండా చుట్టుపక్కల దాదాపు 15 గ్రామాలకు ప్రజల జీవవైవిధ్యాన్ని, విధ్వంసాన్ని సృష్టించదలచుకున్నదని అన్నారు. ప్రజలు భయాందోళనకు గురవుతున్నారన్నారు. 1954లో ఏర్పడ్డ శాంతిఖని గని మొదలుకొని బెల్లంపల్లి పట్టణంలో అరడజను బొగ్గు బావులను బొగ్గునిక్షేపాలు, ఇంకా మిగిలి ఉండగానే అప్పటి పరిస్థితుల కారణంగా మూసివేశారని అన్నారు. వేలకోట్ల రూపాయల బొగ్గునిక్షేపాలు బెల్లంపల్లి పట్టణం కింద నిక్షిప్తమై ఉన్నాయని, జియాలజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సింగరేణి ఎక్స్ప్లోరేషన్ అన్వేషణ విభాగం నివేదికలు వెల్లడిస్తున్నాయన్నారు. ఇప్పుడు ఉన్న కరెంటు డిమాండ్, బొగ్గు డిమాండ్ వలన ఈ అపారమైన బొగ్గునిక్షేపాలను వెలికి తీయడానికి పూనుకున్నారని అన్నారు. ఒకనాడు ప్రజా ప్రయోజనాలు, జాతి ప్రయోజనాల కోసం ఏర్పడ్డ ప్రభుత్వ రంగ పరిశ్రమలు, నేడు లాభనష్టాలు బేరిజు వేసుకుంటూ వ్యాపార దృక్పథంతో ముందుకెళ్తున్న తరుణంలో పాలకవర్గాలు, తీసుకొచ్చిన సంస్కరణ మూలంగా ప్రైవేటీకరణకు, కాంట్రాక్టీకరణకు, కార్పొరేటీకరణకు గురికాబడుతున్నాయని అన్నారు. ఈ ప్రాంతాన్ని నమ్ముకుని ఉన్న ప్రజానీకానికి, వారి బిడ్డలకు ఎటువంటి ఉపాధి అవకాశాలు లేకుండా చేయడం కోసం బెల్లంపల్లి ఓపెన్ కాస్ట్ తెరమీదకు సింగరేణి యాజమాన్యం తీసుకువచ్చిందన్నారు. ఓపెన్ కాస్ట్ ల వలన ఎటువంటి ఉపాధి అవకాశాలు రాకపోగా, పచ్చని పంట పొలాలు, తోటలు, వ్యవసాయ భూములు విధ్వంసం జరగడమే కాకుండా తీవ్రమైన పర్యావరణ విఘాతం కలుగుతుం దన్నారు. భూగర్భ జలాలు అడుగంటి పోతా యని, మట్టి గుట్టలతో ఆయా ప్రాంతాలు బొందల గడ్డలుగా మారిపోతాయని అన్నారు. పర్యావరణాన్ని, జీవన వైవిధ్యాన్ని, ప్రజలు జీవించే హక్కును ధ్వంసం చేసే ఓపెన్ కాస్టను ప్రభుత్వాలు రద్దు చేయాలన్నారు. భారీ స్థాయి లో విధ్వంసం లేని ఆ ప్రాంత ప్రజలకు ఉపాధి అవకాశాలు వచ్చే అండర్ గ్రౌండ్ గనులను ప్రారంభించాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో ఓపెన్ కాస్ట్ వ్యతిరేక పోరాట కమిటీ జేఏసీ నాయకులు ఠాకూర్ మణిరాం సింగ్, గోగర్ల శంకర్, జైపాల్ సింగ్, టి శ్రీనివాస్, సొమ్ము రాజయ్య, కొమ్ము లక్ష్మణ్, ధరణి సత్యనారాయణ, తుంగల శ్రీనివాస్, ఎం వంశీ, జగన్మోహన్ రెడ్డి, ఆర్ సోమేశ్వర్ రావు, టి స్వామి, పి సత్యనారాయణ, రాజనర్సు, కే ఓదేలు, ఆర్ అశోక్ గౌడ్, జె దేవరాజ్, కొలిపాక శ్రీనివాస్, గోవర్ధన్, పులగం తిరుపతి, టిడిపి దాసరి శ్రీనివాస్, బుల్లు మల్లయ్య, ఎండి అన్వర్, తుంగల సత్యనారాయణ, కె ఓదేలు, గోమాస రాజం, సముద్రాల మురళి పాల్గొన్నారు.

# డ్రాగన్ ఫ్రూట్ పంట పరిశీలన

వరంగల్ ప్రతినిధి, ఫిబ్రవరి 28 (జనంసాక్షి)



మహాత్మగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనులను వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం చాపలబండ గ్రామం లోని ఉపాధి పనులు పరిశీలించి కూలీలతో మాట్లాడారు. కూలీలకు సౌకర్యాలు కల్పించి ఉపాధి పనులు కల్పించాలని అధికారులను ఆదేశించారు. శుక్రవారం డిఆర్డిఓ కౌసల్యతో పాటు జెడ్పి సీఈవో రామిరెడ్డి లతో కలిసి క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించారు. ఉపాధి హామీ కూలీలలతో మమేకమై ఏమైనా సమస్యలు ఉన్నాయా అంటూ.. అడిగి తెలుసుకున్నారు.కర్ణాల కుంట లో చేపడుతున్న ఈజీఎస్ పనుల ద్వారా నిర్మిస్తున్న ఫోమ్ ఫండ్ తవ్వకాల పనులను కలెక్టర్ పరిశీలించారు. కూలీలకు సరైన సౌకర్యాలు కల్పించాలని అర్హులందరికీ ఉపాధి పనులు కల్పించాలని ఆదేశించారు.అనంతరం చాపల బండ తండ లో ఈజీఎస్ పథకం క్రింద నాగపురి రాజేందర్ అనే రైతు ఎకరం భూమిలో డ్రాగన్ ఫ్రూట్ పంటను పరిశీలించి, సాగు విధానాన్ని తెలుసుకొని జిల్లా కలెక్టర్ ప్రశంసించారు. రాబోయే రోజుల్లో వ్యవసాయ రంగంలో మరింతగా ముందుకెళ్లాలని రైతుకు సూచించారు. ఉపాధి పనులలో ఎవరైనా అవకతవకలకు పాల్పడితే చర్యలు తప్పవని కలెక్టర్ అధికారులను హెచ్చరించారు. ఈ పరిశీలనలో డిఆర్డిఓ కౌశల్య దేవి జడ్పిసిఓ రామిరెడ్డి దుగ్గొండి ఎంపీడీవో అరుంధతి, ఏపీవో మోడెం శ్రీధర్ గౌడ్ పరిశీలించాలి పరిశీలించి రైతులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బ్రీడింగ్ పాండ్, డ్రాగన్ ఫ్రూట్ పనులు చూడడం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో డిఆర్డిఓ కౌసల్యాదేవి జెడ్పి సీఈవో రామ్ రెడ్డి ఎంపీడీవో అరుంధతి ఎంపీ ఓ శ్రీధర్, ఏపీఓ శ్రీనివాస్, ఈసీ రాజు, టి ఏ రాజు, బద్రు పంచాయతీ కార్యదర్శి రాజమౌళి, అసిస్టెంట్ సుమలత పాల్గొన్నారు.

# మిర్చి క్వింటాలుకు 25000 చెల్లించాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు

బండారు రవికుమార్ డిమాండ్





ఏటూరునాగారం, ఫిబ్రవరి 28(జనంసాక్షి) : మిర్చి క్వింటాలుకు రూ.25,000 వేలు చెల్లించాలని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్ డిమాండ్ చేశారు. మండలం లోని రామన్నగూడెం గ్రామంలో సిపిఎం పార్టీ రాష్ట్ర బృందం మిర్చి కల్లాలను సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్, రాష్ట్ర కమిటీ సభ్యులు సూడి క్రిష్ణ రెడ్డి, జిల్లా కార్యదర్శి బీరెడ్డి సాంబశివ మరియు జిల్లా నాయకత్వం సందర్శించడం జరిగింది. ఈ సందర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు బండారు రవికుమార్ మాట్లాడుతూ, జిల్లాలో మిర్చి 25 వేల ఎకరాలలో సాగు అవుతున్నదని గత రెండు సంవత్సరాలు నుండి మిర్చి రైతులు గిట్టుబాటు ధర లేక ఆత్మహత్యలు చేసుకోవాల్సిన పరిస్థితి వచ్చిందని పేర్కొన్నారు. ప్రధానంగా మిర్చి రైతులు ఒక ఎకరాకు కవులు పేరుతో 30 నుండి 50 వేల రూపాయలు కౌలుకు తీసుకొని దాదాపు ఎకరాకు రెండు లక్షల రూపాయలు పైన పెట్టుబడి పెట్టి పంటలు పండిస్తే ఈరోజు ఒక్కరిద్దరు రైతులకు మాత్రమే గరిష్టంగా 20 కింటాలు వస్తుందని 15 క్వింటాలకు దిగుబడి దాటే పరిస్థితి లేదని పేర్కొన్నారు. మిర్చి వరంగల్, ఖమ్మం మార్కెట్లో క్వింటాలకు 12వేలు, 13000 మించి ధర పలకట్లేదని ఈ పరిస్థితి ఉంటే రైతులు దిక్కుతోచని పరిస్థితి ఏర్పడి ఆత్మహత్య లు చేసుకోవలసి వస్తుందని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్ లో రైతులకు మద్దతు ధర చట్టం తేవాలని రైతు సంఘాలు పేర్కొన్న చట్టాన్ని అమలు చేయలేదని పేర్కొన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫారసుల ప్రకారం రైతులు పెట్టిన పెట్టుబడికి ఒకటిన్నర రేట్లు అదనంగా మద్దతు ధర ఉండాలని పేర్కొన్న అది అమలు కావడం లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మిర్చి ధర విషయంలో కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేయాలని ప్రభుత్వ కొనుగోలు సంస్థలైన మార్క్ఫెడ్, నాఫెడ్ ద్వారా క్వింటాలుకు 25 వేల రూపాయలు ఇచ్చి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ఏటూరునాగారం కేంద్రంగా కోల్డ్ స్టోరేజ్ ఏర్పాటు చెయ్యాలి అని అయన డిమాండ్ చేసారు. లేనియెడల సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో జిల్లాలో మిర్చి రైతులు కలుపుకొని పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు

చేపడతామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు సూడి కృష్ణారెడ్డి, బిరెడ్డి సాంబశివ సిపిఎం జిల్లా కార్యదర్శి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు తుమ్మ వెంకట్ రెడ్డి, ఎండి దావూద్, పొదిల్ల చిట్టిబాబు, జిల్లా కమిటీ సభ్యులు ఎండి గఫూర్ పాషా, తీగల ఆగిరెడ్డి, జగటి చిన్న, తోకల రవి, ధనుష్, బాలు రైతులు బండారి నరసింహులు, నూతక్కి రాంబాబు, గుండపు నాగులు, ఇర్సవడ్ల భాస్కర్, బండారి రంజిత్, గార రామారావు తదితరులు పాల్గొన్నారు.

## 10వ తరగతి ఫలితాల్లో నూరు శాతం ఫలితాలు సాధించాలి



జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ

భూపాలపల్లి, ఫిబ్రవరి 28 (జనం సాక్షి)

10 వతరగతిలో ఉత్తమ ఫలితాలు సాధనపై శుక్రవారం ఐడిఓసి కార్యాలయంలో మండల విద్యా శాఖ అధికారులు, ప్రధాన ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ మార్చి 21వ తేదీ నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు జరుగనున్న పదవతరగతి పరీక్షల నిర్వహణకు జిల్లా వ్యాప్తంగా 21 పరీక్షా కేంద్రాలు ఏర్పాటు చేయనున్నమని తెలిపారు. 121 పాఠశాలలకు చెందిన 1725 మంది బాలురు, 1724 మంది బాలికలు మొత్తం 3449 మంది హాజరవుతున్నట్లు తెలిపారు. ప్రతి విద్యార్థి విజయం సాధించేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని తెలిపారు. సబ్జెక్టుల్లో వెనుకంజలో ఉన్న విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. విద్యార్థులకు నమూనా పరీక్షలు నిర్వహించి విద్యార్థులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించాలని సూచించారు. విద్యార్థులను గ్రూపులుగా విభజించి ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. విద్యార్థులకు పరీక్షలు అంటే భయం లేకుండా నిస్సంకోచంగా వ్రాసే విధంగా సన్నద్ధం చేయాలని తెలిపారు. గత సంవత్సరం నూరు శాతం ఫలితాలు సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులను అభినందించారు. అలాగే తక్కువ ఫలితాలు సాధించిన పాఠశాలల ఉపాధ్యాయులను కారణాలను అడిగి తెలుసుకున్నారు. జిల్లాలో గత సంవత్సరం 92.96 శాతం ఫలితాలు సాధించామని, ఈ సంవత్సరం అధిగమించాలని జిల్లా కలెక్టర్ సూచించారు. సమావేశం ప్రారంభానికి ముందు జ్యోతి ప్రజ్వలన చేసి రామానుజం చిత్ర పటానికి పూల మాలలు వేశారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విజయలక్ష్మి, డీఈఓ రాజేందర్, డిపిఆర్ఓ శ్రీనివాస్, పరీక్షల విభాగం ప్రత్యేక అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా ఉమ్మడి పరీక్షల కార్యదర్శి చంద్ర శేఖర్ ఎంఈవోలు, ప్రదానోపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## యువత వారాహి హోమ్ ఫుడ్స్ సందర్శన

వరంగల్ ఈస్ట్, ఫిబ్రవరి 28 (జనం సాక్షి)



నెహ్రూ యువ కేంద్ర వరంగల్ యువజన వ్యవహారాలు మరియు క్రీడల మంత్రిత్వ శాఖ భారత ప్రభుత్వం ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా జాతీయ సమైక్యతను పెంపొందించడం కోసం , భిన్నత్వంలో ఏకత్వం సాధించడమే లక్ష్యంగా ఇంటర్ స్టేట్ యూత్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం లు నిర్వహించడం జరుగుతుంది. దీనిలో భాగంగా కేరళ రాష్ట్రం నుండి 27 మంది యువతి, యువకులు వరంగల్ కు రావడం జరిగింది. ఇరవై ఏడవ తారీకు నుండి మార్చి మూడో తారీకు వరకు ఐదు రోజులపాటు జరగనున్న ఇంటర్ స్టేట్ యూత్ ఎక్స్చేంజ్ ప్రోగ్రాం క్షేత్ర పర్యటనలో భాగంగా గవిచెర్ల క్రాస్ రోడ్, రంగషాయిపేటలోని వారాహి హోం ఫుడ్స్ ను సందర్శించడం జరిగింది. తెలంగాణ పిండి వంటలైన సకినాలు, మురుకులు, గర్జలు , సర్వపిండి మొదలకు పిండివంటలను ఏలా తయారు చేయాలో వారాహి హోమ్ ఫుడ్స్ నిర్వాహకులు కేరళ నుండి వచ్చిన యువతకు నేర్పారు. తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు, జీవన విధానం గురించి తెలుసుకున్నారు. అదేవిధం గా కొత్త వాడలోని చేనేత ఉత్పత్తుల తయారీ కేంద్రాలను సందర్శించారు. ఈ కార్యక్రమంలో వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ డిప్యూటీ కమిషనర్ రాజేశ్వర్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ విభిన్న భాషలతో విభిన్న మతాలతో విభిన్న సాంస్కృతిక వైవిధ్యంతో విరాజిల్లుతున్న దేశం భారతదేశం అని, అందులో తెలంగాణకు ప్రత్యేక స్థానం ఉందని, ఇతర రాష్ట్రాల సంస్కృతి సాంప్రదాయాలను యువత గౌరవించి భిన్నత్వంలో ఏకత్వం సాధించాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమ ంలో నెహ్రూ యువ కేంద్ర డిప్యూటీ డైరెక్టర్ అన్వేష్ చింతల, మెప్మా డీఎంసీ గడ్డం రేణుక, సి ఓ లు ఆకులపెల్లి ప్రవీణ్, అలీ , జాతీయ యువజన అవార్డు గ్రహీత డాక్టర్ ఆకులపల్లి మధు, వారాహి హోమ్ ఫుడ్స్ నిర్వాహకులు

బి. శ్రీకళ, యం. నాగమణి, కే. సంధ్యారాణి, ఆర్. అనిత, ch. అన్నపూర్ణ, యస్. సునీత. మహేశ్వరి మరియు నెహ్రూ కేంద్ర సూపరిండెంట్ బానోతు దేవిలాల్, వీరన్న నాయక్, దోమల నవీన్, పురుషోత్తం లు పాల్గొన్నారు.

# వ్యాపార సముదాయులకు తాళాలు

గద్వాల్ రూరల్ ఫిబ్రవరి 28 (జనంసాక్షి)




జోగులాంబ గద్వాల్ జిల్లా కేంద్రంలో మున్సిపాలిటీ పరిధిలోని ఆస్థి పన్ను బకాయిలు వున్న వ్యాపార సముదాయాలకు తాళాలు వేసిన గద్వాల్ మున్సిపల్ రెవెన్యూ అధికారి రాజేష్ కుమార్,రెవిన్యూ ఇన్స్పెక్టర్ మధు.గద్వాల పట్టణవాసులు ఇంటి,వ్యాపార సముదాయాలు, కులాయి పన్ను బకాయిలు వెంటనే చెల్లించాలని తెలిపారు.ఆస్తి పన్నులు కట్టని ప్రాపర్టీస్ కు తాళాలు వేయబడును.పట్టణ వాసులు వెంటనే పెండింగ్లో ఉన్నటువంటి ఆస్తి పన్నులను చెల్లించలని మున్సిపల్ రెవెన్యూ అధికారులు తెలియపరిచారు.

# నార్త్ కెనాల్ ద్వారా దేవాదుల నీళ్లు వదలండి

దేవాదుల ఈసీకి బిఆర్ఎస్ పార్టీ సీనియర్

నాయకులు గద్ద కుమారస్వామి వినతి

భీమదేవరపల్లి, ఫిబ్రవరి28(జనం సాక్షి)



ధర్మసాగర్ నార్త్ కెనాల్ కు నీరుని ఎప్పుడు వదులుతారని రైతులు గతంలో కెనాల్ నీరు వదిలేవారు కనీసం ఇప్పటికైనా నీరు వదలాలని ధర్మసాగర్ రిజర్వాయర్ దేవాదుల ఈసీకి, కొప్పూరు,కొత్తపల్లి,రైతులు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా శుక్రవారం భీమదేవరపల్లి మండలం కొప్పూరు గ్రామం బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గద్ద కుమార్ స్వామి మాట్లాడారు. దేవాదుల నుంచి ధర్మసాగర్ రిజర్వాయర్ ద్వారా నార్త్ కెనాల్‌కు సాగునీరు రాక చివరి ఆయకట్టుకు నీరందడం లేదు. దీంతో అదునుకు నీరందక పంటలు ఎండిపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ధర్మసాగర్ రిజర్వాయర్ నుంచి నార్త్ కెనాల్ ద్వారా ఎల్కతుర్తి మండలంలోని దామెర, జీల్గుల, జగన్నాథపూర్, పెంచికల్‌పేట, భీమదేవరపల్లి మండలం కొత్తపల్లి, కొప్పూరు ముల్కనూరు, హుజూరాబాద్ మండలం కాట్రపల్లి, దమ్మక్కపేట వరకు సాగునీటిని అందించేలా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కాల్వలను తవ్వారు. అయితే ఏ రోజు కూడా ఈ కాల్వల ద్వారా రైతులకు సాగునీరు అందలేదు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాతే అప్పటి హుస్నాబాద్, ఎమ్మెల్యేలు నీటిని విడుదల చేశారు. ఫలితంగా రైతులకు సక్రమంగా సాగునీరందడమే గాక ఆ నీటితోనే పలు గ్రామాల చెరువులను నింపుకొనేవారు. చెరువుల్లో నీళ్లు పుష్కలంగా ఉన్నందున తాగునీటికీ సమస్య రాలేదు. ప్రస్తుతం భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి తీవ్ర స్థాయిలో నీటి ఎద్దడి ఏర్పడింది. నార్త్ కెనాల్ ద్వారా దేవాదుల నీళ్లు వస్తున్నా చివరి గ్రామాలకు అందడం లేదు. దీంతో యాసంగిలో ఆయకట్టు కింద వేసిన వరి, మక్కజొన్న తదితర పంటలు పూర్తిగా ఎండిపోతున్నాయి. గతంలో ఇదే సీజన్‌లో కావాల్సిన నీళ్లు అందడంతో పంటలు పండాయని, ఇప్పుడు నీళ్లు అందడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై దేవాదుల ఈసీని వివరణ కోరగా, మూడు రోజులలో నీరు వదులుతామని చివరి గ్రామం వరకు నీరందించేలా చూస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బి ఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు గద్ద కుమారస్వామి, జనగాని సమ్మయ్య, పెట్టెం కుమారస్వామి, మిస్ మహేష్, కస్తూరి జంపయ్య, వెంకన్న, కుమారస్వామి, మొగిలి, తదితరులు ఉన్నారు.

# సంత్ సేవాలాల్ మహరాజ్ చూపిన మార్గాన్ని అనుసరించాలి

ములుగు జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్

ములుగు ప్రతినిధి,ఫిబ్రవరి 28(జనంసాక్షి) :



సంత్ సేవాలాల్ మహారాజ్ చూపిన మార్గంలో నడుస్తూ, ఆయన ఆశయాల సాధనకు కృషి చేసినప్పుడే ఆ మహనీయుడికి నిజమైన నివాళి అర్పించినట్లు అవుతుందని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు.శుక్రవారం జిల్లా కేంద్రంలో శ్రీశ్రీశ్రీ సద్గురు సంత్ సేవాలాల్ మహారాజ్ వారి 286 జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ సంత్ సేవాలాల్ జయంతి పురస్కరించుకొని శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఈ 18వ శతాబ్దంలోనే అనేక ఆంక్షలతో కూడిన నాటి సమాజంలోనూ ఎన్నో అవరోధాలను అధిగమిస్తూ సేవాలాల్ మహారాజ్ సంఘ సంస్కర్తగా పని చేశారని అన్నారు. ఆయన పరమపదించి దాదాపు రెండు వందల సంవత్సరాలు దాటినా కూడా సేవాలాల్ మహారాజ్ ను దైవంగా భావిస్తున్నారంటే ఆయన చేసిన బోధనలు, అనుసరించిన మార్గం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చని ఆయన పేర్కొన్నారు. అహింసా మార్గాన్ని అవలంభించాలని, అనర్థాలకు కారణమయ్యే మద్యపానానికి దూరంగా ఉండాలని, మహిళలను గౌరవించాలని సేవాలాల్ చేసిన బోధనలు ప్రతి ఒక్కరికి అనుసరణీయమని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సేవాలాల్ మహారాజ్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందని అన్నారు. చదువు వలననే ఏ జాతి అయినా బాగుపడుతుందని, చదువు, ఆరోగ్యం మీద శ్రద్ధ కనబరచాలని, అభివృద్ధి చెందిన వారు మిగతా వారి ఉన్నతికి పాటుపడాలని, మనం ఏం చేయాలన్న వారి స్ఫూర్తి తీసుకొవాలన్నారు. సామాజిక రుగ్మతలను పారద్రోలేందుకు సేవాలాల్ మహారాజ్ గొప్పతనం గురించి, ఆయన చేసిన బోధనలు భవిష్యత్ తరానికి సైతం అందేలా కృషి చేయాల్సిన బాధ్యతను గుర్తెరిగి ముందుకు సాగాలని ఆయన సూచించారు. గ్రంథాలయ సంస్థ చైర్మన్ రవి చందర్ మాట్లాడుతూ సంత్ సేవాలాల్ బంజారా జాతి అభివృద్ధికి, వారి అభ్యున్నతికి 22 సూత్రాలను అందించారని అన్నారు. భాష వేషము కట్టుబొట్టు మన యొక్క సాంప్రదాయాలు మన యొక్క పద్ధతులు కూడా కాపాడుకుంటేనే మనం పలానా ట్రైబల్ ఒక లంబాడి గా గుర్తిపు ఉంటుందని అన్నారు. ఏదైనా మారాలంటే మననుండే మారాలని, దానికోసం వారు చూపిన బాటలో నడవాలని అన్నారు. సామాజికంగా గిరిజనులు ఇంకా ఎదగాలని అన్నారు. సేవాలాల్ మహరాజ్ చెప్పిన విధంగా సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలని అన్నారు. మాజీ గ్రంథాలయ చేర్మెన్ పోరిక గోవిందనాయక్ మాట్లాడుతూ, బంజారా జాతి సేవాలాల్ చూపిన విధంగా ఏకతాటిపై ఉండాలని, మద్య మాంసాలకు దూరంగా వుండాలని, ఆయన ఆశయాలను సాధించి బంజారా సంస్కృతిని కాపాడుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమములో బంజారా ముఖ్య స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళా సాధికారతే ఇందిరమ్మ సర్కారు లక్ష్యం

- ఇంటర్నేషనల్ ఉమెన్ సమ్మిట్ లో మంత్రి కొండా సురేఖ





హైదరాబాద్, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) : తెలంగాణలో అధికారంలో ఉన్న ఇందిరమ్మ ప్రభుత్వం మహిళా సాధికారతకు ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని... ఉమెన్ ఎంపవర్మెంటుకి అనువైన వాతావరణాన్ని సృష్టించడానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్రంగా కృషి చేస్తున్నారని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పునరుద్ఘాటించారు. శుక్రవారం హైదరాబాదులో ఉమెన్స్ ఇంటర్నేషనల్ సమ్మిట్ ఆన్ ఆంట్రప్రెన్యూర్ అండ్ బీ2బీ ఎక్స్‌పో - 2025లో మంత్రి కొండా సురేఖ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మట్లాడుతూ చారిత్రక నాయకురాలు రాణి రుద్రమ దేవి నుంచి మొదలుకొని నేటి వ్యాపారవేత్తల వరకు మహిళలు సమాజానికి వెన్నెముకగా ఉన్నారని పేర్కొన్నారు. వారి సాధికారత సామాజిక పురోగతి మాత్రమే కాదన్నారు. ఆర్థిక వృద్ధికి కీలకమని వివరించారు. మహిళా సాధికారత కోసం సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలో తెలంగాణ ప్రభుత్వం తీసుకుంటున్న చర్యను ఈ సందర్భంగా మంత్రి వివరించారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం ద్వారా ఐదేళ్లలో లక్ష మంది మహిళా కోటీశ్వరులను తయారు చేయడానికి ప్రభుత్వ చేయూతనిస్తుందన్నారు. స్వయం సహాయక సంఘాలకు వడ్డీలేని రుణాలు, నైపుణ్యాభివృద్ధి అందజేస్తున్నట్టు వెల్లడించారు. దేశంలోనే మొదటిసారిగా రాష్ట్రం ఆధ్వర్యంలో మహిళా ఆంట్రప్రెన్యూర్ల కోసం తొలి ఇన్‌క్యూబేటర్ విహబ్ ను ఏర్పాటు చేశామన్నారు. టీ-ఐడీఈఏ, మహిళల నేతృత్వం లోని వ్యాపారాలకు ప్రత్యేక ప్రోత్సాహాలు అందిస్తున్నట్టు తెలిపారు. పాడి, వస్త్రాలు, ఆహార ప్రాసెసింగ్ వంటి రంగాలకు మద్దతిస్తున్నట్టు చెప్పారు. ఐటీ, సౌరశక్తి, లాజిస్టిక్స్ వంటి రంగాలలో మహిళలను ప్రోత్సహించడం చేస్తున్నట్టు వివరించారు. "దేశ వ్యాప్తంగా మహిళా ఆంట్రప్రెన్యూర్లకు సీఓడబ్ల్యూఈ మార్గదర్శకత్వం, ఇంకా మద్దతు అందిస్తుండడం అభినందనీయం. తెలంగాణ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థలో మహిళల పాత్రను బలపరిచేందుకు, ఇంకా వారు రాష్ట్ర ఆర్థిక పురోగతికి నాయకత్వం వహించేలా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుంది" అని మంత్రి కొండా సురేఖ తెలిపారు.

# ఏఐసీసీ రాష్ట్ర ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌తో చిన్నారెడ్డి భేటీ

- శాలువతో సన్మానించి స్వాగతం పలికిన చిన్నారెడ్డి



హైదరాబాద్, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) : ఏఐసీసీ తరపున రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ మీనాక్షి నటరాజన్‌తో రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ డాక్టర్ జిల్లెల చిన్నారెడ్డి మర్యాద పూర్వకంగా సమావేశ మాయ్యారు. హైదరాబాద్ లోని దిల్ కుశ అతిథి గృహంలో శుక్రవారం మర్యాద పూర్వకంగా భేటీ అయిన సందర్భంగా శాలువతో సన్మానించి మీనాక్షి నటరాజన్ కు జిల్లెల చిన్నారెడ్డి స్వాగతం పలికారు. ఏ.ఐ.సీ.సీ. తరపున రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ గా తొలిసారిగా హైదరాబాద్ విచ్చేసిన మీనాక్షి నటరాజన్ తో కాంగ్రెస్ పార్టీ సంస్థాగత అంశాలపై జిల్లెల చిన్నారెడ్డి చర్చించారు.

# చెరువులను సందర్శించిన హైడ్రా కమిషనర్

- పునరుద్ధరణ పనులపై క్షేత్ర స్థాయిలో పరిశీలన



హైదరాబాద్, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) : నగరంలో చెరువుల పునరుద్ధరణ, సుందరీకరణ పనులను లేక్ ప్రొటెక్షన్ కమిటీ ఛైర్మన్, హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ శుక్రవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. హైడ్రా మొదటివిడతగా చేపట్టిన 6 చెరువులలో సున్నం చెరువు, తమ్మిడికుంట, కూకట్పల్లి నల్లచెరువు, ఉప్పల్ నల్ల చెరువు, భమ్రుఖ్ ఉద్దీన్ దౌలా చెరువులను ఆయన సందర్శించారు. స్థానికులతో మాట్లాడి చెరువుల పునరుద్ధరణ పనులకు సహకరించాలని కోరారు. నగరంలో చెరువుల పునరుద్ధరణ, సుందరీకరణ పనులకు ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యత యిస్తున్నదని చెప్పారు. ఈ బాధ్యతను హైడ్రాకు రాష్ట్ర ప్రభుత్వం అప్పగించిందని అన్నారు. మిగతా ప్రభుత్వ శాఖల భాగస్వామ్యంతో ఈ పనిని చేపడుతున్నామన్నారు. స్థానికుల నుంచి కూడా మంచి సహకారం అందడం ఆనందించదగ్గ విషయమని... త్వరలోనే చెరువుల్లో జీవకళ అందరూ చూస్తారని అన్నారు. చెరువుల బఫర్ జోన్లలో యింటి స్థలాలు కోల్పోయిన వారికి ప్రభుత్వం టీడీఆర్ కింద సహాయం అందిస్తుందని చెప్పారు. ఇప్పటికే నివాసాలున్న యిళ్లను కూల్చబోమన్నారు. ఎవరూ ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. చెరువుల పరిరక్షణ, పునరుద్ధరణ, సుందరీకరణ పనుల్లో ఎక్కడా నివాసాలను తొలగించమని స్పష్టం చేశారు. చెరువుల పునరుద్ధరణ, సుందరీకరణతో మీ ప్రాంతాలన్నీ ప్రాధాన్యతను సంతరించుకుంటాయని చెప్పారు.

దాదాపు రూ. 58.50 కోట్లతో సున్నం చెరువు, తమ్మిడికుంట, కూకట్పల్లి నల్లచెరువు, ఉప్పల్ నల్లచెరువు, రాజేంద్రనగర్ లోని భమ్రుఖ్ ఉద్దీన్ దౌలా చెరువు, బతుకమ్మ కుంట చెరువులను మొదటి విడతగా హైడ్రా అభివృద్ధి చేస్తున్న విషయం విధితమే. ప్రస్తుతం ఈ చెరువులలో డీ వాటరింగ్ పనులను హైడ్రా చేపట్టింది. ముందుగా చెరువుల్లో వున్న వ్యర్థ జలాలను బయటకు పంపి.. డ్రై చేస్తున్నారు. ఇలా వివిధ దశల్లో జరుగుతున్న పనులను హైడ్రా కమిషనర్ ఏవీ రంగనాథ్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వచ్చే జూన్ నాటికి ఈ చెరువుల పునరుద్ధరణ, సుందరీకరణ పనులు పూర్తి చేయాలనే లక్ష్యంతో హైడ్రా ముందుకెళ్తోంది. నగరంలో చెరువుల పునరుద్ధరణ, సుందరీకరణ పనులకు సంబంధించి విమోస్ టెక్నోక్రాట్స్ రూపొందించిన డీపీఆర్ (డిటైల్డ్ ప్రాజెక్టు రిపోర్టు), కాన్సెప్ట్‌లను పరిశీలించి పనుల పురోగతిని సమీక్షించారు.

## టన్నెల్ బోరింగ్ మిషన్ వరకు ట్రాక్ పునరుద్ధరణ పనుల్లో

# సింగరేణి రెస్క్యూ బృందాల అవిశ్రాంత కృషి

- సొరంగ మార్గంలో రెస్క్యూ చర్యలను పర్యవేక్షిస్తున్న సంస్థ ఛైర్మన్, ఎండీ ఎన్.బలరామ్
- ట్రాక్‌పై నిలిచిన బురద మట్టిని కూడా వేగవంతంగా తొలగిస్తున్న బృందాలు
- నిరాటంకంగా పూర్తి చేయడం కోసం 250 మంది రెస్క్యూ సిబ్బందిని 4 షిఫ్ట్ లుగా కేటాయింపు
- ప్రతి షిఫ్టులో చక్కని నైపుణ్యత, సుదీర్ఘ అనుభవం
- శిక్షణ గల సింగరేణి రెస్క్యూ బృందాల సేవలు
- అత్యాధునిక గ్యాస్ కట్టర్స్ ను వినియోగిస్తున్న సింగరేణి రెస్క్యూ బృందాలు

(ప్రత్యేక ప్రతినిధి/ జనం సాక్షి)





రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఎస్.ఎల్.బి.సి. వద్ద కీలక రెస్క్యూ ఆపరేషన్లో సింగరేణి బృందాలు ఉత్సాహంగా పాల్గొంటున్నాయి. శుక్రవారం సాహసోపేతంగా సొరంగ మార్గంలో జరుగుతున్న రెస్క్యూ చర్యలను సంస్థ ఛైర్మన్ మరియు ఎండీ ఎన్.బలరామ్ స్వయంగా పరిశీలించారు. సంస్థ ఛైర్మన్ తమతో పాటు ఈ రెస్క్యూ ఆపరేషన్లో పాల్గొనడంతో సిబ్బంది మరింత ఉత్సాహంతో పని చేస్తున్నారు. ఎన్‌డిఆర్ఎఫ్ కల్నల్‌తో కలిసి సింగరేణి ఛైర్మన్ 14 కిలోమీటర్ల సొరంగ మార్గంలో ప్రమాద స్థలి చేరువ వరకు పరిస్థితిని సహాయక చర్యలను పరిశీలించారు. సింగరేణి రెస్క్యూ బృందాల ఆధ్వర్యంలో జరుగుతున్న గ్యాస్ కటింగ్ పనులను ఆయన దగ్గరగా ఉండి పర్యవేక్షించారు. ట్రాకు పునరుద్ధరణ జరగాలంటే దానిపై కూలిన టన్నెల్ బోరింగ్ మిషన్ (టీ.బి.ఎం) భాగాలను తొలగించాల్సి ఉంటుంది. ఈ పనిలో సింగరేణి రెస్క్యూ సిబ్బంది తమ వద్ద గల అత్యాధునిక గ్యాస్ కటింగ్ యంత్రాల ద్వారా ఇనుప పైపులను, గడ్డర్లను కత్తిరిస్తూ వేరు పరుస్తున్నారు. ప్రమాదం జరిగిన ప్రదేశానికి చేరుకోవడం కోసం ఈ ట్రాక్ పునరుద్ధరణ అత్యవసరం కనుక దీనిపై సింగరేణి రెస్క్యూ బృందాలు నిరంతరాయంగా పనిచేస్తున్నాయి. అదే సమయంలో ట్రాక్ మీద పేరుకుని ఉన్న బురద మట్టిని కూడా రెస్క్యూ బృందాలు తొలగిస్తున్నాయి. మొత్తం 250 మంది సింగరేణి రెస్క్యూ సభ్యులు 24 గంటలు ఈ పనిలో పాల్గొనేందుకు వీరిని నాలుగు షిఫ్టులకు తగిన విధంగా విభజించడం జరిగింది. రక్షణ సూత్రాలు పాటిస్తూ ఇచ్చిన పనిని సమర్థంగా పూర్తి చేయాలని సంస్థ ఛైర్మన్ రెస్క్యూ సిబ్బందికి సూచించారు. ఇదిలా ఉండగా ఎన్జీఆర్ఐ బృందాలు వారు ప్రమాద స్థలానికి చేరుకోవడానికి భూమి తొలిచే యంత్రాల (గ్రౌండ్ పెనట్రేటింగ్ ఇన్స్ట్రుమెంట్స్) ద్వారా ఐదు అనుకూలమైన ప్రాంతాలను ఎంపిక చేశారు. ఈ ప్రదేశాలలో తవ్వకాన్ని సమర్థంగా నిర్వహించడం కోసం ఎన్డిఆర్ఎఫ్ మరియు సింగరేణి బృందాలకు పనులు పురమాయించారు. దీనిలో సింగరేణి రెస్క్యూ బృందాలు అలుపెరగకుండా సమర్థంగా ముందుకు సాగుతున్నాయి. శుక్రవారం ప్రారంభమైన ఈ రెస్క్యూ ఆపరేషన్ ప్రత్యక్ష పరిశీలన, పర్యవేక్షణలో సంస్థ ఛైర్మన్ ఎన్.బలరామ్ తోపాటు జనరల్ మేనేజర్ రెస్క్యూ శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు. అలుపెరగకుండా, అంకితభావంతో రెస్క్యూ సేవలందిస్తున్న సిబ్బందిని ఛైర్మన్ అభినందించారు. ఇచ్చిన లక్ష్యాలు సాధించాలని ఆయన సూచించారు

# వరంగల్ వాసులకు దశాబ్ద కాలం కోరిక నేరవేరింది

- మామునూరు ఎయిర్‌పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- మంత్రి కొండా సురేఖ వెల్లడి



హైదరాబాదు, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) : వరంగల్ జిల్లాలోని మామునూరు ఎయిర్‌పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం జిల్లా వాసులకు దశాబ్ద కాలం కోరిక నేరవేరిందని తెలంగాణ రాష్ట్ర అటవీ పర్యావరణ దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అభిప్రాయపడ్డారు. ఇది తమ సీఎం రేవత్‌రెడ్డి, ఉన్నతాధికారులు స్థానిక ప్రజాప్రతినిధులు వరంగల్ జిల్లా ప్రజల అదృష్టమని ఆమె వ్యాఖ్యానించారు. వరంగల్ జిల్లా వాసులు గాల్లో తేలే వార్త ఇది అని పేర్కొన్నారు. ఓరుగల్లు వాసులు ఎళ్ల తరబడి ఎదురుచూస్తున్న కలను నెరవేర్చే దిశగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం వేగంగా అడుగులు వేసింది అన్నారు. మామునూరు ఎయిర్ పోర్టు నిర్మాణానికి కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇచ్చాక మంత్రి కొండా సురేఖ శుక్రవారం మీడియాకి ఒక ప్రకటన విడుదల చేశారు. మమునూరు ఎయిర్ పోర్టు నిర్మాణం కోసం కేంద్ర ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం హర్షణీయం అన్నారు. తమ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ అంశంపై తీవ్రంగా చేసినట్టు చెప్పారు. మామునూరు విమానాశ్రయాన్ని అతి త్వరగా అందుబాటులోకి తీసుకురానున్నట్టు ఆమె వెల్లడించారు. ఈక్రమంలోనే.. మామునూరు ఎయిర్ పోర్టుకు సంబంధించిన భూసేకరణ విషయంలో తమ ప్రాంత ప్రజలు, స్థానిక ప్రజాప్రతినిధులు పెద్ద ఎత్తున సహకారం అందించాలని చెప్పారు. మామునూరు ఎయిర్ పోర్టును అందుబాటులోకి తీసుకొచ్చేందుకు రేవంత్ ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందని కొనియాడారు. జిల్లా మంత్రిగా తాను జిల్లాకు చెందిన ఎంపీ, ఎమ్మెల్యేలు, అధికారులతో కలిసి.. మామునూరు ఎయిర్‌పోర్టు ఏర్పాటుకు సంబంధించిన భూసేకరణ నిమిత్తం స్థల పరిశీలన పలుమార్లు చేసినట్టు చెప్పారు. ఆ సందర్భంలో... గాడిపల్లి గుంటూరుపల్లి, నక్కలపల్లి గ్రామస్తులతో మంత్రి హోదాలో సమావేశమై విమానాశ్రయ ఏర్పాటుకు కావల్సిన 253 ఎకరాల భూసేకరణ నిమిత్తం రైతులతో సంప్రదింపులు జరిపినట్టు స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే వరంగల్ జిల్లా మొత్తం పెద్ద ఎత్తున అభివృద్ధి జరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# బీఆర్ఎస్ కార్యకర్తలను వేధించే ఎవరినీ వదిలిపెట్టం

- పింక్ బుక్కులో అందరి చిట్టా రాసుకుంటాం
- కార్మికుల ప్రాణాలంటే కాంగ్రెస్ కు లెక్క లేదా?
- బీసీ రిజర్వేషన్ల పెంపునకు మూడు వేర్వేరు బిల్లులను పెట్టాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



నాగర్ కర్నూల్ జిల్లా బ్యూరో, ఫిబ్రవరి 28(జనంసాక్షి): బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తలను వేధించే వారు ఎంత పెద్ద నాయకులైనా, అధికారులైనా వదిలిపెట్టేలేదే లేదని ఆ పార్టీ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత హెచ్చరించారు. "సీఎం సొంత జిల్లా నుంచి చెబుతున్నా... కచ్చితంగా పింక్ బుక్కు మైంటైన్ చేస్తాం. పింక్ బుక్కులో అందరి చిట్టా రాసుకుంటాం. మాకూ టైమ్ వస్తుంది... అప్పుడు అందరి సంగతి చెప్తాం" అని తీవ్ర స్థాయిలో హెచ్చరించారు. తెలంగాణ జాగృతి అధ్వర్యంలో బీసీ సంఘాల రౌండ్ టేబుల్ సమావేశంలో పాల్గొనడానికి శనివారం నాగర్ కర్నూల్ జిల్లా పర్యటనకు విచ్చేసిన ఎమ్మెల్సీ కవిత సింగోటంలోని శ్రీ లక్ష్మీ నరసింహాస్వామి వారి దేవాలయాన్ని సందర్శించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత మాట్లాడుతూ... మంత్రి జూపల్లి కృష్ణారావు బీఆర్ఎస్ కార్యకర్తలను తీవ్రంగా వేధిస్తున్నారని, చిన్న విమర్శ చేసినా, ప్రశ్నించినా అక్రమ కేసులు పెట్టిస్తున్నార మండిపడ్డారు. శ్రీధర్ రెడ్డి అనే కార్యకర్తను దారుణంగా చంపేసినప్పటికీ పోలీసులు కేసు దర్యాప్తును ముమ్మరం చేయడం లేదని, కాంగ్రెస్ నాయకులు హంతకులకు కొమ్ముకాస్తున్నారని ధ్వజమెత్తారు. కొల్లాపూర్ నియోజక వర్గానికి జూపల్లి కృష్ణారావు టూరిస్ట్ మంత్రిగా వ్యవహరిస్తున్నారని, ఎప్పుడో ఒకసారి మాత్రమే ఆయన నియోజకవర్గానికి వస్తున్నారని విమర్శించారు. సన్న వడ్లకు బోనస్ అని చెప్పి రాష్ట్ర ప్రభుత్వం బోగస్ చేసిందని, రైతు భరోసా, రుణమాఫీ గ్రామాల్లో సగం మందికి కూడా రాలేదని ఎండగట్టారు. గత 15 నెలల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టుల్లో ఒక తట్ట మట్టి కూడా ఎత్తిపోయలేదని ఎండగట్టారు. కొడంగల్ - నారాయణపేట్ ఎత్తిపోతల పథకం వల్ల పాలమూరు రంగారెడ్డి కంపోనెంట్స్ తీసివేయడం వల్ల 4.5 లక్షల ఎకరాలకు నష్టం జరుగుతుందని, ఈ ప్రాజెక్టుకు బీమా నుంచి కాకుండా జూరాల నుంచి నీటిని తీసుకుంటే మంచిదని ఇంజనీర్లు చెబుతున్నారని, ప్రభుత్వం ఈ సూచనను పరిగణలోకి తీసుకోవాలని సూచించారు.

## పనిఒత్తిడితో మనస్తాపంతో

# ఆర్టీసీ కండక్టర్ ఆత్మహత్య

యాచారం, ఫిబ్రవరి28 (జనంసాక్షి) : పని ఒత్తిడి కారణంగా మనస్థాపానికి గురై ఓ ఆర్టీసీ కండక్టర్ ఆత్మహత్య చేసుకున్న ఘటన యాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్నది.సీఐ నందీశ్వర్ రెడ్డి, స్థానికులు తెలిపిన కథనం ప్రకారం.. యాచారం మండల పరిధిలోని గాండ్లగూడ గ్రామానికి చెందిన కోరే అంజయ్య (40) ఇబ్రహీంపట్నం ఆర్టీసీ డిపోలో కండక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. గత కొంతకాలంగా ఒత్తిడికి గురవుతున్నాడు. దీంతో ఆయన 15 రోజుల క్రితం పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డారు. గమనించిన కుటుంబ సభ్యులు దవాఖానకు తరలించారు. చికిత్స పొందుతూ మామూలు స్థితికి చేరుకున్నారు. అయితే గురువారం సాయంత్రం మళ్లీ పురుగుల మందు తాగి ఆత్మహత్య యత్నానికి పాల్పడ్డాడు. దీంతో అతడిని హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానకు తరలించారు. పరిస్థితి విషమించడంతో శుక్రవారం ఉదయం తుదిశ్వాస విడిచారు. ఆర్టీసీ అధికారుల ఒత్తిడితోనే అంజయ్య పలుమార్లు మానసికంగా ఇబ్బందులకు గురైనట్లు స్థానికులు పేర్కొంటున్నారు. కేసు దర్యాప్తు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# భూకంపాల గుర్తింపుపై అధ్యయనం చేసినందుకు అనుమల్ల శ్రీధర్‌కు డాక్టరేట్

- ప్రదానం చేసిన ఉస్మానియా యూనివర్సిటీ



హైదరాబాద్, ఫిబ్రవరి28 (జనంసాక్షి) : భూకంపాలను ముందుగానే గుర్తించి, నియంత్రణా చర్యలకు ఉన్న అవకాశాలపై అధ్యయనం చేసినందుకు జగిత్యాల జిల్లా కేంద్రానికి చెందిన అనుమల్ల శ్రీధర్‌కు దేశంలోనే ప్రముఖ విద్యాసంస్థ అయినా ఉస్మానియా యూనివర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఓయూలో జియోఫిజిక్స్‌లో పీజీ పూర్తిచేసి, ప్రొ. రామరాజ్ మాథుర్ మార్గదర్శకత్వంలో రీసెర్చ్ స్కాలర్‌గా భూకంపాల గుర్తింపునకు అధునాతన పద్ధతులు, విపత్తు నిర్వహణ సంసిద్ధత వ్యూహాలను మరింత బలోపేతం చేయడంపై శ్రీధర్ అధ్యయనం చేశారు. దేశంలోని 'దక్షిణ అండమాన్‌లోని పోర్ట్ బ్లెయిర్‌లో షాలో యాక్టివ్ ఫాల్ట్ సిగ్నేచర్‌లను గుర్తించే రిమోట్ సెన్సింగ్ జియోఫిజికల్ టెక్నిక్స్' అనే అంశంపై లోతైన పరిశోధన చేశారు. భూకంపాలు రాక ముందే గుర్తించడమే ఈ అధ్యయనం లక్ష్యం కాగా, పోర్ట్ బ్లెయిర్ భూకంపం తర్వాత అధునాతన ఫాల్ట్ డిటెక్షన్ పద్ధతుల అవసరాన్ని తన పరిశోధన ద్వారా చాటి చెప్పారు. జియోలాజికల్ సర్వే కోసం అయస్కాంత, విద్యుదయస్కాంత పరికరాలను ఉపయోగించి సరికొత్త విధానానికి రూపకల్పన చేయగా, దీనిద్వారా భూకంప అంచనా, విపత్తుల నిర్వహణకు అవసరమైన సమాచారాన్ని సేకరించే వీలు కలిగింది. తన అధ్యయనం ద్వారా ప్రభుత్వ సంస్థలు విపత్తు నిర్వహణ బృందాలను ముందుగానే అప్రమత్తం చేసే అవకాశం ఉంటుందని, అదేవిధంగా ముందస్తు హెచ్చరిక వ్యవస్థలను సంసిద్ధత వ్యూహాలను మెరుగుపరచడానికి కచ్చితమైన సమాచారంతో సన్నద్ధం చేయడానికి తోడ్పడతుందని శ్రీధర్ పేర్కొన్నారు.

# అధికారులను నిర్బంధించిన రైతులు

**కింది ఆయకట్టుకు నీళ్లు విడుదల చేయాలని డిమాండ్**

బోధన్ రూరల్, ఫిబ్రవరి 28 (జనంసాక్షి) : రైతుల ఫిర్యాదుతో గ్రామానికి పరిశీలనకు వచ్చిన అధికారులను రైతులు నిర్బంధించిన సంఘటన శుక్రవారం చోటుచేసుకుంది. నిజాంసాగర్ డి 28 కెనాల్‌లో నీళ్లు రావడం లేదని ఫిర్యాదు చేయడంతో ఇరిగేషన్ అధికారులు కెనాల్‌ను పరిశీలించడానికి శుక్రవారం గ్రామానికి వచ్చారు. దీంతో ఆగ్రహించిన రైతులు నిజాంసాగర్ కెనాల్ నీటిని విడుదల చేసి వారం రోజులు కావస్తున్న కింది ఆయకట్టుకు నీళ్లు రాకపోవడంతో రైతులు ఇరిగేషన్ అధికారులను గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్బంధించి తాళం వేశారు. నిజాంసాగర్ కెనాల్ నీరు చివరి ఆయకట్టు వరకు అందకపోవడంతో పంటలు ఎండుతున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇరిగేషన్ అధికారులకు ఎన్ని సార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యాలయంలో తాళం వేశామని రైతులు చెప్పారు. విషయం తెలుసుకున్న బోధన్ రూరల్ సీఐ విజయబాబు, బోధన్ రూరల్ ఎస్సై మచ్చేందర్‌రెడ్డి, సంఘటన స్థలాన్ని చేరుకొని రైతులతో మాట్లాడి సముదాయించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at #119&120, 1st Floor, Down Town Mall, Lakdikapul, Hyderabad, Telangana-500004. Editor : M.M.RAHMAN RNINo. APTEL/2013/50370